సోమవారం
15•7•2019
కరీంనగర్

• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 20

• పేజీలు: 16 +16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీ రేటు
జనరల్/ సంస్థ 7.65%
వయో వృద్ధులు 7.90%
12 నెలలకు పైన 18 నెలల వరకు
ది కాస్మోస్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్
కింగ్ కోఠి-040-23231705




చంద్రయాన్-2

# జాముురాతిరి జాబిలమ్మ చెంతకు

సాహో ఇస్రో

- వేకువజామున 2:51 గంటలకు నింగిలోకి 'బాహుబలి'
- ప్రతిష్ఠాత్మక ప్రయోగానికి సిద్ధమైన శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం
- 20 గంటల కౌంట్‌డౌన్ ప్రారంభించిన శాస్త్రవేత్తలు
- దాదాపు 50 రోజుల ప్రయాణం అనంతరం చంద్రుడి చెంతకు
- సెప్టెంబర్ 6 లేదా 7న ల్యాండర్ దిగే అవకాశం

**శ్రీహరికోట, జూలై 14:** జాబిలమ్మను అందుకునేందుకు 'చంద్రయానం' మొదలైంది. చంద్రుడి ఉపరితలాన్ని పరిశోధించేందుకు చేపట్టిన 'చంద్రయాన్-2' ప్రయోగానికి సర్వం సిద్ధమైంది. భారత అంతరిక్ష రంగ చరిత్రలోనే ప్రతిష్ఠాత్మక ప్రయోగానికి నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీశ్‌ధావన్ అంతరిక్ష కేంద్రం వేదిక కానున్నది. సోమవారం వేకువజామున 2:51 గంటలకు చంద్రయాన్-2 నింగిలోకి దూసుకెళ్లనున్నది. ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగానికి 20 గంటలు ముందుగా ఆదివారం ఉదయం 6:51 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించారు. ఈ ప్రక్రియలో చంద్రయాన్-2లోని అన్ని వ్యవస్థలకు తుది పరీక్షలు నిర్వహించారు. రాకెట్ ఇంజిన్లలో ఇంధనాన్ని నింపారు. అపోలో మిషన్ ద్వారా

మిగతా 4వ పేజీలో




## చంద్రయాన్-2 గమనం ఇలా..

- 16 నిమిషాల ప్రయాణం అనంతరం 170 కి.మీ.ల ఎత్తులో ఉన్న దీర్ఘవృత్తాకార కక్ష్య (ఓవల్ ఆర్బిట్)లోకి చంద్రయాన్-2ను చేరుతుంది.
- చంద్రయాన్-2.. 17 రోజులు ప్రయాణించి భూకక్ష్యలో చివరి స్థానానికి చేరుకుంటుంది. అప్పటివరకు 1.05 లక్షల కి.మీ. దూరం ప్రయాణాన్ని పూర్తి చేస్తుంది.
- ఆ తర్వాత రెండు రోజుల్లో చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశిస్తుంది.
- కొన్ని రోజుల ప్రయాణం అనంతరం చంద్రుడికి 100 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న కక్ష్యలోకి చేరుకుంటుంది.
- చంద్రయాన్-2 నుంచి ల్యాండర్ విడివడుతుంది.




ఆదివారం హైదరాబాద్ గాంధీనగర్‌లో టీఆర్‌ఎస్ సభ్యత్వాన్ని తీసుకున్న జీహెచ్ఎంసీ కార్మికురాలు ఇందిర

## తుదిదశకు సభ్యత్వ నమోదు

ఒక్కో నియోజకవర్గంలో 50 వేలు లక్ష్యం

కొన్ని నియోజకవర్గాల్లో లక్ష్యాన్ని దాటిన సభ్యత్వాలు

ఉత్సాహంగా పాల్గొంటున్న మంత్రులు, పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు

2

ఇంటర్ సెకండ్ అడ్వాన్స్‌డ్

## ఫలితాలు విడుదల

జనరల్‌లో 37%, వొకేషనల్‌లో 51.2% ఉత్తీర్ణత

ఫలితాలు విడుదల చేసిన ఇంటర్ బోర్డు కార్యదర్శి ఏ అశోక్

ఆన్‌లైన్ ద్వారా మార్కుల మెమోల డౌన్‌లోడ్‌కు అవకాశం

రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు రేపటి నుంచి 20 వరకు గడువు

2

విశ్వవిజేత

## ఇంగ్లండ్



ప్రపంచకప్ ఫైనల్లో కివీస్‌పై ఉత్కంఠ విజయం

సూపర్ ఓవర్‌లో తేలిన ఫలితం

స్టోక్స్ సూపర్ షో

ఆటలో



## జొకోవిచ్ పాంచ్ పటాకా

ఐదోసారి వింబుల్డన్ టైటిల్ కైవసం

ఫైనల్లో ఫెదరర్‌పై అద్భుత విజయం



ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి పంప్‌హౌజ్‌లో 5 మోటర్ల నుంచి గ్రావిటీ కెనాల్‌లోకి దుంకుతున్న గోదావరి జలాలు

## ఐదో మోటరూ ఆరంభం

కన్నెపల్లిలో ఐదు మోటర్లతో 10,500 క్యూసెక్కులు ఎత్తిపోత

గోదావరిలో 12,200 క్యూసెక్కుల ప్రవాహం

మేడిగడ్డ బరాజ్‌లో 6 టీఎంసీలు నిల్వ

ప్రాణహిత సంగమందాకా మేడిగడ్డ బ్యాక్‌వాటర్

అన్నారం బరాజ్‌కు 4 టీఎంసీల చేరిక

పోతారందాకా ఎదురెక్కిన అన్నారం జలాలు

మరో రెండున్నర కిలోమీటర్ల దూరంలో అన్నారం పంప్‌హౌస్

కాసిపేట ఎత్తిపోతలకు సర్వం సిద్ధం!

3

## అమ్మిన భూమిపై కన్నుపడింది!

- అధికారులతో కుమ్మక్కై రికార్డుల్లో పేరు మార్పు
- 32 ఎకరాలను 17 ఏండ్ల కింద అమ్మి ఇప్పుడు బెదిరింపు
- విచారణ చేపట్టి ఆర్డీవోకు నివేదించిన తాసిల్దార్
- ఏడాదైనా స్పందించని ఉన్నతాధికారులు
- న్యాయం కోసం నల్లగొండ జిల్లా పసునూరువాసి కామిశెట్టి బుచ్చయ్య వేడుకోలు

ధర్మగంట

9




# 1,906 మంది స్కూల్ అసిస్టెంట్లకు పోస్టింగ్ ఆర్డర్లు

- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ్‌కుమార్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పాఠశాల విద్యాశాఖలో శని, ఆదివారాల్లో మొత్తం 1,906 మంది స్కూల్‌అసిస్టెంట్లకు పోస్టింగ్ ఆర్డర్లు జారీచేశామని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం 1,591 మందికి ఆర్డర్లు ఇవ్వగా, కౌన్సెలింగ్‌కు హాజరుకాని మిగతావారికి ఆదివారం అందజేశామన్నారు. అదిలాబాద్ జిల్లాలో 67 మందికి, కరీంనగర్ జిల్లాలో 56 మందికి, మెదక్ జిల్లాలో 192 మందికి ఆదివారం పోస్టింగ్ ఇచ్చినట్టు తెలిపారు. టీఆర్టీ నియామకాలు నిబంధనలు ప్రకారమే జరిగాయన్నారు.

# వచ్చేవారం కానిస్టేబుల్ ఫలితాలు!

- భర్తీకానున్న 16,925 పీసీ పోస్టులు
- ఫలితాల విడుదలకు టీఎస్‌ఎల్పీఆర్బీ కసరత్తు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎస్సై ఫలితాలు వెలువడటంతో తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్‌ఎల్పీఆర్బీ) అధికారులు.. కానిస్టేబుల్ పోస్టుల తుది ఫలితాల విడుదలపై కసరత్తు ముమ్మరంచేశారు. వారంరోజుల్లో ఈ ఫలితాలు విడుదలయ్యే అవకాశాలున్నాయి. సివిల్, ఏఆర్, ఏపీఎస్పీసహా ఇతర విభాగాల్లో కలిపి మొత్తం 16,925 మంది కానిస్టేబుళ్లు భర్తీ కానున్నారు. తొలుత నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం మొత్తం 1,272 ఎస్సై, తత్సమాన పోస్టులకు టీఎస్‌ఎల్పీఆర్బీ రెండ్రోజుల క్రితం తుది ఫలితాలు వెల్లడించింది. వీరందరికీ త్వరలోనే మెడికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. గతంలో తొలుత కానిస్టేబుల్ ఫలితాల తర్వాత ఎస్సై పోస్టులకు తుది ఫలితాలు వెలువడేవి. దీంతో తొలుత కానిస్టేబుళ్లుగా సెలక్టయిన అభ్యర్థులు ఎక్కడ ప్రభుత్వ ఉద్యోగాన్ని కోల్పోతామోనన్న భయంతో ఆ ఉద్యోగంలో చేరేవారు. తర్వాత వీరిలో 10 నుంచి 15 శాతం వరకు అభ్యర్థులు ఎస్సైకి ఎంపికయ్యేవారు. దీంతో బ్యాక్‌లాగ్‌పోస్టులు మిగిలేవి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఈసారి రిక్రూట్‌మెంట్‌లో తొలుత ఎస్సై, తర్వాత కానిస్టేబుల్ పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగిస్తూ వచ్చారు. తుది ఫలితాల్లోనూ ఇదే పద్ధతి పాటిస్తున్నారు.



ఆదివారం హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణారావు భవన్ నుంచి తెలంగాణ స్టేట్ టెక్నికల్ సర్వీస్ లిమిటెడ్ కార్యాలయ సామగ్రిని తరలిస్తున్న సిబ్బంది.





ఆదివారం గోల్కొండ కోటకు పోటెత్తిన భక్తజనులు

# బోనమెత్తిన భాగ్యనగరం

**హైదరాబాద్ సిటీ బ్యూరో, నమస్తే తెలంగాణ:** జంట నగరాల్లో బోనాల పండుగ వేడుకలు అంబరాన్ని తాకాయి. ఆదివారం ప్రత్యేక ఉత్సవశోభను సంతరించుకున్నాయి. గోల్కొండ కోట భక్తులతో కిటకిటలాడింది. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయం భక్తజన సంద్రమైంది. గోల్కొండ జగదాంబిక అమ్మవారికి ఆదివారం నాలుగో బోనాన్ని భక్తులు పెద్దసంఖ్యలో సమర్పించారు. తొట్టెల సమర్పణకు ఊరేగింపుగా వచ్చినవారికి లంగర్‌హౌస్ చౌరస్తా నుంచి గోల్కొండ ఫతే దర్వాజ వరకు వివిధ బస్తీ, కుల సంఘాలు ఘనంగా స్వాగతం పలికాయి. మరోవైపు సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర ఉత్సవాలు జోరుగా సాగుతున్నాయి. సీఎం కేసీఆర్ ముఖ్యకార్యదర్శి నర్సింగ్‌రావు తన కుటుంబసభ్యులతోపాటు అమ్మవారికి ప్రత్యేక పూజలుచేశారు.



సికింద్రాబాద్‌లో భక్తులతో కిటకిటలాడుతున్న ఉజ్జయినీ మహంకాళి ఆలయం

# ఇంటర్ అడ్వాన్స్‌డ్‌లో 37% పాస్

- వొకేషనల్‌లో 51.2 శాతం ఉత్తీర్ణత నమోదు
- సెకండ్ ఇయర్ ఫలితాలు విడుదల చేసిన ఇంటర్ బోర్డు కార్యదర్శి ఏ అశోక్
- ఆన్‌లైన్ ద్వారా మార్కుల మెమోల డౌన్‌లోడ్‌కు అవకాశం
- రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు ఈ నెల 16 నుంచి 20 వరకు గడువు
- త్రీమెన్ కమిటీ సిఫారసులు పాటించాం
- నాలుగు సంస్థలతో ఫలితాల మదింపు చేపట్టామన్న బోర్డు కార్యదర్శి
- వారంరోజుల్లో ఫస్ట్ సప్లిమెంటరీ ఫలితాల విడుదలకు సన్నాహాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఇంటర్ రెండో సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు వెల్లడయ్యాయి. ఆదివారం నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో బోర్డు కార్యదర్శి ఏ అశోక్ ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో 37 శాతం, వొకేషనల్‌లో 51.2 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షకు 1,60,487 మంది విద్యార్థులు హాజరవగా, వారిలో 60,600 మంది ఉత్తీర్ణులయ్యారు. సప్లిమెంటరీ పరీక్షలకు హాజరైన 61,264 మంది బాలికల్లో 24,979 మంది (41 శాతం), 91,095 మంది బాలురలో 31,452 మంది (35 శాతం) ఉత్తీర్ణత సాధించారు. మాల్ ప్రాక్టీస్ కింద 162 మంది విద్యార్థులు బుక్కయ్యారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను గత నెల ఏడో తేదీ నుంచి 14 వరకు నిర్వహించారు. మార్చి, జూన్ నెలల్లో జరిగిన పరీక్షల్లో మొత్తం 2,92,991 మంది ఉత్తీర్ణత సాధించగా, 76.59 కుమిలేటివ్ ఉత్తీర్ణతా శాతం నమోదైనట్టు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు.

### ఆన్‌లైన్ ద్వారా మార్కుల మెమోలు

ఇంటర్ సెకండియర్ సప్లిమెంటరీ పరీక్షల మార్కుల మెమోలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకువచ్చారు. www.bie.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా మార్కుల మెమోలను డౌన్‌లోడ్ చేసుకొనేలా వీలుకల్పించారు. ఈ నెల 18న మెమోలు జిల్లా ఇంటర్ విద్యాధికారుల ద్వారా ఆయా కాలేజీలు పొందవచ్చు. మెమోలో ఏవైనా తేడాలున్నట్లయితే తమ ఫిర్యాదులను ఇంటర్ బోర్డుకు ఆగస్టు 13వ తేదీలోగా చేరుకునేలా అందజేయాల్సి ఉంటుంది. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం ఈ నెల 16 నుంచి ఐదురోజుల పాటు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనేందుకు గడువు ఇచ్చారు. రీకౌంటింగ్ కోసం రూ.100, రీవెరిఫికేషన్ కోసం రూ.600 ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.



ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేస్తున్న బోర్డు కార్యదర్శి ఏ అశోక్, అధికారులు

### అనేక జాగ్రత్తలు తీసుకున్నాం..

ఫలితాల విడుదలలో అనేక జాగ్రత్తలు పాటించామని, ఇంటర్ పరీక్షలు, ఫలితాల విడుదలపై త్రీమెన్ కమిటీ చేసిన సూచనలన్నీ పాటించామని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఏ అశోక్ తెలిపారు. ఫలితాల్లో తప్పులు దొర్లకుండా నాలుగు కంప్యూటర్ సంస్థలతో మదింపు నిర్విహించామని, గ్లోబరీనా టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, డేటాటెక్ మెథడిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, మాగ్నటిక్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలతోపాటు జేఎన్టీయూహెచ్ సేవలను తీసుకొన్నామని తెలిపారు. ప్రైవేటు కంప్యూటర్ సంస్థలు వేర్వేరుగా సమాంతరంగా ఫలితాల ప్రక్రియ కొనసాగించాయని, చివరగా ఈ మూడు సంస్థలు గుర్తించిన పొరపాట్లను సరిదిద్ది ఫలితాలను విడుదల చేశామని చెప్పారు.

**మూడేండ్లుగా సెకండియర్ ఫలితాల వివరాలు**

| సంవత్సరం | మార్చిలో హాజరు | ఉత్తీర్ణులు | శాతం | సప్లిమెంటరీ ఉత్తీర్ణత | మొత్తం ఉత్తీర్ణులు | క్యుమిలేటివ్ ఉత్తీర్ణత శాతం |
|---|---|---|---|---|---|---|
| 2017 | 3,83,182 | 2,55,296 | 67.00 | 42,214 | 2,97,510 | 77.64 |
| 2018 | 3,95,721 | 2,65,360 | 67.06 | 45,912 | 3,11,272 | 78.65 |
| 2019 | 3,82,534 | 2,47,755 | 64.80 | 45,236 | 2,92,991 | 76.59 |

### వారంరోజుల్లో ఇంటర్ ఫస్టియర్ సప్లిమెంటరీ ఫలితాలు

వారంరోజుల్లో ఇంటర్ ఫస్టియర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఏ అశోక్ తెలిపారు. నాలుగు కంప్యూటర్ సంస్థలు ఈ ఫలితాల విడుదలకు పనిచేస్తున్నాయని చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఎర్రర్ ఫ్రీ ఫలితాలు విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని, చిన్నచిన్న తప్పులు ఉన్నట్లయితే వాటిని జిల్లా అధికారులు, ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లను సంప్రదించి పరిష్కరించుకోవచ్చని సూచించారు.

### ఆన్‌లైన్ ఫిర్యాదుల కేంద్రం

ఇంటర్ ఫలితాల్లో ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నట్టయితే ఫిర్యాదు చేయడానికి వీలుగా ఆన్‌లైన్ ఫిర్యాదుల కేంద్రం ఏర్పాటు చేశామని ఏ అశోక్ తెలిపారు. అలాగే బోర్డు కార్యాలయంలో సహాయకేంద్రాన్ని కూడా ఏర్పాటుచేసినట్టు చెప్పారు. సందేహాల నివృత్తికి 040-24600110 ఫోన్ నంబర్లో సంప్రదించవచ్చునని సూచించారు. సమస్యలు ఉన్న విద్యార్థులు బోర్డు కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా జిల్లాల్లోని ఇంటర్ విద్యాధికారులు, ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని స్పష్టంచేశారు.

# తుదిదశకు టీఆర్ఎస్ సభ్యత్వం

- ఒక్కో నియోజకవర్గంలో 50 వేల సభ్యత్వాలు లక్ష్యం
- ఉత్సాహంగా పాల్గొంటున్న మంత్రులు, పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు
- 20 కల్లా పూర్తిచేయాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయం
- పర్యవేక్షిస్తున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్







**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు చివరి అంకానికి చేరింది. రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం చురుకుగా సాగుతున్నది. పూర్తయిన సభ్యత్వాల డిజిటలైజేషన్ కొత్త జిల్లా కేంద్రాల్లో సమాంతరంగా జరుగుతున్నది. ఈ నెల 20 కల్లా సభ్యత్వాల ప్రక్రియను పూర్తిచేయాలని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయించిన నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా నమోదులో పాల్గొంటున్నారు. సభ్యత్వాల నమోదు అనంతరం పార్టీ గ్రామ, మండల కమిటీలను వేయనున్నారు. జూన్ 27న తెలంగాణభవన్‌లో పార్టీ సభ్యత్వ నమోదును పార్టీ అధినేత కేసీఆర్ ప్రారంభించారు. ఒక్కో నియోజకవర్గంలో కనీసం 50 వేల సభ్యత్వాలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ లక్ష్యం దాదాపుగా పూర్తికావొచ్చింది. కొన్ని నియోజకవర్గాల్లో లక్ష్యం కూడా దాటింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు, కార్పొరేషన్ చైర్మన్లు ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు.

### మున్సిపాలిటీల్లో సభ్యత్వాలపై ప్రత్యేక దృష్టి

ఈ నెల 20కల్లా సభ్యత్వ నమోదును పూర్తిచేయాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు టెలికాన్ఫరెన్స్‌లో పార్టీ నాయకులకు స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నందున మున్సిపాలిటీల్లో సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. కాలనీ అసోసియేషన్ల సభ్యులు పార్టీ సభ్యులుగా చేరేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమ విజయవంతానికి ఒకటి రెండు నియోజకవర్గాలకు ఒకరి చొప్పున ఇంచార్జీలను నియమించారు. వారు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా నేతలను సమన్వయం చేస్తూ సభ్యత్వాలు ఉత్సాహంగా జరిగేలా కృషి చేశారు. డిజిటలైజేషన్ ప్రక్రియ పర్యవేక్షణకు రాష్ట్రస్థాయిలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ నేతృత్వంలో బృందం పనిచేస్తుండగా.. ప్రతి కొత్త జిల్లా కేంద్రానికి బాధ్యులను నియమించారు.

**ముహూర్తం**

సూర్యోదయం: 5.54 గంటలకు

సూర్యాస్తమయం: 6.50 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, చతుర్దశి, నక్షత్రం: మూల సాయంత్రం 6.53 వరకు, తదుపరి పూర్వాషాఢ, అమృతఘడియలు: మధ్యాహ్నం 12.06 నుంచి 1.42 వరకు, రాహుకాలం: ఉదయం 7.31 నుంచి 9.08 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.56 నుంచి మధ్యాహ్నం 12.48 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.23 నుంచి సాయంత్రం 4.15 వరకు, వర్జ్యం: తె.జా. 1.55 నుంచి 3.31 వరకు.

# ప్రభుత్వ కాలేజీల్లో ప్రవేశాల జోరు

- ఏటా 30 శాతం మేర అడ్మిషన్ల పెరుగుదల
- ఇప్పటివరకు 76,562 మందికి ప్రవేశాలు
- 348 ప్రైవేట్ కాలేజీలకు అఫిలియేషన్ ఇచ్చాం
- మీడియాతో ఇంటర్ బోర్డు కార్యదర్శి ఏ అశోక్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 404 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఏటా 30 శాతం మేర ప్రవేశాలు పెరుగుతున్నాయని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఏ అశోక్ తెలిపారు. ఇప్పటివరకు ప్రభుత్వ కాలేజీల్లో 76,562 మందికి ప్రవేశాలు కల్పించామన్నారు. ఆదివారం ఇంటర్ ఫలితాలు విడుదల అనంతరం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 398 ప్రభుత్వ కాలేజీలకు పక్కా భవనాలున్నాయని, మిగిలిన ఆరింటికి కూడా త్వరలోనే పక్కా భవనాలు నిర్మిస్తామన్నారు. ప్రభుత్వ కాలేజీల్లో రెండు లక్షల వరకు ప్రవేశాలు జరిపే అవకాశాలున్నాయన్నారు. ఉచిత ప్రవేశాలు, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ వల్ల విద్యార్థుల నమోదు సంఖ్య పెరుగుతూ వస్తున్నదని, అడ్మిషన్ల ప్రక్రియ పూర్తిచేయడానికి ఈ నెలాఖరు వరకు గడువు ఉన్నదన్నారు. ప్రభుత్వ కాలేజీల్లో సీసీటీవీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు, బయోమెట్రిక్ అటెండెన్స్ వంటివి ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ఈ ఏడాది రాష్ట్రంలోని 1,699 ప్రైవేట్ జూనియర్ కాలేజీలు అఫిలియేషన్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకొన్నాయని, వాటిలో ఇప్పటివరకు 348 కాలేజీల నుంచి అండర్‌టేకింగ్ తీసుకొని అఫిలియేషన్ ఇచ్చామని స్పష్టంచేశారు. కొన్ని కాలేజీలకు షరతులతో అఫిలియేషన్లు ఇవ్వాల్సి వస్తున్నదన్నారు. ఇప్పటికీ 40 ప్రైవేట్ కాలేజీలు రేకుల షెడ్లలో కొనసాగుతున్నాయని చెప్పారు. ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ల కొరత చాలా తీవ్రంగా ఉన్నదని, వీటి నియామకం కోసం ప్రైవేట్ కాలేజీలు ముందుకు రావడం లేదన్నారు.

**2.4 లక్షల మందికి స్కాన్‌చేసిన జవాబుపత్రాలు**

గత మార్చిలో నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలకు సంబంధించి హైకోర్టు ఆదేశాల మేరకు 9.02 లక్షల జవాబుపత్రాలను ఆన్‌లైన్ చేయగా.. వాటిలో 2.4 లక్షల మంది విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకున్నారని అశోక్ చెప్పారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం 70 వేల మంది విద్యార్థులు ఫీజులు చెల్లించారని తెలిపారు. విద్యార్థులకు నష్టం కల్గించే విధంగా ఇంటర్ బోర్డు ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని అభిప్రాయపడ్డారు. ఈ నెల 15 లోగా ఐఐటీ కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి అవకాశం ఇవ్వాలని జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) కు లేఖ రాసినట్టు చెప్పారు. సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలకు సంబంధించి సోమవారం నుంచి ఆన్‌లైన్ మార్కుల మెమోలు ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు.

# అబ్రాడ్ ఎంబీబీఎస్ ఫెయిర్‌కు అనూహ్య స్పందన

- తరలివచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు
- సందేహాల నివృత్తితో సంతోషం


**'టీన్యూస్, నమస్తే తెలంగాణ' ఆధ్వర్యంలో అబ్రాడ్ ఎంబీబీఎస్ ఎడ్యుకేషన్ ఫెయిర్-2019 విజయవంతం**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విదేశాల్లో ఎంబీబీఎస్ విద్యపై 'టీన్యూస్, నమస్తే తెలంగాణ' సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అబ్రాడ్ ఎంబీబీఎస్ ఎడ్యుకేషన్ ఫెయిర్-2019 విజయవంతంగా ముగిసింది. అబ్రాడ్‌లో వైద్యవిద్యపై విద్యార్థులు, తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేసేందుకు 30 స్టాళ్లతో ఏర్పాటుచేసిన ఈ ఫెయిర్ విశేషంగా ఆకట్టుకున్నది. ఆదివారం ఫెయిర్ నిర్వహణకు చివరిరోజు కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఫెయిర్‌కు అనూహ్య స్పందన లభించింది. స్టాళ్లన్నీ కలియతిరుగుతూ వివిధ దేశాల్లో అందించే నాణ్యమైన విద్య, చెల్లించాల్సిన ఫీజు, అక్కడి యూనివర్సిటీలు కల్పించే సౌకర్యాలు, వాతావరణం వంటి విషయాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. విదేశాల్లో ఎంబీబీఎస్ చదివించాలనుకొనేవారికి ఈ ఫెయిర్ ఎంతగానో ఉపయోగపడింది. విదేశాల్లో ఎంబీబీఎస్ విద్యపై ఉన్న సందేహాలను చాలామంది తల్లిదండ్రులు ఈ ఫెయిర్ ద్వారా నివృత్తి చేసుకున్నారని ఫెయిర్ నిర్వాహకులు తెలిపారు. ఎడ్యుకేషన్ ఫెయిర్‌తో విదేశాల్లో ఎంబీబీఎస్ విద్యపై స్పష్టత వచ్చిందని తల్లిదండ్రులు చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా సమాచారం లభించిందని సంతోషం వ్యక్తంచేశారు. విదేశీ విద్య గురించిన సమాచారం తెలుసుకునేందుకు గతంలో కష్టపడాల్సి వచ్చేదని, ఎడ్యుకేషన్ ఫెయిర్‌తో ఆ శ్రమ తప్పిందని పేర్కొంటూ.. నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.



అబ్రాడ్ ఎంబీబీఎస్ ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో స్టాళ్లను సందర్శించి సందేహాలను నివృత్తిచేసుకొంటున్న విద్యార్థులు, తల్లిదండ్రులు


### ఈ ఫెయిర్ చాలా ఉపయోగపడుతుంది



నీట్ ర్యాంకుతో మా అబ్బాయికి సీటు వచ్చే పరిస్థితి లేదు. మేనేజ్‌మెంట్‌లో కొనలేం. అందుకే విదేశాల్లో ఎంబీబీఎస్ విద్యకు సంబంధించిన వివరాలు తెలుసుకోవడానికి ఈ ఫెయిర్‌కు వచ్చాం. విదేశాల్లో ఏ యూనివర్సిటీలో సీటు వస్తుంది, అక్కడ ఉండే సౌకర్యాలు, కోర్సు వ్యవధి, కావాల్సిన సర్టిఫికెట్లు, స్కాలర్‌షిప్‌కు సంబంధించిన విషయాలను తెలుసుకున్నాం. కిర్గిజిస్థాన్‌లో అయితే తక్కువ ఫీజుతో కోర్సు పూర్తవుతుందని ఇక్కడికొచ్చాక తెలిసింది. మా అబ్బాయిని కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లోని ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ యూనివర్సిటీలో చేర్పించాలనుకుంటున్నా. ఈ ఫెయిర్ చాలా ఉపయోగపడింది.

– మహ్మద్ దస్తగిర్, విద్యార్థి తండ్రి, సికింద్రాబాద్

### ఇది మంచి వేదిక



మా వద్దకు వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులందరూ నాణ్యమైన విద్య, భద్రత, ప్రయాణ ఖర్చులు, సౌకర్యాల వంటి అంశాలపైనే ఎక్కువగా ఆరా తీస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు విదేశాల్లో విద్యపై మరింత అవగాహన, ప్రేరణ కల్పించాల్సిన అవసరం ఉన్నది. విదేశాల్లో ఎంబీబీఎస్ చదవాలనుకునే, చదివించాలనుకునేవారికి ఈ ఫెయిర్ ఒక మంచి వేదికగా నిలిచింది. విదేశాల్లో స్థానికులకు ఎంబీబీఎస్ విద్యను ఉచితంగా అందిస్తారు. స్థానికేతరులకు కొంత ఫీజు తీసుకుంటారు. అది మన దేశంతో పోల్చుకుంటే చాలా తక్కువ. ఎంబీబీఎస్ కోర్సు తక్కువ ఖర్చుతో పూర్తవుతుందని ఎక్కువమంది విదేశాల వైపు మొగ్గుచూపుతున్నారు.

– ప్రదీప్‌రెడ్డి, ఎంపీఆర్ గ్లోబల్ ఎడ్యుకేషన్ స్టాల్ నిర్వాహకుడు

### అన్ని విషయాలు వివరించారు



ఇండియాలో ఎంబీబీఎస్ సీట్లు తక్కువ. మేనేజ్‌మెంట్‌లో ఎంబీబీఎస్ చేద్దామంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. అబ్రాడ్‌లో అయితే తక్కువ ఖర్చుతో కోర్సు పూర్తిచేయొచ్చు. అందుకే యూరప్‌లో ఎంబీబీఎస్ చేయాలనుకుంటున్నా. స్టాళ్ల నిర్వాహకులు చాలాబాగా స్పందించారు. ఎంబీబీఎస్ కోర్సు ఏ దేశంలో ఎలా ఉన్నదనే విషయాలను వివరించారు.

– మాళవిక, విద్యార్థిని, హయత్‌నగర్, రంగారెడ్డి జిల్లా

### మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలి



నా కూతురిని మేనేజ్‌మెంట్ కోటాలో ఎంబీబీఎస్ చదివించే స్థోమత లేదు. అందుకే తక్కువ ఫీజుతో విదేశాల్లో చదివించాలనుకుంటున్నా. ఇక్కడికి వచ్చేవరకు నాకేమీ తెలియదు. అన్ని స్టాళ్లు తిరిగాను. విదేశాల్లో ఎంబీబీఎస్ విద్య గురించి చాలా విషయాలు తెలిశాయి. ఇలాంటి ఎడ్యుకేషన్ ఫెయిర్ మాలాంటి వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. భవిష్యత్‌లో మరిన్ని నిర్వహించాలి.

– రమేశ్, విద్యార్థి తండ్రి, వరంగల్ జిల్లా

**లోకం పోకడ**





ఆదివారం గోదావరి బ్యాక్‌వాటర్‌తో కళకళలాడుతున్న మేడిగడ్డ బరాజ్



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి గ్రావిటీ కెనాల్ ఏరియల్ వ్యూ

# ఐదో మోటరూ ఆరంభం

- కన్నెపల్లిలో ఐదు మోటర్లతో 10,500 క్యూసెక్కులు ఎత్తిపోత
- గోదావరిలో 12,200 క్యూసెక్కుల ప్రవాహం
- మేడిగడ్డ బరాజ్‌లో 6 టీఎంసీలు నిల్వ
- అన్నారం బరాజ్‌కు 4 టీఎంసీల చేరిక
- పోతారందాకా ఎదురెక్కిన అన్నారం జలాలు
- మరో రెండున్నర కిలోమీటర్ల దూరంలో అన్నారం పంప్‌హౌస్
- కాసిపేట ఎత్తిపోతలకు సర్వం సిద్ధం!

**జయశంకర్ జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

మేడిగడ్డ బరాజ్‌లోని నీటిని ఎత్తిపోసేందుకు కన్నెపల్లి పంప్‌హౌస్‌లో మరో మోటర్ ఆరంభమయింది. పంప్‌హౌస్ నుంచి శనివారం వరకు నాలుగు మోటర్ల ద్వారా నీటిని ఎత్తిపోయగా.. ఆదివారం ఐదోమోటర్ అందుబాటులోకి వచ్చింది. శనివారం రాత్రి ఇంజినీర్లు ఐదో నంబర్ మోటర్‌ను ప్రారంభించి నిరంతరాయంగా నడిపించారు. శుక్రవారం సాయంత్రం నిలిపివేసిన ఒకటోనంబర్ మోటర్‌ను ఆదివారం సాయంత్రం ఆన్‌చేయడంతో మొత్తం ఐదు మోటర్లు నిరంతరాయంగా గోదావరి నీటిని ఎత్తిపోస్తున్నాయి. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రారంభమైన తర్వాత కన్నెపల్లి పంప్‌హౌస్‌లో ఒకేసారి ఐదు మోటర్లు నిర్విరామంగా నడవడం ఇదే ప్రథమం. ఐదుమోటర్ల ద్వారా రోజుకు 10,500 క్యూసెక్కుల నీరు అన్నారం బరాజ్‌కు తరలుతున్నది. అటు మేడిగడ్డ, ఇటు అన్నారం బరాజ్‌ల్లో నీటి నిల్వలు అంతకంతకూ పెరుగుతున్నాయి. మేడిగడ్డలో నీటి నిల్వ 6 టీఎంసీలకు చేరగా.. కన్నెపల్లి నుంచి ఎత్తిపోసిన నీటితో అన్నారం బరాజ్‌లో 4 టీఎంసీల నీటి నిల్వచేరింది. అన్నారం బరాజ్ నుంచి బ్యాక్‌వాటర్ ఆదివారం మంథని మండలంలోని పోతారం వరకు చేరుకున్నాయి. మరో రెండున్నర కిలోమీటర్లు విస్తరిస్తే కాసిపేటలోని అన్నారం పంప్‌హౌస్‌ను జలాలు తాకనున్నాయి. ఈ నేపథ్యంలో అన్నారం పంప్‌హౌస్ నుంచి నీటిని సుందిల్ల బరాజ్‌కు ఎత్తిపోసేందుకు ప్రభుత్వ సలహాదారు పెంటారెడ్డి పర్యవేక్షణలో సర్వం సిద్ధం చేస్తున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో కాళేశ్వరం ప్రాజెక్టుకు సందర్శకులు పోటెత్తారు.

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా గత జూన్ 21వ తేదీన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలోని కన్నెపల్లి పంపుహౌస్‌లో ఆరో నంబరు మోటరును ప్రారంభించారు. ప్రాణహిత నుంచి గోదావరిలోకి వరద



ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి గ్రావిటీ కెనాల్ వద్ద సందర్శకుల సందడి

నీరు రావటం ఆరంభమైనప్పటి నుంచి సాగునీటిశాఖ ఇంజినీర్లు కన్నెపల్లి పంపుహౌస్‌లో ఒక్కో మోటర్‌ను ఆన్‌చేస్తున్నారు. మొదట ఈ నెల 5వ తేదీన రాత్రి మూడోనంబరు మోటరును ఇంజినీర్లు ఆన్‌చేశారు. ఏడోతేదీన ఒకటో నంబర్, 8వ తేదీన ఆరోనంబర్ మోటరును ఆన్ చేశారు. తరువాత నాలుగో నంబరు మోటరును ప్రారంభించారు. శుక్రవారం నాలుగు మోటర్లు గోదా



మంథని మండలం పోతారం వద్ద పైకి ఎగబాకుతున్న గోదావరి జలాలు

వరి నీటిని ఎత్తిపోశాయి. శనివారం ఒకటో నంబర్ మోటర్‌కు ఇంజినీర్లు విరామం ఇవ్వడంతో మూడు మోటర్లు మాత్రమే నడిచాయి. ఒక్కో మోటరు 2,100 క్యూసెక్కుల నీరు ఎత్తిపోయటంతో గ్రావిటీ కెనాల్ ద్వారా 6,300 క్యూసెక్కుల నీరు అన్నారం బరాజ్‌కు తరలింది. శనివారం రాత్రి 11.30 గంటలకు ఇంజినీర్లు ఐదోనంబర్ మోటర్ ప్రారంభించారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఇంజినీర్లు ఒకటో నంబర్ మోటర్‌ను తిరిగి ఆన్‌చేశారు. దీంతో కన్నెపల్లి పంపుహౌస్‌లో మొత్తం ఐదు మోటర్లు నిరంతరం పనిచేస్తున్నాయి. ఒక్కో మోటరు రోజుకు 2,100 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండటంతో.. ఐదు మోటర్లు నిర్విరామంగా పనిచేయటం వల్ల 10,500 క్యూసెక్కులు అంటే సుమారు ఒక టీఎంసీ అన్నారం బరాజ్‌కు చేరుతుందని సాగునీటిశాఖ ఇంజినీర్లు తెలిపారు. ఇదిలాఉండగా.. ఇంజినీర్లు రెండో నంబర్ మోటరునూ ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు రెండో మోటరుకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. సాధ్యమైనంత త్వరలో ఈ మోటర్‌ను ప్రారంభించే అవకాశం ఉన్నది.

### 28 కిలోమీటర్లకు విస్తరించిన గోదావరి

ప్రాణహిత నది నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోతో గోదావరిలో కాళేశ్వరం వద్ద 12,200 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఆదివారం సాయంత్రం వరకు మేడిగడ్డ బరాజ్‌లో నీటినిల్వ 6 టీఎంసీలకు చేరింది. ఈ బరాజ్‌లో బ్యాక్‌వాటర్ గోదావరిలో 28 కి.మీ. మేరకు విస్తరించింది. కన్నెపల్లి పంపుహౌస్‌ను దాటి గోదావరిలో ప్రాణహిత నది కలిసే ప్రదేశం వరకు మేడిగడ్డ బరాజ్ బ్యాక్‌వాటర్ చేరింది. కాళేశ్వరం పుష్కరఘాట్‌ను మేడిగడ్డబరాజ్ బ్యాక్‌వాటర్ తాకటంతో అధికారులు అక్కడ కంచె ఏర్పాటుచేసే పనులు చేపట్టారు. మేడిగడ్డ బరాజ్ బ్యాక్‌వాటర్ కన్నెపల్లి పంపుహౌస్ వరకు చేరటంతో గోదావరిలో నీటిప్రవాహంపై ఆధారపడకుండా ఈ పంపుహౌస్‌లోని మోటర్లు నిరంతరం పనిచేసే అవకాశం ఉన్నది. ఆదివారం రాత్రి వరకు ఈ బరాజ్‌లోకి 4 టీఎంసీల నీరు చేరినట్టు అధికారులు చెప్పారు. దీంతో అన్నారం పంపుహౌస్ మోటర్ల వెట్‌రన్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో కాళేశ్వరం ప్రాజెక్టుకు సందర్శకులు పోటెత్తారు. 5వేల మంది మేడిగడ్డ బరాజ్, కన్నెపల్లి పంప్‌హౌస్‌లను సందర్శించారు.

## అన్నారం పంప్‌హౌస్‌లో ఎత్తిపోతలకు ఏర్పాట్లు

**మంథని, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మంథని మండలం కాసిపేటలోని అన్నారం పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ప్రభుత్వ సలహాదారు పెంటారెడ్డి పర్యవేక్షణలో సర్వం సిద్ధమవుతున్నది. ఇప్పటికే మేడిగడ్డ బరాజ్ నుంచి కన్నెపల్లి పంపుహౌస్‌లోని ఐదుమోటర్ల ద్వారా అన్నారం బరాజ్‌లోకి నీటిని ఎత్తిపోస్తుండగా కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మధ్యలో ఉన్న మంథని మండలం కాసిపేటలోని అన్నారం పంపుహౌస్‌లో మోటర్లను నడిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కన్నెపల్లి నుంచి అన్నారం బరాజ్‌లోకి 9 మీటర్ల ఎత్తులో 4టీఎంసీల నీరు చేరింది. మంథని మండలం పోతారం వరకు అన్నారం బరాజ్ బ్యాక్‌వాటర్ చేరుకున్నది. రెండున్నర కిలోమీటర్లు విస్తరిస్తే కాసిపేటలోని అన్నారం పంపుహౌస్‌కు జలాలు చేరుకోనున్నాయి. మరో 24 గంటల్లో ఆ నీరు అన్నారం పంపుహౌస్ డ్రాఫ్ట్ ట్యూబ్ గేట్ల వద్దకు చేరుకోనున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఎత్తిపోతల సలహాదారు పెంటారెడ్డి పర్యవేక్షణలో ఆదివారం అన్నారం పంప్‌హౌస్‌లో డీ వాటరింగ్, సంపు, మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ పరీక్షలు



మంథని మండలం కాసిపేటలోని అన్నారం పంపుహౌస్‌లో మోటర్లు (ఫైల్)

నిర్వహించారు. అన్నారం పంపుహౌస్‌లో 10 మీటర్ల లోతులో నీరు ఉండగా, లోపల నీటి రాకకోసం ఏర్పాటుచేసిన 12 గేట్లలో నాలుగుగేట్ల వద్ద గజ ఈతగాళ్లతో పరీక్షలు పూర్తిచేశారు. ఆ తర్వాత కూలింగ్ టెస్ట్‌లను నిర్వహించారు. ఇక్కడ నాలుగుమోటర్లను ఆన్‌చేసి రన్ చేసే విధంగా అన్ని ఏర్పాట్లుచేశారు. సుందిల్ల బరాజ్‌లో నీళ్లు నిలిపేవిధంగా అక్కడ కూడా అన్ని పరీక్షలను నిర్వహించి ఎత్తిపోతలకు, నీటి నిలుపుదలకు ఏర్పాట్లు చేశారు.



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం

## భద్రాద్రి వద్ద 12.5 అడుగులకు గోదావరి

**భద్రాచలం, నమస్తే తెలంగాణ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పడుతున్నది. ఆదివారం ఉదయం 6 గంటలకు 12.9 అడుగులు ఉన్న గోదావరి సాయంత్రం 5 గంటలకు 12.5 అడుగులకు తగ్గింది. ఇది మరింత తగ్గే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. ఇదిలాఉండగా చర్ల మండలం తాలిపేరు ప్రాజెక్టులో ఆదివారం 73.6 మీటర్ల నీటిమట్టం నిల్వ ఉంది.



మంథని మండలం పోతారం వద్ద పెరిగిన గోదావరి ప్రవాహం

PROFESSOR JAYASHANKAR TELANGANA STATE AGRICULTURAL UNIVERSITY
Administrative Office, Rajendranagar, Hyderabad-30, Telangana State.

NOTIFICATION FOR ADMISSION TO POST GRADUATE COURSES 2019-20

Advt.No.1/PG/2019, Dt.15-07-2019.

Online applications are invited for admission into the following P.G. Courses.

**Courses:** Ph.D. (Ag.) / Ph.D. (H.Sc.) / Ph.D. (Ag. Engg.) / M.Sc. (Ag.) / M.Tech (Agri. Engg.) / MBA (Agribusiness Management) / M.Sc. (H.Sc.).

Online Application Form and Prospectus with suitable link has been provided in our website: **www.pjtsau.edu.in. on 15-07-2019.**

**Last date for receipt of applications:** Applications duly filled in including those sent through employer should reach **"The Registrar, PJTSAU, Administrative Office, Rajendra Nagar, Hyderabad-500 030" on or before 31-07-2019 at 4.00PM.**

**Dr. S.SUDHEER KUMAR, REGISTRAR**

## కాళేశ్వరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి

- ప్రాజెక్టు వద్ద ఉండగానే ముత్తిరెడ్డికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఫోన్

**జనగామ/చేర్యాల, నమస్తే తెలంగాణ:** తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టను చూసేందుకు జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆధ్వర్యంలో రైతులు, టీఆర్ఎస్ శ్రేణులు ఆదివారం భారీగా తరలివెళ్లారు. 'కేసీఆర్ కాళేశ్వర జలసంపద సందర్శనయాత్ర' పేరుతో ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి.. నియోజవర్గం నుంచి 40 బస్సులు, ఇతర వాహనాల్లో వేలమందిని తీసుకువెళ్లారు. కాళేశ్వరం వెళ్లే వాహనాలను జనగామలోఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. మేడిగడ్డ వద్దకు చేరుకొన్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డిని సీసీ కెమెరాలో గమనించిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు వెంటనే ఆయనకు ఫోన్‌చేశారు. ప్రాజెక్టు నిర్మాణం, నీటి లభ్యత, ప్రస్తుత నీటిమట్టం తదితర విషయాలను మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణంతో కలిగే ప్రయోజనాలను రైతులు, పార్టీ నాయకులకు నేరుగా తెలియజేసేందుకు ప్రాజెక్టు సందర్శనకు వచ్చినట్టు సీఎం కేసీఆర్‌కు ముత్తిరెడ్డి తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంతో రైతుల్లో మనోధైర్యం పెరిగిందని.. గోదావరి నీటిని ఎదురు ప్రవహింపజేసిన ఘనత చరిత్రలో మీకే దక్కుతుందని, సదా తెలంగాణ ప్రజలు మీకు రుణపడి ఉంటారని ముఖ్యమంత్రితో పేర్కొన్నారు. ఎమ్మెల్యే బృందం మేడిగడ్డ ప్రాజెక్టు, కన్నెపల్లి పంపుహౌస్, అన్నారం బరాజ్‌ను సందర్శించింది.



ఆదివారం మేడిగడ్డ బరాజ్ వద్ద ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి , ఇతర నాయకులు

## ఆశాజనకంగా ఆల్మట్టి

- ప్రవాహాలు గతేడాది కంటే మేలు
- జలాశయానికి 1.14 లక్షల క్యూసెక్కుల వరద
- నారాయణపూర్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో.. కాల్వలకు నీటి విడుదల
- గోదావరిలో స్థిరంగా కొనసాగుతున్న ప్రవాహం

**హైదరాబాద్/మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ:** కృష్ణా బేసిన్‌లో ఎగువన పరవళ్లు ఆశాజనకంగా కొనసాగుతున్నాయి. ఆల్మట్టి జలాశయం వద్ద కొన్ని రోజులుగా ఇన్‌ఫ్లోలు స్థిరంగా ఉండటంతో నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. గతేడాదితో పోలిస్తే ఎగువ నుంచి వరద ప్రవాహం బాగానే ఉన్నట్టు కనిపిస్తున్నది. గతేడాది ఇదే సమయానికి (జూలై 14) ఆల్మట్టిలో నీటినిల్వ 83.78 టీఎంసీలుగా ఉండగా.. ఈ ఏడాది ఎనిమిది టీఎంసీలు ఎక్కువగా ఉండటంతోపాటు, ఎగువ నుంచి వరద కూడా అధికంగానే వచ్చి చేరుతున్నది. జలాశయానికి ప్రస్తుతం 1.14 లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నది. మొత్తం 129.72 టీఎంసీల నిల్వ సామర్థ్యం గల ఆల్మట్టిలో ప్రస్తుతం 91.62 టీఎంసీలకు చేరింది. 38.10 టీఎంసీలు వస్తే పూర్తిస్థాయిలో నిండుతుంది. జలాశయం అధికారులు శనివారం నుంచి విద్యుదుత్పత్తి ద్వారా 28,125 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతుండటంతో నారాయణపూర్ ఇన్‌ఫ్లో పెరుగుతున్నది. ప్రస్తుతం ఆ జలాశయానికి 25,909 క్యూసెక్కుల వరద వస్తుండగా.. కాల్వలద్వారా 1732 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. నారాయణపూర్ సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా ప్రస్తుతం 22.10 టీఎంసీల నిల్వ ఉన్నది. 54 టీఎంసీలు వస్తే ఆల్మట్టి, నారాయణపూర్ రెండూ నిండుతాయి. ప్రస్తుతం వస్తున్న వరద ఇలాగే కొనసాగితే ఐదారు రోజుల్లో రెండు జలాశయాలు నిండే అవకాశం ఉన్నది. ఆల్మట్టికి ఎగువ నుంచి వరద పెరుగుతున్న కొద్దీ కర్ణాటక అధికారులు దిగువన నారాయణపూర్ నుంచి సాగునీటి విడుదల పరిమాణాన్ని పెంచుతున్న నేపథ్యంలో.. జూరాలకు నీరు విడుదలయ్యేందుకు వారం, పది రోజులు పట్టే అవకాశం ఉన్నది.

### నిరాశపరిచిన ఉజ్జయిని

కృష్ణా బేసిన్‌లోని ఉజ్జయినికి వస్తున్న ఇన్‌ఫ్లో ఒక్కసారిగా తగ్గుముఖం పట్టింది. మొన్నటివరకు 16 వేల నుంచి 18 వేల క్యూసెక్కులు ఉన్న వరద ఆరు వేలకు పడిపోయింది. 117.24 నిల్వ సామర్థ్యం ఉన్న ఉజ్జయినిలో ప్రస్తుతం 46.13 టీఎంసీల నిల్వ ఉండగా.. అది నిండి భీమా ద్వారా జూరాలకు వరద వచ్చే పరిస్థితులు ఇప్పట్లో కనిపించడంలేదు. మరోవైపు తుంగభద్రకు ఇన్‌ఫ్లో స్థిరంగానే కొనసాగుతున్నది. 20,061 క్యూసెక్కుల వరద వస్తున్నది. వంద టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న తుంగభద్రలో నీటినిల్వ 11.03 టీఎంసీలకు చేరుకున్నది.

**ఐదురోజులుగా ఆల్మట్టికి వచ్చిన వరద**

| తేదీ | ఇన్‌ఫ్లో (క్యూసెక్కులలో) | ప్రాజెక్టు నీటిమట్టం (టీఎంసీల్లో) |
|---|---|---|
| జూలై 10 | 94,597 | 54.48 |
| జూలై 11 | 1,04,290 | 64.03 |
| జూలై 12 | 1,06,582 | 73.78 |
| జూలై 13 | 1,09,337 | 83.78 |
| జూలై 14 | 1,14,035 | 91.62 |

### కడెంకు స్వల్పంగా వరద

గోదావరి బేసిన్‌లో ఇన్‌ఫ్లోలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ప్రధాన గోదావరిలో ఎగువ నుంచి వరద రాకున్నా.. కడెంకు మాత్రం స్వల్పంగా 149 క్యూసెక్కులు, ఎల్లంపల్లికి 472 క్యూసెక్కుల వరద వస్తున్నది. పేరూరు వద్ద గోదావరిలో 60 వేల క్యూసెక్కుల వరద దిగువకు ప్రవహిస్తుంది. ధవళేశ్వరం బరాజ్ వద్ద ఇన్‌ఫ్లో లక్ష క్యూసెక్కుల నుంచి 61,539 క్యూసెక్కులకు తగ్గింది. కాగా అధికారులు 76 వేల క్యూసెక్కుల గోదావరి జలాల్ని దిగువన సముద్రంలోకి వదులుతున్నారు.

























చంద్రయాన్-2 గమనం (ఊహాచిత్రం)

## ఇది అత్యంత సంక్లిష్ట ప్రయోగం



ఇస్రో మాజీ చైర్మన్ మాధవన్ నాయర్

**శ్రీహరికోట, జూలై 14:** చంద్రుడిపైకి ఇస్రో ప్రయోగిస్తున్న 'చంద్రయాన్-2' అత్యంత సంక్లిష్ట ప్రయోగం అని ఇస్రో మాజీ చైర్మన్ జీ మాధవన్ నాయర్ వ్యాఖ్యానించారు. అయితే చంద్రయాన్-2 ప్రయోగం యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని, భవిష్యత్‌లో అంతరిక్ష శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహద పడుతుందన్నారు. 'చంద్రయాన్-1' ద్వారా సేకరించిన సమాచారాన్ని ధ్రువీకరించుకునేందుకు ఇస్రో ప్రయోగిస్తున్న చంద్రయాన్-2 అత్యంత సంక్లిష్ట ప్రయోగం అని పేర్కొన్నారు. యువ శాస్త్రవేత్తల బృందానికి భారీ ప్రేరణగా నిలుస్తుందన్నారు.

## సీటీటీసీలో విడిభాగాల తయారీ

**భువనేశ్వర్:** 'చంద్రయాన్-2' మాడ్యూల్స్‌కు సంబంధించిన ముఖ్యమైన భాగాలను భువనేశ్వర్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ 'ది సెంట్రల్ టూల్ రూమ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ (సీటీటీసీ)'లో తయారుచేసినట్లు సీసీటీసీ మేనేజింగ్ డైరెక్టర్ సిబాసిస్ మైటీ తెలిపారు. 22 రకాల వాల్వ్‌లు, జీఎస్ఎల్వీ మార్క్ 3 రాకెట్‌కు చెందిన క్రయోజనిక్ ఇంజిన్ భాగాలు, ప్రజ్ఞాన్ రోవర్ విడిభాగాలను కూడా ఇక్కడే తయారుచేసినట్లు చెప్పారు. ఈ విడిభాగాల తయారీని 2017లో ప్రారంభినట్టు.. చంద్రయాన్-1కు సంబంధించిన కీలకమైన హార్డ్‌వేర్‌ను కూడా సీటీటీసీలోనే తయారుచేసినట్లు ఆయన గుర్తుచేశారు.



# 'అవెంజర్స్' కన్నా అగ్గువ

## ఎండ్‌గేమ్ బడ్జెట్ కన్నా చంద్రయాన్-2 వ్యయమే తక్కువ

### ఇస్రో మిషన్‌పై ప్రశంసలు కురిపిస్తున్న విదేశీ మీడియా

**న్యూఢిల్లీ, జూలై 14:** చంద్రయాన్-2 మిషన్‌పై ప్రపంచ దేశాల్లో విపరీతమైన ఆసక్తి నెలకొన్నది. వివిధ దేశాలకు చెందిన పత్రికలు, సైంటిఫిక్ జర్నల్స్ ఈ ప్రాజెక్టును ప్రశంసిస్తూ కథనాలు ప్రచురిస్తున్నాయి. ఇస్రో అతి తక్కువ ఖర్చులో క్లిష్టమైన ప్రయోగాన్ని చేపడుతున్నదంటూ అభినందిస్తున్నాయి. హాలీవుడ్ బ్లాక్ బస్టర్ మూవీ 'అవెంజర్స్ ఎండ్‌గేమ్' బడ్జెట్‌తో పోల్చితే ఇస్రో సగంకంటే తక్కువ వ్యయంతో చంద్రుడిపై పరిశోధనలకు రోవర్‌ను పంపుతున్నదంటూ అమెరికా, రష్యా, చైనా తదితర దేశాల మీడియా పొగడ్తల వర్షం కురిపిస్తున్నది.

- అపోలో-11 మిషన్ ద్వారా వ్యోమగాములు చంద్రుడిపై అడుగుపెట్టిన 50 ఏండ్ల తర్వాత సరిగ్గా అదే రోజున.. చంద్రుడి దక్షిణ ధ్రువంపై చారిత్రాత్మక ఘటన ఆవిష్కృతం కానున్నది. ఇక్కడ చంద్రుడి బిలాల నీడలో చిక్కుకుపోయిన మంచుపై పరిశోధనలు జరుపనున్నది. – సైంటిఫిక్ అమెరికన్
- చంద్రయాన్-2 మొత్తం వ్యయం 124 మిలియన్ డాలర్లు. ఇది హాలీవుడ్ బ్లాక్ బస్టర్ సినిమా అవెంజర్స్ ఎండ్‌గేమ్ బడ్జెట్‌లో సగంకన్నా తక్కువే. –స్పుత్నిక్ (రష్యా ప్రభుత్వ న్యూస్ ఏజెన్సీ)
- 'ప్రతి ఒక్కరూ చంద్రమండలం మీదికి వెళ్లాలనుకుంటున్నారు. ఎందుకు?' అనే శీర్షికన **'ద గార్డియన్'** పత్రికలో రాసిన కథనంలో చంద్రయాన్-2 గురించి ప్రస్తావించారు. 'జూలై 15న తెల్లవారు జామున 2:51 గంటలకు శ్రీహరికోట నుంచి చంద్రయాన్-2ను ప్రయోగించనున్నారు. భారత్ చేపట్టనున్న అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ఇది' అని పేర్కొన్నారు.
- భారత్ తన శాస్త్రసాంకేతిక శక్తిని ప్రపంచానికి చాటడానికి ప్రయోగాలు చేస్తున్నది. చైనా అగ్రరాజ్యంగా నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తున్నది. అమెరికా అంగారకుడిపై పరిశోధనలకు చంద్రుడిని ఓ మజిలీగా ఎంచుకున్నది. – న్యూయార్క్ టైమ్స్
- చైనా, భారత్‌తోపాటు ఇజ్రాయెల్, దక్షిణ కొరియా వంటి దేశాలు చంద్రుడిపైకి పోటాపోటీగా రోవర్లను పంపుతున్నాయి. వారి సాంకేతిక శక్తిని పరీక్షించుకోవడంతోపాటు జాతీయవాదాన్ని పెంపొందించడానికి ఈ ప్రయోగాలు ఉపయోగపడుతున్నాయి. – నేషనల్ రిపబ్లిక్ రేడియో (అమెరికా)
- భారత్‌లో 1960ల్లోనే అంతరిక్ష ప్రయోగాలకు శ్రీకారం చుట్టినా.. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హయాంలో కొత్త పుంతలు తొక్కుతున్నది. అంతరిక్ష రంగంలో సాధిస్తున్న విజయాలను భారత్ ప్రపంచశక్తిగా ఎదుగడంతోపాటు దేశ రక్షణ సామర్థ్యాలను పెంచేవిగా ప్రచారం చేయడంలో మోదీ విజయం సాధించారు. – ద వాషింగ్టన్ పోస్ట్
- హాలీవుడ్ సినిమా 'గ్రావిటీ' బడ్జెట్ కన్నా తక్కువ వ్యయంతో భారత్ అంగారకుడి దగ్గరికి ఉపగ్రహాన్ని పంపింది. ఇప్పుడు 141 మిలియన్ డాలర్ల బడ్జెట్‌లో (రూ.966 కోట్లు) చంద్రుడిపైకి రోవర్‌ను పంపుతున్నది. ఇది అమెరికా 'అపోలో' మిషన్ బడ్జెట్ (25 బిలియన్ డాలర్లు- రూ.1.71 లక్షల కోట్లు) కన్నా చాలా తక్కువ. – ద పోస్ట్
- చంద్రుడిపైకి రోవర్‌ను పంపిన నాలుగో దేశంగా భారత్ నిలువనున్నది. చంద్రయాన్-2లోని ఆర్బిటార్, ల్యాండర్, రోవర్ వంటివన్నీ స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసినవే. – ఫిస్.ఆర్గ్ (సైన్స్ న్యూస్ పోర్టల్)
- చంద్రుడిపై మిస్టరీగా మారిన నీటి జాడను ఈ మిషన్ వెలుగులోకి తెచ్చే అవకాశం ఉన్నది. చందమామ పుట్టుపూర్వోత్తరాలను మరింత లోతుగా అధ్యయనం చేయడానికి, భవిష్యత్తులో మానవ సహిత అంతరిక్ష యాత్రలకు, రాకెట్ ఇంధనం తయారీకి ఈ మిషన్ అందించే సమాచారం కీలకం కానున్నది. – సైంటిఫిక్ అమెరికన్ వెబ్‌సైట్





**రూ.978 కోట్లు** (142.6 మిలియన్ డాలర్లు) చంద్రయాన్-2 బడ్జెట్

**రూ.2,440 కోట్లు** (356 మిలియన్ డాలర్లు) అవెంజర్స్ ఎండ్‌గేమ్ బడ్జెట్

# మహిళల సారథ్యంలో!

## చంద్రయాన్-2 ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వనిత, మిషన్ డైరెక్టర్‌గా రీతూ

### ప్రాజెక్టు భాగస్వాముల్లో 30 శాతం మంది మహిళ లే



రీతూ కరిదాల్



వనిత ముత్తయ్య

**న్యూఢిల్లీ, జూలై 14:** చంద్రయాన్-2 ప్రాజెక్టుకు మహిళలే నేతృత్వం వహిస్తున్నారు. ఇస్రో పూర్తిగా మహిళల సారథ్యంలో చేపట్టిన తొలి మిషన్ ఇదే కావడం విశేషం. అంతేకాదు.. ఈ ప్రాజెక్టులో భాగస్వాములైన శాస్త్రవేత్తల్లో దాదాపు 30 శాతం మంది మహిళలే ఉన్నారట. చంద్రయాన్-2 ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వనిత ముత్తయ్య, మిషన్ డైరెక్టర్‌గా రీతూ కరిదాల్ వ్యవహరిస్తున్నారు.


- వనిత ముత్తయ్య డాటా నిర్వహణలో నిపుణురాలు. సమస్యలను పరిష్కరించడంలో, బృందానికి నాయకత్వం వహించడంలో ఆమెకు మంచి నేర్పు ఉన్నది. వనిత ఇంతకుముందు చంద్రయాన్-1, కార్టోశాట్-1, ఓషన్‌శాట్ తదితర ప్రాజెక్టుల్లో భాగస్వామి అయ్యారు. రోదసి నుంచి ఉపగ్రహాలు, స్పేస్‌క్రాఫ్ట్‌లు పంపిన సమాచారాన్ని విశ్లేషించారు. చంద్రయాన్-2లో టెలిమెట్రీ, టెలీకమాండ్ డివిజన్‌కు నాయకత్వం వహిస్తున్నారు. 2006లో ఉత్తమ మహిళా శాస్త్రవేత్త అవార్డు అందుకున్నారు.
- లక్నోకు చెందిన రీతూ కరిదాల్.. 1997 నుంచి ఇస్రోలో పనిచేస్తున్నారు. గతంలో అనేక ప్రాజెక్టుల్లో కీలకపాత్ర పోషించారు. ఉపగ్రహాలు, స్పేస్‌క్రాఫ్ట్‌లను నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టే బృందంలో ఆమె సభ్యురాలు. అంగారకుడిపై పరిశోధనల కోసం 2013లో పంపిన మార్స్ ఆర్బిటార్ మిషన్ (మామ్)కు డిప్యూటీ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. 2007లో అప్పటి రాష్ట్రపతి చేతుల మీదుగా 'ఇస్రో ఉత్తమ యువ శాస్త్రవేత్త' అవార్డు అందుకున్నారు.

**మహిళల కీలకపాత్ర**

చంద్రయాన్-2 మిషన్ కోసం ప్రత్యేకంగా ఎలాంటి బృందం లేదని.. ఇస్రోలోని 17వేల మంది సిబ్బంది ఈ మిషన్ కోసం కష్టపడ్డారని సంస్థ చైర్మన్ కే శివన్ చెప్తున్నారు. మిషన్ విజయం సాధిస్తే ఆ ఘనత ప్రతి ఒక్కరికీ దక్కుతుందని చెప్పారు. అయితే విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు చంద్రయాన్-2 కోసం ప్రత్యేకంగా 300 మంది శాస్త్రవేత్తలతో ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో దాదాపు 20-30 శాతం వరకు మహిళలు ఉన్నట్టు అంచనా. గతంలోనూ మహిళలు అనేక ప్రాజెక్టుల్లో కీలకపాత్ర పోషించారు. ముఖ్యంగా 'మామ్' ప్రాజెక్టు కోసం ఒక యువ బృందం అహోరాత్రాలు శ్రమించింది. 'మామ్ కోసం 18 నెలలు నిరంతరాయంగా శ్రమించడానికి సిద్ధమయ్యాం. అంగారకుడి కక్ష్యలోకి వెళ్లిన తర్వాత భూమి నుంచి సంకేతాలు అందని సమయంలో స్పేస్‌క్రాఫ్ట్ స్వతంత్రంగా పనిచేసేలా సాఫ్ట్‌వేర్ రూపొందించే బాధ్యత తీసుకున్నాం. ఇది ఎంతో క్లిష్టమైన ప్రక్రియ అయినా.. సమిష్టి కృషితో 10 నెలల్లోనే సాఫ్ట్‌వేర్‌ను సిద్ధంచేశాం' అని రీతూ కరిదాల్ ఓ సందర్భంలో వ్యాఖ్యానించారు.

- ఇస్రో త్వరలో చేపట్టనున్న మానవ సహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'లో సైతం మహిళా శాస్త్రవేత్తలకు ప్రాధాన్యం కల్పించారు. రోదసిలోకి పంపనున్న ముగ్గురు వ్యోమగాముల్లో ఒక మహిళ ఉన్నారు. ఈ ప్రాజెక్టులోని 'హ్యూమన్ స్పేస్ ప్రోగ్రామ్ ఆఫీస్'కు వీఆర్ లలితాంబిక నాయకత్వం వహిస్తున్నారు.
- వీరితోపాటు టీకే అనురాధ, ఎన్ వలర్మతి, సీతా సోమసుందరం, నందిని హరినాథ్, మినాల్ రోహిత్, మౌమితా దత్తా వంటి మహిళా శాస్త్రవేత్తలు అనేక ప్రాజెక్టుల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు.


### చంద్రయాన్-2లో భాగమైన మహిళలకు అక్షయ్, సోనాక్షి విషెస్



భారతదేశ అంతరిక్ష చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబోయే అద్భుత ఘట్టం చంద్రయాన్-2 ప్రయోగంపై సర్వత్రా ఉత్కంఠ రేగుతున్నది. ఈ నేపథ్యంలో చంద్రయాన్-2 మిషన్‌లో పాలుపంచుకున్న మహిళా శాస్త్రవేత్తలకు బాలీవుడ్ ప్రముఖ నటుడు అక్షయ్ కుమార్, నటి సోనాక్షి సిన్హా శుభాకాంక్షలు తెలిపారు. ఇద్దరు మహిళల నేతృత్వంలో చంద్రయాన్-2 లాంటి ఇంత పెద్ద ప్రయోగం రూపొందటం భారత చరిత్రలో తొలిసారని అక్షయ్ ప్రశంసించారు. చంద్రయాన్-2లో పాలుపంచుకున్న ఇద్దరు మహిళలను చూస్తే గర్వ కారణంగా ఉన్నదని సోనాక్షి ట్వీట్ చేసింది. కాగా చంద్రయాన్-2కి రీతూ కారిదాల్ మిషన్ డైరెక్టర్‌గా, ముత్తయ్య వనిత ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తుండటం తెలిసిందే.

## నాయకత్వం వహించడమే లక్ష్యం..

చంద్రునిపై స్వచ్ఛమైన హీలియం-3 ఛాయలను గుర్తించేందుకు చంద్రయాన్-2 ప్రయోగం విశ్లేషణలు చేయనున్నది. జాబిల్లిపై ఉన్న హీలియం-3ని సమర్థంగా వాడుకోగలిగితే భూమి మొత్తానికి అవసరమైన విద్యుత్‌ను ఏకంగా 500 ఏండ్ల పాటు తయారు చేసుకోవచ్చు. ప్రస్తుత విపణిలో ఒక టన్ను హీలియం ఖరీదు 500 కోట్ల డాలర్లుగా ఉంటుందని అంచనా. చంద్రునిపై మొత్తం 10 లక్షల మెట్రిక్ టన్నుల హీలియం-3 ఉండొచ్చని భావిస్తున్నారు. దీని ఖరీదు ట్రిలియన్ల డాలర్లు (కోటి కోట్ల డాలర్లు)కు మించి ఉంటుంది. అయితే, చంద్రునిపై ఉన్న మొత్తం హీలియంలో కేవలం పావు శాతం వరకే భూమిపైకి తీసుకురాగలమని నిపుణులు చెబుతున్నారు. చంద్రునిపై ఉన్న ఇంధనాన్ని తీసుకొచ్చే దేశాలకు నాయకత్వం వహించడమే తమ లక్ష్యమని ఇస్రో చైర్మన్ శివన్ ఓ సందర్భంలో అన్నారు..



## అప్పుడు అపోలో 11.. ఇప్పుడు చంద్రయాన్ -2

చంద్రునిపై వ్యోమగాములను పంపే ఉద్దేశంతో 1969 జూలై 16వ తేదీన అపోలో 11 మిషన్‌ను ప్రయోగించారు. అపోలో 11 స్వర్ణోత్సవ(యాభై ఏండ్లు) వసంతంలోనే చంద్రయాన్-2ని భారత్ పంపుతున్నది. అపోలో 11 మిషన్ ద్వారా చంద్రుడి ఉపరితలం మీద మొదటిసారిగా అడుగుపెట్టి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, బజ్ ఆల్డ్రీన్ చరిత్రకెక్కారు. ఇప్పుడు చంద్రయాన్-2 ద్వారా చంద్రుని దక్షిణ ధ్రువం రహస్యాలను కనిపెట్టి భారత్ కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టనున్నది.



## శ్రీహరికోట చేరుకున్న రాంనాథ్ కోవింద్

రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోట చేరుకున్నారు. చంద్రయాన్-2 ప్రయోగాన్ని ఆయన ప్రత్యక్షంగా వీక్షించనున్నారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో శ్రీహరికోట వెళ్లారు. సోమవారం వేకువ జామున సరిగ్గా 2.51 గంటలకు జీఎస్ఎల్వీ మాక్-3 రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లనుంది.

## ఇస్రో ప్రస్థానం..





| | |
|---|---|
| 1962 – | భారత అణుశక్తి వ్యవస్థ పితామహుడయిన హోమీ బాబా పర్యవేక్షణలో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ (ఐఎన్‌సీఓఎస్‌పీఏఆర్) సెంటర్‌ను బెంగుళూరులో విక్రమ్ సారాభాయ్ ఏర్పాటు చేశారు. |
| 1963 – | మొదటి సౌండింగ్ రాకెట్‌ను తుంబా ఈక్వటోరియల్ రాకెట్ లాంచింగ్ స్టేషన్ (టీఈఆర్ఎల్ఎస్) నుంచి ప్రయోగించారు. |
| 1965 – | తుంబాలో స్పేస్‌సైన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు |
| 1967 – | ఉపగ్రహ ప్రయోగ కేంద్రం ఏర్పాటు |
| 1968 – | అప్పటి ప్రధాని ఇందిరా టీఈఆర్ఎల్ఎస్‌ను బ్రిటన్‌కు అంకితం చేశారు. |
| 1969 – | భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఏర్పాటు |
| 1971 – | షార్(శ్రీహరికోట) అందుబాటులోకి వచ్చింది |
| 1972 – | డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్(డీఓఎస్) ఏర్పాటు |
| 1972 – | బెంగుళూరులో ఇస్రో శాటిలైట్ సెంటర్ ఏర్పాటు |
| 1975 – | ప్రభుత్వ సంస్థగా మారిన ఇస్రో, ఆర్యభట్ట ప్రయోగం |
| 1979 – | భాస్కర 1 ప్రయోగం |
| 1981 – | ఆపిల్, భాస్కర 2 ప్రయోగం |
| 1982 – | ఇన్‌శాట్ 1ఏ ప్రయోగం |
| 1983 – | ఇన్‌శాట్ 1బీ ప్రయోగం |
| 1987 – | రోహిణీ ప్రయోగం |
| 1988 – | ఇన్‌శాట్ 1సీ ప్రయోగం |
| 1990 – | ఇన్‌శాట్ 1డీ ప్రయోగం |
| 1992 – | ఏఎస్ఎల్వీ మొదటిసారిగా సక్సెస్, ఇన్‌శాట్ 2ఏ ప్రయోగం |
| 1993 – | మొదటి పీఎస్ఎల్వీ అభివృద్ధి, ఇన్‌శాట్ 2బీ ప్రయోగం |
| 1995 – | ఇన్‌శాట్ 2సీ ప్రయోగం 1997 – ఇన్‌శాట్ 2డీ ప్రయోగం |
| 1999 – | ఇన్‌శాట్ 2ఈ ప్రయోగం 2000 – ఇన్‌శాట్ 3 సిరీస్ ప్రారంభం |
| 2001 – | మొదటి జీఎస్ఎల్వీ(ఆపరేషనల్) సక్సెస్ |
| 2002 – | కల్పనా ప్రయోగం |
| 2004 – | ఈడీయూశాట్(ఎడ్యుశాట్) ప్రయోగం |
| 2005 – | కార్టోశాట్ ప్రయోగం |
| 2006 – | రెండో జీఎస్ఎల్వీ ఆపరేషనల్ ప్రయోగం |
| 2007 – | ఎస్ఆర్ఈ-1ని విజయవంతంగా కనిపెట్టడం |
| 2008 – | చంద్రయాన్ 1 ప్రయోగం |
| 2010 – | విజయవంతమైన జీఎస్ఎల్వీ స్టాటిక్ టెస్టింగ్ |
| 2013 – | మార్స్ ఆర్బిటార్ మిషన్ |
| 2015 – | ఆస్ట్రోశాట్ ప్రయోగం |
| 2017 – | పీఎస్ఎల్వీ సీ-37 ద్వారా 104 ఉపగ్రహాల ప్రయోగం |
| 2019 – | చంద్రయాన్ 2 ప్రయోగం |

## బాహుబలి రాకెట్..

చంద్రయాన్-2 ప్రయోగంలో వాహకనౌకగా వినియోగించనున్న రాకెట్ పేరు జీఎస్ఎల్వీ-మార్క్3. ఇస్రో అమ్ములపొదిలో గురితప్పని బ్రహ్మాస్త్రాలుగా ఈ జియోసింక్రనస్ లాంచ్ వెహికల్స్‌కు పేరుంది. ఇప్పటివరకూ జీఎస్ఎల్వీ-మార్క్3 రాకెట్లను ఇస్రో మూడుసార్లు ఉపయోగించింది. జీఎస్ఎల్వీ-మార్క్3 రాకెట్‌కు ఇస్రో శాస్త్రవేత్తలు ఫ్యాట్‌బాయ్ (ధృడమైన బాలుడు) అని నామకరణం చేయగా.. మీడియా మాత్రం 'బాహుబలి'గా అభివర్ణిస్తున్నది.



## జామురాతిరి జాబిలమ్మ చెంతకు

మొదటిపేజీ తరువాయి...

చంద్రుడిపై తొలిసారి మానవుడు కాలుమోపి 50 ఏండ్లు పూర్తయిన తరుణంలోనే చందమామపై పరిశోధనల కోసం చంద్రయాన్-2 బయలుదేరుతుండటం విశేషం.

అతి తక్కువ వ్యయంతో, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన చంద్రయాన్-2.. సోమవారం వేకువజామున 2:51 గంటలకు నింగిలోకి దూసుకెళ్లనున్నది. ఇస్రో బాహుబలిగా పిలిచే 'జీఎస్ఎల్వీ మాక్-3' రాకెట్ దీనిని రోదసిలోకి మోసుకెళ్లనున్నది. దాదాపు 54 రోజుల ప్రయాణం తర్వాత సెప్టెంబర్ 6/7న ల్యాండర్ చందమామ ఉపరితలంపై దిగుతుం ది. రోవర్ చంద్రుడి ఉపరితలంపై సంచరిస్తూ పరిశోధనలు చేయనున్నది. ఈ ప్రయోగం జయప్రదమైతే చంద్రుడిపై రోవర్‌ను దింపిన నాలుగోదేశంగా భారత్ రికార్డు సృష్టించనున్నది.

ప్రస్తుతానికి అన్నీ ప్రణాళిక ప్రకారమే జరుగుతున్నాయని ఇస్రో తెలిపింది. చందమామను మరింత లోతుగా అర్థం చేసుకోవడమే తమ లక్ష్యమని, తమ ఆవిష్కరణలు భారత్‌తోపాటు మానవాళికి లాభదాయకంగా ఉంటాయన్నది. దీన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఆదివారం శ్రీహరికోటకు చేరుకున్నారు. అంతరిక్ష రంగంలో భారత ఖ్యాతిని ఇనుమడింపజేసే ఈ ప్రయోగాన్ని యావత్ దేశాలు ఆసక్తిగా పరిశీలిస్తున్నాయి.

**నీరు, హీలియం-3ని గుర్తించడమే ప్రధాన లక్ష్యం**

చంద్రుడి దక్షిణ ధ్రువంలో దిగడం, నీరు, హీలియం-3 జాడను గుర్తించడం చంద్రయాన్-2 ప్రధాన లక్ష్యాలు. ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-1.. చందమామపై నీటిజాడను గుర్తించిన సంగతి తెలిసిందే. దాన్ని చంద్రయాన్-2 ద్వారా నిర్ధారించాలని, నీరు ఏ రూపంలో? ఎంత మేర ఉన్నదో తేల్చాలని శాస్త్రవేత్తలు నిర్ణయించారు. చంద్రయాన్-2లో ఆర్బిటార్, ల్యాండర్, రోవర్ అత్యంత కీలకం. ఆర్బిటార్ చంద్రుడికి 100 కిమీ ఎత్తులో గల కక్ష్యలో తిరుగుతుంటుంది. అక్కడి వాతావరణం, ఇతర పరిస్థితులను గమనిస్తూ నిత్యం సమాచారాన్ని భూమికి చేరవేస్తుంది.

ల్యాండర్.. చంద్రుడి ఉపరితలంపైకి దిగే భాగం. ప్రముఖ శాస్త్రవేత్త విక్రమ్ సారాబాయ్ జ్ఞాపకార్థం దీనికి 'విక్రమ్' అని పేరుపెట్టారు. దీని బరువు 14 కిలోలు. ఇందులోని రోవర్‌కు 'ప్రజ్ఞ' అని పేరుపెట్టారు. ప్రజ్ఞ బరువు 27 కిలోలు. ఈ రెండూ 14 రోజులు చంద్రుడి ఉపరితలంపై పరిశోధించనున్నాయి.

**చంద్రయాన్-2లో 10 ఆసక్తికర అంశాలు**

1. చంద్రయాన్-2 బరువు దాదాపు 3.8 టన్నులు. 15 అంతస్తుల భవనమంత ఎత్తు ఉండే ఈ రాకెట్ బరువు 640 టన్నులు. దీనిని ఇస్రో బాహుబలి రాకెట్‌గా పిలుస్తుంటారు. ఇది మూడోసారి అంతరిక్షంలోకి వెళ్లనున్నది.
2. చంద్రయాన్-2 శ్రీహరికోట నుంచి బయలుదేరిన తర్వాత చంద్రుడి దక్షిణ ధ్రువంవైపు ప్రయాణిస్తుంది. ఈ క్రమంలో దాదాపు 2 నెలల పాటు 3.84 లక్షల కిమీ ప్రయాణిస్తుంది.
3. ఈ మిషన్‌లోని ఆర్బిటార్, ల్యాండర్, రోవర్ వంటి వ్యవస్థలన్నీ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసినవే. 2009లో విజయవంతంగా ప్రయోగించిన చంద్రయాన్-1కు కొనసాగింపుగా చంద్రయాన్-2ను ప్రయోగిస్తున్నారు.
4. ఇస్రో బడ్జెట్‌తో పోల్చితే నాసాకు 20 రెట్లు ఎక్కువగా నిధులందుతున్నాయి.
5. ఈ ప్రయోగం విజయవంతమైతే అమెరికా, రష్యా, చైనా సరసన చంద్రుడిపై ల్యాండర్‌ను దింపిన నాలుగో దేశంగా భారత్ అవతరిస్తుంది. ఇజ్రాయెల్ ఈ ఏడాది మొదట్లో ల్యాండర్‌ను దింపాలని ప్రయత్నించినా విఫలమైంది.
6. రాకెట్ నిర్దేశిత కక్ష్యలో రోదసిలోకి వెళ్లడంతోనే విజయం సాధించినట్టు కాదని ఇస్రో చైర్మన్ శివన్ అన్నారు. చివరి 15 నిమిషాలు అత్యంత విలువైన, ఉత్కంఠ భరిత క్షణాలని, గతంలో ఎన్నడూ ఇంత సంక్లిష్ట ఆపరేషన్ చేపట్టలేదన్నారు.
7. చంద్రయాన్-2లోని లాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై 2 భారీ బిలాల మధ్యలోని ఎత్తయిన, చదును ప్రదేశంలో దిగుతుంది.
8. రోవర్ 14 రోజులు చంద్రు డి ఉపరితలంపై పరిశోధనలు జరుపుతుందని అంచనా వేస్తున్నారు.
9. దీని తర్వాత ఇస్రో గగన్‌యాన్‌పై దృష్టి సారిస్తుంది. 2022లో జరిగే మానవ సహిత అంతరిక్ష యాత్రలో ముగ్గురు వ్యోమగాములను రోదసిలోకి పంపనుంది.
10. సమీప భవిష్యత్‌లో అంతరిక్ష రంగంలో భారత్ తిరుగులేని శక్తిగా అవతరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అతి తక్కువ వ్యయంతో తయారు చేసిన ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించడంతో భారత్ భారీ ఒప్పందాలు చేజిక్కించుకుంటుందని చెప్తున్నారు.



చంద్రునిపై ల్యాండర్ స్మూత్ ల్యాండింగ్ (ఊహాచిత్రం)

# హిందూధర్మాన్ని, గోవులను పరిరక్షిద్దాం



తిరుమల శ్రీవారిని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం నైవేద్య విరామ సమయంలో కుటుంబసమేతంగా స్వామివారి సేవలో రాష్ట్రపతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో అనిల్‌కుమార్ సంఘాల్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. రాష్ట్రపతి వెంట గవర్నర్ నరసింహన్ తదితరులున్నారు. అనంతరం రాష్ట్రపతి శ్రీహరికోటకు వెళ్లారు. - తిరుమల, నమస్తే తెలంగాణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్రసరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రసరస్వతి ఆదివారం రుషికేశ్‌శాఖ భవనంలో సాధుసంతులతో సమావేశమయ్యారు. రుషికేశ్, హరిద్వార్‌లో నివసించే స్వాములు తపోభూమికే పరిమితం కాకుండా దేశంలో పర్యటించి హిందూధర్మ రణకు, గోవుల పరిరక్షణకు కృషిచేయాలని కోరారు. స్వాములకు, సాధుసంతులకు బండారా (అన్నదానం) చేపట్టి, వస్త్రాలు, విశేష దక్షిణలతో సత్కరించారు.

**నూతనవస్త్రాలు పంపిన సీఎం కేసీఆర్**

చాతుర్మాస్య దీక్ష చేపట్టనున్న విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్రసరస్వతి మహాస్వామి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రస్వామికి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నూతనవస్త్రాలను పంపారు. రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు దంపతులు, వారి కుమారుడు, ఎమ్మెల్యే సతీశ్.. స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్రస్వాములకు సీఎం కేసీఆర్ పంపిన నూతనవస్త్రాలను అందజేసి ఆశీస్సులు పొందారు. కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి దంపతులు శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్రస్వామిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. 2020 జనవరి 2 నుంచి 5 వరకు మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో నిర్వహించే అశ్వమేధయాగంలో పాలుపంచుకోవాలని స్వామివారిని ఆహ్వానించారు. వీరితోపాటు నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రుషికేశ్‌లో విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్రసరస్వతి మహాస్వామి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రస్వామిచేపట్టిన కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు దంపతులు, ఎమ్మెల్యే సతీశ్ తదితరులు



# మున్సిపోల్స్ షెడ్యూల్ సవరణ

## రేపటివరకు తుది ఓటరు జాబితా

21 వరకు పోలింగ్ కేంద్రాల జాబితా.. షెడ్యూళ్లు సవరిస్తూ ఎస్‌ఈసీ ఆదేశాలు

రిజర్వేషన్ల ఖరారు కూడా కొంత ఆలస్యమయ్యే అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా పలు షెడ్యూళ్లను సవరించారు. పోలింగ్ కేంద్రాల ఖరారు, ఓటర్ల తుది జాబితా విడుదలకు మరింత సమయం తీసుకొంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) ఆదేశాలిచ్చింది. ఓటర్ల తుది జాబితా ఆలస్యం కావడంతో.. రిజర్వేషన్ల ఖరారు కూడా లేటు కానున్నది. నూతన మున్సిపల్ చట్టం అమల్లోకి తీసుకొచ్చిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికలు వచ్చేనెలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుగా జారీచేసిన షెడ్యూళ్లను సవరించారు. దాని ప్రకారం, 129 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లలో వార్డులవారీగా తుది ఓటరు జాబితాను ఈ నెల 16న విడుదలచేయాలని ఎస్‌ఈసీ ఆదేశాలిచ్చింది. తుది ఓటరు జాబితాను ఆదివారమే విడుదల చేయాల్సి ఉండగా.. కొన్ని ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిష్కారం చేసే నేపథ్యంలో ఈ జాబితాను సవరిస్తున్నారు. అయితే సమయం ఉండటంతో మంగళవారానికి తుది ఓటరు జాబితా విడుదల చేయాలని ఆదివారం ఉదయం అత్యవసర ఆదేశాలు జారీచేశారు.

**17న వార్డులవారీగా ముసాయిదా**

ఈ నెల 21న వార్డులవారీగా పోలింగ్ కేంద్రాల తుది జాబితాను విడుదలచేయాలని ఎస్‌ఈసీ కార్యదర్శి అశోక్‌కుమార్ ఆదివారం ఆదేశాలిచ్చారు. గత షెడ్యూల్ ప్రకారం సోమవారం పోలింగ్ కేంద్రాల ముసాయిదా విడుదలచేసి, ఈ నెల 19న తుది జాబితాను ప్రకటించాల్సి ఉన్నది. సవరించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 17న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డులవారీగా ముసాయిదా విడుదల చేయాలని, అలాగే అదేరోజున అన్ని రాజకీయ పక్షాలతో మున్సిపాలిటీల్లో సమావేశం నిర్వహించాలని సూచించారు. ఈ నెల 19న సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించాలని, అదేరోజున అభ్యంతరాలను పరిష్కరించి, కలెక్టర్లకు పోలింగ్ కేంద్రాల తుది జాబితా పంపించాలని ఎస్‌ఈసీ పేర్కొన్నది. ఈ నెల 21న జిల్లా కలెక్టర్లు అమోదించిన పోలింగ్ కేంద్రాల తుది జాబితాను విడుదల చేయాలని ఆదేశాలిచ్చారు. మరోవైపు వార్డులవారీగా తుది ఓటరు జాబితా విడుదల మంగళవారం వరకు పొడిగించడంతో.. రిజర్వేషన్ల ఖరారుకు కూడా సమయం తీసుకొంటున్నారు. ఇప్పటికే బీసీ ఓటర్లు, ఎస్సీ,ఎస్టీ జనాభా లెక్కలు, ఓటరు జాబితా సిద్ధంచేశారు. దాని ఆధారంగానే రిజర్వేషన్లు ఖరారు చేయాల్సి ఉన్నది. తుది జాబితా ప్రకటనకు సమయం ఇవ్వడంతో, రిజర్వేషన్లను కూడా ఈ నెల 17 వరకు ఖరారు చేయనున్నట్లు అధికారులు చెప్తున్నారు. రిజర్వేషన్ల జాబితాను ఎస్‌ఈసీకి అందించిన తర్వాత ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# గ్రీన్ సెక్రటేరియట్

కొత్త సచివాలయం పర్యావరణహితం.. అంతర్జాతీయ ప్రమాణాలు, హరిత ట్రిబ్యునల్ నిబంధనల పాటింపు

ఐదెకరాల్లోనే భవన నిర్మాణాలు.. 20 ఎకరాల్లో పార్కులు, ఫౌంటెన్లు.. త్వరలో నివేదిక ఇవ్వనున్న టెక్నికల్ కమిటీ

హరిత ట్రిబ్యునల్ నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు.. అస్తవ్యస్తంగా ప్రస్తుత సచివాలయం



హైదరాబాద్‌లో కొత్తగా నిర్మించనున్న సచివాలయ కాంప్లెక్స్ నమూనా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొత్త సచివాలయాన్ని జాతీయ హరిత ట్రిబ్యునల్ నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పర్యావరణహితంగా నిర్మించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయించినట్టు తెలిసింది. ప్రస్తుత సచివాలయ భవనాలు 25 ఎకరాల విస్తీర్ణంలో అస్తవ్యస్తంగా ఉన్నందున కొత్త సమీకృత సచివాలయ భవనాలను తక్కువ స్థలంలోనే క్రమపద్ధతిలో నిర్మించనున్నారు. ఈ నిర్మాణాలన్నింటినీ కేవలం ఐదెకరాల్లోనే చేపట్టి మిగిలిన 20 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనం వెల్లివిరిసేలా ఉద్యాన వనాలు, వాటర్ ఫౌంటేన్లు ఏర్పాటుచేయనున్నారు. నగరంలోనే అతిపెద్ద అర్బన్ పార్కు ఇక్కడ ఆవిర్భవించనున్నది. ఈ మేరకు నూతన సచివాలయ నమూనాలను రూపొందించాలని సీఎం కేసీఆర్ ఇప్పటికే అధికారులను ఆదేశించారు.

**త్వరలో టెక్నికల్ కమిటీ నివేదిక**

నూతన సచివాలయం నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై పలువురు ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పుడున్న భవనాలు బాగానే ఉన్నాయని, వాటిని కూల్చాల్సిన అవసరమేమున్నదని ప్రశ్నిస్తూ కొందరు కోర్టును ఆశ్రయించారు. అయితే వాస్తవ పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవడంతోపాటు తెలంగాణ ప్రతిష్ఠను పెంపొందించేందుకు కొత్త సచివాలయాన్ని నిర్మిస్తున్నామని ప్రభుత్వం చెపుతున్నది. సౌకర్యాలను మెరుగుపరిచేందుకు రూ.400 కోట్లు ఖర్చుపెట్టడాన్ని తప్పుపట్టాల్సిన పనిలేదని తెలంగాణవాదులు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాత భవనాల్లోని లోటుపాట్లు, అసౌకర్యాలు ఏమిటి? నూతన సచివాలయాన్ని నిర్మించాల్సిన అవసరమేంత? కొత్త భవనాల నిర్మాణంలో ఎలాంటి ప్రమాణాలను పాటించాలి? అనే అంశాలపై టెక్నికల్ కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి త్వరలో నివేదిక ఇవ్వనున్నది.

**పద్మవ్యూహాన్ని మైమరిపిస్తున్న సచివాలయం**

ప్రస్తుత సచివాలయ ప్రాంగణంలో భవనాల నిర్మాణం అత్యంత యాదృచ్ఛికంగా, అస్తవ్యస్తంగా సాగింది. ఒకటి ఉత్తరంవైపు, మరొకటి దక్షిణంవైపు అన్నట్టు నిర్మాణాలన్నీ విసిరేసినట్టుగా పద్మవ్యూహాన్ని తలపిస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు. ఏ భవనంలో ఏ శాఖ ఉన్నది? పనుల కోసం తాము వెళ్లాల్సిన విభాగం ఎక్కడ ఉన్నది? అనే విషయాలను తెలుసుకోవడం ప్రజలకు ఒక పజిల్‌గా మారింది. ఇది చాలదన్నట్టు వాహనాల పార్కింగ్ మరో ప్రధాన సమస్యగా మారింది.

**చిన్న చినుకు పడినా..**

ప్రస్తుత సచివాలయంలో చిన్న చినుకు పడినా కార్యకలాపాలు స్తంభిస్తున్నాయి. వేసవిలో ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు కూడా ఉద్యోగులు ఫైళ్లు పట్టుకొని ఒక బ్లాక్ నుంచి మరో బ్లాక్‌కు వెళ్లలేని పరిస్థితి ఉన్నది. ప్రభుత్వ అవసరాలను తీర్చగలిగే సమావేశ మందిరాలు, వీడియో కాన్ఫరెన్స్ హాళ్లు, ఉద్యోగులతోపాటు సందర్శకులకు అవసరమయ్యే కెఫెటేరియా, క్యాంటీన్ల లాంటి సదుపాయాలు ప్రస్తుతం లేవు.

**భద్రతాపరమైన లోపాలెన్నో**

ప్రస్తుత సచివాలయంలో భద్రత గాలిలో దీపంలా ఉన్నది. 2003లో నిర్మించారని చెప్తున్న డీ-బ్లాక్‌లో సైతం ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే ప్రజలు కనీసం బయటకు పరుగెత్తి ప్రాణాలు కాపాడుకోలేని దుస్థితి. సాక్షాత్తూ ముఖ్యమంత్రి కొలువుదీరే సీ-బ్లాక్‌లో సైతం భద్రతా లోపాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ఇక 1998లో నిర్మించిన ఏ-బ్లాక్‌తోపాటు 1978లో నిర్మించిన బీ, సీ బ్లాక్‌ల సంగతి సరేసరి. ఇవన్నీ జాతీయ భవన నిర్మాణ నిబంధనలకు, హరిత నిబంధనలకు లోబడిలేవు.

**అన్ని వర్గాలతో చర్చించాకే..**

కొత్త సచివాలయాన్ని నిర్మిస్తే.. ఇప్పుడున్న నల్లపోచమ్మ దేవాలయంతోపాటు మసీదు, క్రైస్తవ ప్రార్థనా మందిరాలను ఏమిచేయాలనే దానిపై కమిటీ పరిశీలనలో రెండు ప్రతిపాదనలున్నాయి. గుడిని అలాగే ఉంచితే.. చుట్టూ ఐలాండ్‌ను ఏర్పాటుచేసి ఎలివేషన్‌లో కలపాలన్నది ఒక ప్రతిపాదన. ప్రస్తుతం ఉన్న చోటు నుంచి గుడిని తొలిగించి వాస్తుకు అనుగుణంగా వేరేచోట నిర్మించాలన్నది మరో ప్రతిపాదన. బేగంపేటలో ప్రగతి భవన్ నిర్మించిన ప్రాంతంలో కూడా ఓ దేవాలయం ఉండేది. అక్కడినుంచి దాన్ని తొలిగించి మరోచోట నిర్మించిన విషయాన్ని అధికారులు గుర్తుచేస్తూ.. మసీదు, చర్చిలను కూడా వేరేచోటికి తరలించవచ్చంటున్నారు. సమీకృత సచివాలయ భవన నిర్మాణాన్ని ప్రస్తుత మసీదుకు ముందు భాగంలో చేపడితే మసీదును కూల్చాల్సిన అవసరం ఉండదు. అప్పుడు చర్చిని మాత్రం మరోచోట ఏర్పాటుచేస్తారు. ఈ విషయమై ప్రభుత్వం అన్ని వర్గాలతో సంప్రదించిన తర్వాతే సరైన నిర్ణయం తీసుకోనున్నది.

### 20 ఎకరాల్లో ఉద్యానవనాలు, ఫౌంటెన్లు

ప్రస్తుతం 25 ఎకరాల్లో అస్తవ్యస్తంగా విస్తరించిన సచివాలయం కాంక్రీట్ జంగిల్‌ను తలపిస్తున్నది. దీంతో కొత్త సచివాలయ నిర్మాణాలను ఐదెకరాలకే పరిమితంచేయాలని, మిగతా 20 ఎకరాల్లో పచ్చని చెట్లు, పచ్చికబయళ్లను పెంచి ఉద్యానవనాలు, వాటర్ ఫౌంటెన్లతో భూతలస్వర్గాన్ని తలపించేలా తీర్చిదిద్దాలని, తద్వారా హుస్సేన్‌సాగర్ ఒడ్డున స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు. ఆ మేరకు కొత్త సచివాలయ భవన సముదాయ నమూనాను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. దీంతో వివిధ రకాల డిజైన్లను రూపొందించడంలో అధికారులు నిమగ్నమయ్యారు. వీరి డిజైన్లలో అన్నివిధాలా అనువుగా ఉండే నమూనాను సీఎం కేసీఆర్ ఖరారుచేస్తారు.

## విద్యతోనే మైనార్టీల సాధికారత

ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్, టెమ్రీస్ కార్యదర్శి షఫిఉల్లా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నాణ్యమైన విద్యతోనే మైనార్టీల సాధికారత సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్, తెలంగాణ మైనారిటీస్ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (టెమ్రీస్) కార్యదర్శి బీ షఫిఉల్లా అన్నారు. తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచితంగా అందించే ఐఏఎస్ శిక్షణకు ప్రవేశపరీక్షను ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. నిజాం కాలేజీలో పరీక్షకేంద్రాన్ని వారు సందర్శించారు.

## హజ్ యాత్రికులకు విమాన టికెట్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హజ్ యాత్రికులకు కేటాయించిన తేదీల్లో విమాన టికెట్లను ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకోవచ్చని హజ్ కమిటీ చైర్మన్ మసిఉల్లాఖాన్ తెలిపారు. హైదరాబాద్‌లోని మసీద్ ఏ హుస్సైనీలో ఆదివారం శిక్షణ శిబిరం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ, ఏపీకి చెందిన యాత్రికులకు జూలై 26 నుంచి ఆగస్టు నాలుగు వరకు విమానాలు ఏర్పాటుచేశామని చెప్పారు.

# మిషన్ భగీరథ నాలెడ్జ్ సెంటర్!

## కోమటిబండ గుట్టపై అందమైన భవనం నిర్మాణం

సాంకేతిక పరిజ్ఞానంతోపాటు పూర్తి సమాచారం

ఇప్పటికే ఆకట్టుకుంటున్న ఇంజినీరింగ్ అద్భుతం

ఇంజినీర్లు, మేధావులు తెలుసుకోవడానికి ఆసక్తి

**గజ్వేల్, నమస్తే తెలంగాణ:** ఇంటింటికి స్వచ్ఛమైన మంచినీటిని అందిస్తూ, దేశంలోనే గుర్తింపు పొందిన మిషన్ భగీరథ మంచినీటి పథకం నాలెడ్జ్ సెంటర్‌ను గజ్వేల్ పరిధిలోని కోమటిబండ గుట్టపై ఏర్పాటుచేస్తున్నారు. మిషన్ భగీరథ పథకానికి సంబంధించిన పూర్తి సమాచారంతో ఈ సెంటర్‌ను అభివృద్ధి చేస్తున్నారు. స్వయంగా సీఎం కేసీఆర్ గూగుల్ ద్వారా గుర్తించి గజ్వేల్‌తోపాటు సిద్దిపేట డివిజన్‌లోని పలు ప్రాంతాలకు కోమటిబండ నుంచి గ్రావిటీ ద్వారా నీటి సరఫరాకు డిజైన్ చేశారు. ఇది దేశంలోనే ఓ అద్భుత గ్రావిటీ నీటి సరఫరా కేంద్రంగా గుర్తింపు పొందింది. మిషన్ భగీరథ పథకం ఊహించిన దానికన్నా విజయవంతమై ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. దేశవిదేశాల నుంచి ఎందరో మిషన్ భగీరథ కోమటిబండ సంప్‌హౌస్ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు.

**సాంకేతిక అంశాలుసహా పూర్తి సమాచారం**

నాలెడ్జ్ సెంటర్‌లో మిషన్ భగీరథ పథకానికి సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులో ఉంచుతారు. ఫొటో ఎగ్జిబిషన్, వీడియో ప్రదర్శన ద్వారా గోదావరి నీటి తరలింపు, గ్రావిటీ ద్వారా సంప్‌ల నుంచి గ్రామాలకు, ఇంటింటికీ నీటి సరఫరా, నీటి శుద్ధి విధానంలో సాంకేతిక, తదితర అంశాలపై పూర్తి సమాచారం ఈ సెంటర్‌లో అందుబాటులో ఉంటుంది. 40 మంది ప్రతినిధులు ఒకేసారి పరిశీలించి వివిధ అంశాలపై పూర్తి సమాచారం పొందేందుకు వీలుగా ముఖ్యమంత్రి కేసీఆర్ సూచన మేరకు నాలెడ్జ్ సెంటర్‌లో అత్యాధునిక ఏర్పాట్లుచేస్తున్నారు.



మిషన్ భగీరథ నాలెడ్జ్ సెంటర్ కోసం కోమటిబండ గుట్టపై నిర్మించిన భవనం. (ఇన్‌సెట్‌లో) నాలెడ్జ్ సెంటర్ లోపలి భాగాలను పరిశీలిస్తున్న మిషన్ భగీరథ ఎస్‌ఈ రాజయ్య

పర్యాటక ప్రాంతంగా మారడం, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ సాంకేతిక పరిజ్ఞానం గురించి వివిధ ప్రాంతాల ఇంజినీర్లు, మేధావులు తెలుసుకోవడానికి ఆసక్తి చూపడంతో కోమటిబండ గుట్టపై నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటుచేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అందమైన హాలు నిర్మాణం పూర్తయ్యింది.

**త్వరలోనే ప్రారంభానికి ఏర్పాట్లు**

ఇంటింటికీ స్వచ్ఛమైన మంచినీటి సరఫరాతో దేశవిదేశాల్లో ప్రత్యేకతను చాటుకున్న మిషన్ భగీరథకు సంబంధించిన నాలెడ్జ్ సెంటర్ కోమటిబండ గుట్టపై త్వరలోనే ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అందమైన హాలు నిర్మాణం పూర్తికాగా ఫర్నీచర్, ఫొటో ఎగ్జిబిషన్, తదితర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే కోమటిబండ గుట్ట మిషన్ భగీరథ పర్యాటక కేంద్రంగా మారగా, నాలెడ్జ్ సెంటర్ మరింత ఎక్కువ మందిని ఆకర్షించడంతోపాటు, సాంకేతికపరమైన సమాచార నిధిగా మారనుంది. ఈ కేంద్రం మిషన్ భగీరథ సాంకేతిక అద్భుతాలను మిగతా ప్రపంచానికి చాటి చెప్పనుంది.

# కేటీకే ఓసీ-3కు జై

మద్దతు తెలిపిన ప్రజలు, కార్మిక సంఘాల నాయకులు

మెరుగైన పరిహారం అందేలా చూస్తాం: ఎమ్మెల్యే గండ్ర



కొండాపూర్‌లో ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు

**గణపురం:** భూపాలపల్లి మణిహారంగా మారనున్న కాకతీయఖని (కేటీకే ఓసీ-3) గని ఏర్పాటుకు ప్రజలు జై కొట్టారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం కొండాపూర్‌లో ఏర్పాటు చేసిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు విశేష స్పందన లభించింది. కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కొండాపూర్, నగరంపల్లి, సీతారాంపూర్, బస్వరాజుపల్లి, జంగుపల్లి, పరుశరాంపల్లి, వెంకటేశ్వరపల్లి, ధర్మారావుపేట, గుర్రంపేట, కొండరాజుపల్లి, పెద్దపూర్, రంగరావుపల్లి, మాధవరావుపల్లి కేటీకే ఓసీ-3 ప్రభావిత గ్రామ ప్రజలు స్వచ్ఛందగా పాల్గొని తమ అభిప్రాయాలను తెలిపారు. కరంట్ కోసం బొగ్గు అవసరాల దృష్ట్యా ఓసీ-3 ఏర్పాటు చేస్తే మంచిదేనని అభిప్రాయం వ్యక్తంచేశారు. తమ జీవన విధానం దెబ్బతినకుండా మెరుగైన వసతులను కల్పించాలని భూ నిర్వాసితులు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో విద్యుత్, పారిశ్రామిక అవసరాలకు సింగరేణి బొగ్గు ఉత్పత్తి చేస్తున్నదనీ, ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉపాధి కల్పిస్తుందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. రైతులకు మెరుగైన పరిహారం అందేలా చూస్తామన్నారు. భూపాలపల్లి ఏరియాలో కేటీకే ఓసీ-3లో 61 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలను వెలికి తీసేందుకు ప్రతిపాదించామని జీఎం నిరీక్షణ్‌రాజ్ అన్నారు. కార్యక్రమంలో భూపాలపల్లి ఆర్డీవో వెంకటాచారి, ఓసీ-3 ప్రాజెక్ట్ మేనేజర్ విజయ్‌ప్రసాద్, డీఈఎం పర్సనల్ రాజేంద్రకుమార్, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# వృద్ధురాలి దారుణ హత్య

**పాల్వంచ:** రోకలి బండతో మోది వృద్ధురాలిని దారుణంగా హతమార్చిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణం ఇందిరానగర్‌లో ఆదివారం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. ఇందిరాకాలనీకి నాగరాజు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అతని భార్య చైతన్య, తల్లి మైల కనకతార (55) ఇద్దరూ కాలనీలోనే ఉంటున్నారు. ఆదివారం ఉదయం పెద్దకుమారుడు సర్వేశ్వరరావు వచ్చి తల్లి కనకతారతో మాట్లాడి వెళ్లిపోయాడు. తర్వాత మధ్యాహ్నం సమయంలో కనకతారపై ఎవరో రోకలిబండతో మోది దాడి చేశారంటూ చైతన్య ఇరుగు పొరుగువారికి, సర్వేశ్వరరావుకు చెప్పింది. రక్తపు మడుగులో ఉన్న కనకతారను చూసి 108కు సమాచారం ఇవ్వగా, సిబ్బంది అక్కడికి వచ్చి పరిశీలించి మృతి చెందిందని ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న సీఐ రమేష్‌గౌడ్, పట్టణ ఎస్సై రమేష్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. వేలిముద్ర నిపుణులు, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి విచారణ చేపట్టారు. డాగ్‌స్క్వాడ్ ఘటన స్థలం నుంచి కొంతదూరం వెళ్లి తిరిగి హత్య జరిగిన ఇంటికే వచ్చింది. అదే ఇంట్లో ఉన్న వ్యక్తులే హత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.




ఆదివారం భద్రాచలంలో మీడియాతో మాట్లాడుతున్న మహబూబాబాద్ ఎంపీ కవిత. చిత్రంలో ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ తదితరులు

# శ్రీనివాసరావు హత్య దారుణం

మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత

**భద్రాచలం, నమస్తే తెలంగాణ:** టీఆర్‌ఎస్ ఎంపీటీసీ సభ్యుడు నల్లూరి శ్రీనివాసరావును మావోయిస్టులు హతమార్చడం దారుణమని, ప్రజాసేవలో పాలుపంచుకుంటున్న వ్యక్తిని పొట్టనపెట్టుకోవడం సరికాదని మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత అన్నారు. ఆదివారం భద్రాచలం వచ్చిన ఆమె మీడియాతో మాట్లాడారు. భద్రాచలం నియోజకవర్గం నుంచి తనకు 12 వేల మెజార్టీ ఇచ్చిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన మహిళను పార్లమెంట్‌కు పంపిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. సారపాక వరకు రైల్వేలైన్ కోసం త్వరలో రైల్వే మంత్రిని టీఆర్‌ఎస్ ఎంపీలందరూ కలుస్తారన్నారు. సమావేశంలో టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు.

## ● దుర్గగుడిలో శాకాంబరి ఉత్సవాలు ప్రారంభం



ఆషాఢమాసం 12వ రోజైన ఆదివారంనాడు ఏపీ విజయవాడలోని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శాకాంబరీ దేవి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల కాయగూరలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరించారు. తొలిరోజు ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి సారె సమర్పించారు.

## ● బెజవాడ దుర్గమ్మకు బంగారు బోనం



హైదరాబాద్‌లోని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏపీలోని విజయవాడలో కనకదుర్గమ్మవారికి బంగారు బోనంతోపాటు పట్టు వస్త్రాలను సమర్పించారు. సుమారు 200 మందికిపైగా కళాకారులు భేతాళ నృత్యం, పోతురాజు వేషధారణలో వెళ్లి దుర్గమ్మకు నైవేద్యం పెట్టారు.



ఆదివారం నాగోల్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం సర్వసభ్య సమావేశంలో కురుమ జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను సన్మానిస్తున్న కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం

# కురుమలకు అండగా సీఎం కేసీఆర్

కురుమ సంఘం సమావేశంలో ఎమ్మెల్సీ మల్లేశం

కురుమ జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు సన్మానం

**ఎల్బీనగర్, నమస్తే తెలంగాణ:** కురుమల భవన నిర్మాణం కోసం కోకాపేటలో ఐదెకరాల స్థలం, రూ.5 కోట్ల నిధులను విడుదలచేసి సీఎం కేసీఆర్ తమకు అండగా నిలిచారని రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురు మ కొనియాడారు. ఆదివారం నాగోల్‌లో ఆ సం ఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో మల్లేశం మాట్లాడారు. కురుమలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం లేదని గుర్తించిన సీఎం కేసీఆర్ తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారని, అందుకు జీవితాంతం రుణపడి ఉంటానని అన్నారు. ఇటీవల ఎన్నికైన కురుమ జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను ఆయన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గద్వాల జోగులాంబ జెడ్పీ చైర్‌పర్సన్ కే సరిత, కురుమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ, కురుమ ట్రస్టు బోర్డు వైస్‌చైర్మన్ దేవర రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్, రెక్కాల కొండల్‌రాజ్, కార్యదర్శులు కొలుకుల నర్సింహ, ఎక్కాల కన్నా, కోశాధికారి కచ్చా మల్లేశం, రాష్ట్ర కురుమ యువత అధ్యక్షుడు తూంకుంట అరుణ్‌కుమార్, జంట నగరాల అధ్యక్షుడు తమగొండ రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి వినోద్, మహిళా అధ్యక్షురాలు తమగొండ బాలమణి పాల్గొన్నారు.

# రవాణాశాఖ 'చాట్‌బాత్'

అన్నింటికీ యాప్ ద్వారానే పరిష్కారం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రవాణాశాఖలో సమూల మార్పులు తీసుకొస్తున్న ఉన్నతాధికారులు.. ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల్లో వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు. ఆర్టీవో ఆఫీసుల్లో వినియోగదారులు గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ సేవలను తీసుకొస్తున్నారు. ఎలాంటి సమస్యపై అయినా నేరుగా ఫిర్యాదు చేసేందుకు 'చాట్ బాత్' పేరుతో సరికొత్త యాప్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. వినియోగదారుడు తన సమస్య ఏ జిల్లా పరిధిలోకి వస్తే ఆ జిల్లాను ఓపెన్‌చేసి సంబంధిత ఆర్టీవో కార్యాలయంలో ఎదురవుతున్న సమస్యపై ఫిర్యాదు చేయాలి. ఈ ఫిర్యాదు డీటీవోతోపాటు డీటీసీ పరిధిలోకి వెళ్తుంది. మరోవైపు వినియోగదారుల కోసం త్వరలో స్పెషల్ గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేయడంపై అధికారులు దృష్టి సారించారు. గ్రీవెన్స్ సెల్‌తోపాటు 'చాట్‌బాత్' యాప్, ఈ-మెయిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై అధికారులు ప్రతినెలా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపడుతారు.

## మగువ



పట్ట పగటి ఎండ కంటే
చుట్టుకున్న చూపుల కోత
ఏ కాలంలోను
ఎక్కువేనాయే
కష్టపడి కాలు బయటపెడితే
కాలుకు చెప్పులున్న
ఒళ్ళుకు తగిలేవి
పల్లేరుకాయ ముల్లేనాయే
తాను తప్పుకుంటు
తనువును కదిలిస్తూ
కునుకు రాని కనురెప్పై


కాలం పొరలు తిరిగేస్తుంటే
తాడు తగిలి
ఏడకో దొర్లిపడి
గబుక్కున లేచి చూస్తే
ఎదురుపడేది
ఏదో పెద్ద గద్దేనాయే
తాగి తిరిగేటి/ తప్పుడు ముళ్ళకంచెలో చేరి
పరిగ విత్తనాలేరి
చారెడు కన్నీళ్ళ ఎసరు కాచి
దుత్త తెరిస్తే/ ఉత్త నోరే చూపే
అత్త కత్తుల చూపులకు
కాలే కొవ్వొత్తై

చంకలో మొక్కకు
నీరు పడుతూ
గుక్కెడు నీళ్ళు తాగి
చుక్కలు చూస్తూ
బిక్క మొగమేసుడేనాయే
కాలాలెన్ని మారినా
సుత్తి కింద
ఇత్తడి బతుకేనాయే
మందో మాకో లేదాయే
మగువ బ్రతుకింతేనాయే.!

– వూట్ల భద్రయ్య, 95502 56840

## స్వీకారం

### నా పల్లెతీరు



(పర్యావరణ పాటలు)

**రచన:** వడ్డె ముద్దంగుల ఎల్లన్న, వెల: రూ. 40, ప్రతులకు: వడ్డె ముద్దంగుల భాగ్యలక్ష్మి, ఇంటి నెం:3–12, బొంతపల్లి, మండలం–గుమ్మడిదల, సంగారెడ్డి జిల్లా. సెల్:9985356963.

### కాంతదర్శి: కందుకూరి



**సంపాదకుడు:** డాక్టర్ తూమాటి సంజీవరావు, వెల: రూ. 450, ప్రతులకు: డాక్టర్ తూమాటి సంజీవరావు, జీ 2, నీలాధరి అపార్ట్‌మెంట్స్, న్యూ–186, లేక్‌వ్యూ రోడ్, వెస్ట్ మంబాలం, చెన్నై–600033, సెల్: 98844 46208.


### చిరు మొగ్గలు



(కవిత్వం)

**రచన:** ఉప్పరి తిరుమలేష్, వెల: రూ.30, ప్రతులకు: ఉప్పరి తిరుమలేష్, ఇంటి నెం: 11–11, శ్రీకృష్ణానగర్, అమరచింత, వనపర్తి జిల్లా– 509130, సెల్: 9618961384

### మట్టిరంగును ఎంచుకున్న కుంచె



(ఫణిహారం రంగాచారి జీవన రేఖ)

**రచన:** డాక్టర్ కె.ముత్యం, పంచ లక్ష్మీనరసింహారెడ్డి, వెల: రూ. 50, ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌజ్ అన్ని పుస్తకకేంద్రాలు

### అడ్లూరి అయోధ్యరామకవి రచనలు



(కథలు, బుర్రకథ)

**రచన:** అడ్లూరి అయోధ్య రామ కవి, వెల: రూ. 30, ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్–4

### సమీక్షామాలిక



(వ్యాసాలు)

**రచన:** సి.ఉమాదేవి, వెల: రూ.120, ప్రతులకు:సి.ఉమాదేవి, వింగ్స్, ఫ్లాట్ నెం: 501, శ్రీనగర్‌కాలనీ, హైదరాబాద్–73, సెల్: 98858 09250.

### సుగ్రీవ విజయము



(యక్షగానము)


**రచన:** కందుకూరి రుద్రకవి, వెల: రూ. 30, ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమీ, కళాభారతి, రవీంద్రభారతి, హైదరాబాద్–4. ఫోన్: 040–29703142.

### పూనాలో పూచిన నానీలు




**రచన:** సీతా సుధాకర్, వెల: రూ. 100, ప్రతులకు: సీతా సుధాకర్, బి–602, బ్లూ హిల్స్ సొసైటీ, ఎరవాడ, పూనే–411006, మహారాష్ట్ర, సెల్:09765390399.

### అక్కమహాదేవి వచనములు



**అనువాదం:** రేకళిగె మఠం వీరయ్య, వెల: రూ.100, ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమీ, కళాభారతి, రవీంద్రభారతి, హైదరాబాద్–4.

### పంజాబ్ జానపద కథలు



**రచన:** సౌభాగ్య, వెల: రూ. 40, ప్రతులకు: సౌభాగ్య, ఎఫ్–3, బి.4, రామరాజునగర్, మేడ్చల్‌రోడ్, హదరాబాద్–55, ఫోన్: 98481 57909.

మానవ జీవితంలో గాఢమైన వ్యక్తిగతమైన అనుభవాలు దేశకాల పరిమితులను దాటినపుడు అవి రసమయమవుతాయి. ఈ రసము కావ్యాలలో నాటకాలలో నృత్యాదులలో అందరికి తమ అనుభవంగానే గోచరిస్తుంది. అయితే లౌకిక పరిమితులను దాటి ఈశ్వర భావంతో సంవదించినపుడు తనకు తెలిసీతెలియని భావనగా ప్రకటితమైనపుడు అది భక్తి అవుతుంది. లోకంలో తన పరిధిలో జీవించే మానవుడు జగత్తునకు కారణమైన భగవత్ భావనతో తననుతాను కలుపుకొన్నప్పుడు అది లోక రసమును దాటి భక్తి రసమవుతుంది. రసవాదులు ఈ భక్తి లోకాతీతం కావటం వల్ల రసంగా అంగీకరించలేదు.

# రసము జీవితసారము

**భక్తి** రసానికి ప్రత్యేకమైన లక్ష్య గ్రంథము ఏదీ లేదు. చైతన్య మహాప్రభువు కాలంలో రూపగోస్వామి మొదలైన వారు భక్తిని రసముగా స్థాపించే ప్రయత్నం చేశారు. సంస్కృత పురాణాలలో భాగవతం భక్తి భావాన్ని వెయ్యి రేకులతో వికసించిన పద్మం లాగా తీర్చిదిద్దింది వేద వ్యాసుడు.

వేద వ్యాసుడు వేదములను విభజించి, పురాణములను రచించి మహాభారతమును నిర్మించినవాడు. ఎంతటి జ్ఞాని అయినా ఒక అసంతృప్తి, ఏదో కొరత కనిపించేది. మాధుర్యం జీవితంలో పొంగులెత్తేది కాదు. అలాంటి క్లిష్ట సన్నివేశంలో మహర్షులకే గురువైన నారదుడు వచ్చి వేద వ్యాసుడిని పరామర్శించాడు. 'నీవు రచించిన ఇంతటి గ్రంథ రాశిలో ఎక్కడ కూడా విష్ణు భక్తి, నారాయణ కథ, కథనము అ భక్తి భావనలలో కరిగిపోవటం వంటిది నీవు చేయలేదు. ఇప్పుడు నీవు చేయవలసింది భగవంతుడి గురించి ఆయన భక్తులను గురించి ఆయన అవతారం, లీల, మహిమల గురించి విశదంగా ఒక గ్రంథం రచించాలి. ఆ గ్రంథము భగవత్ అనుభవసారము కావటం వలన భాగవతం అవుతుంది. ఈ పని చేయడం వలనా నీ జన్మ ధన్యమవుతుంది'' అని గురువైన నారదుడు చెప్పగా.. వేద వ్యాసుడు ఆయన మాటను శిరసావహించి భాగవతాన్ని నిర్మించాడు. భాగవతం విష్ణు మంత్రాలలో శ్రేష్ఠమైన ద్వాదశాక్షరి వ్యాఖ్యాన రూపం.

భాగవతం శాపాన్ని పొందిన పరీక్షిత్ మహారాజు బ్రతికే ఏడు రోజులలో ఏలు ముక్తి పొందవలెను అని ఆలోచించే జీవన్ముకుడైన శుక బ్రహ్మ వలన ఉపదేశం పొందాడు. ఈ మహా గ్రంథాన్ని తెలుగు వారందరి పుణ్యం పోతన తెలుగులోనికి పునః సృష్టి చేశాడు. పోతన భాగవతం మొత్తం భారతదేశంలో దేశ భాషలలోనికి అనువదింపబడిన తొలి గ్రంథం. తెలుగు భాష సాహిత్యంలో పోతన భాగవతమంత లోక ప్రాయమైన గ్రంథము లేదు. భాగవత పద్యం భక్తి భావ రసముతో నిండన రసాల ఫలము. మిగిలిన తెలుగు కవులలో పోతనకు ఉండే భేదము ఆయన రచన పాఠకునికి తన్మయి భావన కలిగిస్తుంది. ఆయన రచన సందర్భంలో తానను తాను తొలిగించుకొని కావ్య భూమికలలో సంచరిస్తాడు. నన్నయ్య, తిక్కన్న మొదలైన పూర్వ కవులు ఎన్ని పురాణాలు రచించిన భాగవతాన్ని ముట్టుకోకుండా తన కోసం వదిలి పెట్టినారని భావిస్తాడు. తన రచనను ఏ రాజులకు అంకితం చేయకుడా తానను భాగవతాన్ని రచింపమని చెప్పిన గోదావరి తీరంలో దర్శనమిచ్చి ఆదేశించిన శ్రీరామచంద్రునికి అంకితమిచ్చాడు. ఆయన రచన చేసినప్పుడు తన వ్యక్తిత్వాన్ని ప్రకటించిలేదు. 'పలికేడిది భాగవతమట, పలికించెడి వాడు రామభద్రుండట' అని తన ఆత్మజ్ఞాన రూపమైన శరణాగతి ప్రకటించాడు. భాగవతాన్ని శ్రీరామునికి అంకితం చేస్తూనే, శ్రీకృష్ణుని స్తుతిస్తూనే 'షష్ఠ్యాంతాలు' రచించాడు. ఈ విధంగా రామకృష్ణుల ఆభేదాన్ని స్థాపించాడు.

> పోతన రచన వేళలో అంతర్ ముఖుడవుతాడు. శబ్దాలు ఒకదానివెంట ఒకటి నేనంటే.. నేనంటు పరిగెత్తుకు వస్తాయి. నాధ సౌభాగ్యం తనకుతాను వింటూ పద్యమైనా, గద్యమైనా సమకూరుస్తాడు. ఆయన వాడే ప్రసాలు మృదంగంలాగా మ్రోగిస్తాయి. అందువల్లనే అందరి పద్యాలకంటే ఆయన పద్యాలు అంటే తెలుగువారికి ఇష్టము.

భాగవత ఆరంభం నారాయణుని ఇరువైయొక్క అవతారాలను వర్ణించడంతో సాగుతుంది. భాగవతంలో అనేక గాథలలో రాక్షసులు, విష్ణు విరోధులు ఎక్కువమంది కనిపిస్తారు. వాళ్లలో చాలామంది నారాయణుని నిందించినట్లు కనిపించే భాషలో పోతన ఒక చమత్కారాన్ని గర్భితం చేస్తాడు. ఆ మాటలను విప్పిచూస్తే నిందలుగా కాకుండా భగవంతుని తత్వమెరిగి పలికినట్లు ఉంటుంది. ఈ విశేషమైన రచన విధానం సర్వజీవులలో అంతర్యామి ఉన్న దివ్య జ్ఞానాన్ని ప్రకటిస్తుంది. పోతన రచననలో వెయ్యి విధాలైన కవితా శిల్పం వ్యాపించి ఉంటే ఇది ఒక రీతి. భాగవతంలో భీష్ముడు చేసిన స్తోత్రం, కుంతీదేవీ చేసిన స్తోత్రం ఇప్పటికీ నిత్య పఠనీయాలుగానే ఉన్నవి. అష్టమ స్కందంలో గజేంద్రుడు పొందిన ఆర్తి సాధకులు, భక్తులు నిరంతరం మనం చేసుకోవాల్సిన అంశాలు. సప్తమ స్కందంలో ప్రహ్లాదచరిత్ర లోకంలో ఆవిశ్వాసి, విశ్వాసి మధ్య జరిగిన సంఘర్షణ సర్వకాలీనమైనది. ప్రహ్లాదుని పాత్ర చిత్రణలో జీవితంలో ప్రతీ క్షణం ఈశ్వర భావనతో గడిపే ముక్తజీవుడు కనిపిస్తాడు. ఈ కథలో నరసింహస్వామి స్తంభం నుంచి ఆవిర్భవించిన సన్నివేశం మనకు ఒక అద్భుతాన్ని కలిపిస్తుంది. ఈ గద్యము చదువుతుంటే ఆ క్షణంలోనే మనకు చైతన్యం ప్రవేశిస్తుంది. మా చిన్నతనంలో మా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ గద్యాన్ని ప్రభావంతముగా చదివి వినిపించడం నాకు ఇప్పటికీ గుర్తు. వామన అవతార ఘటనలో ముల్లోకాలను ఆవరించిన వర్ణన సందర్భంలో 'రవిబింబము ఉపమింప' అన్న పద్యం ప్రపంచ సాహిత్యములోనే మణి దీప ము వంటిది. తొమ్మిదో స్కందంలోని శ్రీరామచంద్రుని కథ సంగ్రహముగానే ఉన్నా మహిమాన్వితమైనది.

దశమ స్కందము మొత్తము శ్రీకృష్ణ లీలల చరిత్రమే. ఒక శిల్ప మహితమైన ఎర్లోరా గుహవలే, మీనాక్షీ దేవాలయం వలే మనసు మొత్తం ఆకట్టుకొనే మహాకావ్యం. రస కల్పవృక్షము.

ఈ స్కందములో లక్ష్మీనారాయణ ఏకత్రా సమావేశము పరిచే ఘట్టము రుక్మిణీ కల్యాణం. దీనిలో శ్రీకృష్ణునకు పంపిన సందేశం, అగ్నిధ్యాతనుడు నిర్వహించిన సందర్భం జీవేశ్వరులను, ఆచార్యులను అనుసంధానించే ప్రయత్నం. పోతన రుక్మిణీ కల్యాణం కథలో బాల త్రిపుర సుందరి సాధనను రహస్య విద్యగా నిక్షేపించినట్లు విమర్శకులు భావిస్తున్నారు.

పోతన రచన వేళలో అంతర్ ముఖుడవుతాడు. శబ్దాలు ఒకదానివెంట ఒకటి నేనంటే.. నేనంటు పరిగెత్తుకు వస్తాయి. నాధ సౌభాగ్యం తనకుతాను వింటూ పద్యమైనా, గద్యమైనా సమకూరుస్తాడు. ఆయన వాడే ప్రసాలు మృదంగంలాగా మ్రోగిస్తాయి. అందువల్లనే అందరి పద్యాలకంటే ఆయన పద్యాలు అంటే తెలుగువారికి ఇష్టము. లోకంలో ఆయన వ్యక్తిత్వం చుట్టూ ఒక మహిమల వలయం వ్యాపించి ఉంటుంది. ఎన్నో అద్భుతాలు, దివ్య జీవనానుబంధాలు ఈనాటికీ సజీవంగా ఉన్నాయి. భగవంతుని చేరేందుకు సులభమైన పద్యాల మార్గాన్ని నిర్మించిన మహాపురుషుడు, పోతన తెలుగుల పుణ్యపేటి.

– కోవెల సుప్రసన్నాచార్య

# లిఖిత, మౌఖిక ఆధారాలున్నాయి

**పత్రికా** సంపాదకుడు, సాహితీవేత్త ఎన్.వేణుగోపాల్ 'మహాకవి మెచ్చిన మహాస్వప్న' పేరుతో 'నమస్తే తెలంగాణ' చెలిమె పేజీ (జూలై 1)లో నేను రాసిన వ్యాసంపై 'చారిత్రిక ఆధారాలున్నాయా..'?(జూలై 8) అని సంశయాన్ని వ్యక్తం చేస్తూ వివరణ కోరారు. దేనికైనా స్పష్టమైన ఆధారాలు (మౌఖికమైనవైనా, లిఖితమైనవైనా) ఉండాలని వేణుగోపాల్ అన్నారు. చరిత్రకు వాస్తవ ఆధారాలు అవి ఎక్కడో ఒకచోట నమోదై ఉండటం, సంభవనీయమని అనిపించడం అవసరమని కూడా అన్నారు. శ్రీశ్రీ చేసిన వ్యాఖ్యల పుస్తకాన్ని ప్రస్తావిస్తూ అందులో మహాస్వప్న వివరాలను చెబుతూ.. మూడు వాక్యాలు కూడా లేవన్నారు. అది వాస్తవమే అయి ఉండవచ్చు. మహాస్వప్న కవితా ప్రతిభపై శ్రీశ్రీకి మెప్పు ఉన్నదనడానికి ఆధారాలు 'శ్రీశ్రీ అనంతం'(పేజీ: 321) లో ఉన్నాయి. విరసంలో చేరిన దిగంబర కవులు సహా ఇతర రచయితలను వీరశైవులుగా చెబుతూ మూడు భాగాల అధ్యాయం రాశారు. విరసంలో చేరకున్నా, అది ఏర్పడిన ఎనిమిదేండ్ల తర్వాత ఒక పత్రిక సీరియల్‌గా వచ్చిన అనంతంలో 'మహాస్వప్నను వీరశైవునిగా గుర్తిస్తాను' అంటూ ఐదు వాక్యాలు, 'అతనిలోని అరాజకత్వం నాకు నచ్చిందంటూ.. ', ఆ తాత్విక భావన మీద మరో ఆరు వాక్యాల వివరణ రాశారు. చెరబండరాజు తర్వాత అత్యధికంగా రాసింది మహాస్వప్నపైనే. విరసంలో చేరకపోయినా, తన షష్టిపూర్తికి రాకపోయినా వీరశైవుల పేరుతో తనతో సమానమైన స్థానం ఇచ్చిన శ్రీశ్రీకి ఇది మహాస్వప్న ప్రతిభను అభిమానించడం కాదా. శ్రీశ్రీ మహాస్వప్న మీద ప్రేమతో రెండు కవితలను ఆంగ్లంలోకి తర్జుమా చేశాడని నేను రాయడానికి ఆధారం రెండు రకాలున్నాయి. ఒకటి– 2001 ఫిబ్రవరిలో నేను లింగసముద్రం వెళ్లి మహాస్వప్నను ఇంటర్వ్యూ చేశాను. నాటి సంగతులు చెబుతూ తన కవితాశైలిని ప్రశంసించిన విషయం కూడా చెప్పాడు. ఇందుకు సాక్ష్యం ఆయన అల్లుడు నాగేశ్వర్‌రావు. ఆయన కూడా రచయిత. నా ఇంటర్వ్యూలో భాగంగా శ్రీశ్రీ అనువాదం గురించి మహాస్వప్న చెబుతూ అందులో తన రెండు కవితలు కూడా ఉన్నాయన్నారు. అందులో ఒకటి 'ఆపండి ఆర్కెస్ట్రా', రెండది 'మురిగిన సూర్యున్ని నంజుకూంటూ..' అన్నవి. ఈ రెండు రచనలు శ్రీశ్రీ ఆంగ్ల రచనల సంపుటిలో చేర్చినట్టు కూడా చెప్పారు. యాభై ఏండ్ల కిందట వెలువడిన ఆ పుస్తకం పేరు 'శ్రీశ్రీ మిస్‌లిని'. ఆ పుస్తకం నేను చూడనందున ఆయన అల్లునికి ఫోన్ చేసి శ్రీశ్రీ రెండు కవితలను అనువదించిన విషయాన్ని నిర్ధారించుకున్నాను. ఒకవేళ ఒకటే ఉంటే నేను సవరించుకుంటాను. శ్రీశ్రీని చూడటానికి అందరూ మద్రాసు వెళితే ఆయన మాత్రం మహాస్వప్నను చూడటానికి బేగంబజార్‌కు వెళ్లినట్టు రాసిన విషయంపై వేణుగోపాల్ సంశయం వ్యక్తం చేశారు. 1970లకు ముందు శ్రీశ్రీని దిగంబర కవులు కలిసిన దాఖలాలు లేవంటున్నారు. ఇందుకు శ్రీశ్రీ షష్టిపూర్తికి వెళ్లిన దిగంబర కవులను చూపి అందుకు ఆధారాలు లేవంటున్నారు. 'అనంతం' చదివితే అలాగే అనుకోవడం సహజం. శ్రీశ్రీ రాసింది కూడా కరెక్టే. అయితే వారిలో మహాస్వప్న లేడు. 1969లో దిగంబరకవుల నాలుగవ సంపుటి వెలువరించడానికి పూనుకోవడంతో రాజకీయంగా వారి వైఖరి నచ్చక దిగంబర కవుల నుంచి తప్పుకున్నాడు. భైరవయ్య ఇదేకారణం వల్ల మౌనంగా ఇంటిదారి పట్టాడు. తాను షష్టిపూర్తికి వెళ్లనిది మహాస్వప్న శ్రీశ్రీ శతజయంతి సందర్భంగా రాసిన వ్యాసంలో పేర్కొన్నాడు. అప్పటికి మిగిలింది నలుగురు దిగంబర కవులు మాత్రమే. ఆ నలుగురిని చూసి నా షష్టిపూర్తికి దిగంబర కవులు వచ్చారని అనంతంలో రాశారు. అలాగే.. 1969 ఉగాది రోజున శ్రీశ్రీ లాడ్జికి వెళ్లి కలిసిన విషయానికి సంబంధించి లిఖిత, మౌఖిక ఆధారాలున్నాయి. మౌఖిక ఆధారాలన్నీ శ్రీశ్రీకి ఉద్యమ సహచరులు, వారికి బాగా తెలిసినవారు చెప్పినవే. విరసం ఏర్పడక ముందే శ్రీశ్రీ మహాస్వప్న ఉంటున్న బేగంబజార్ లాడ్జీకి వెళ్లినట్టు చెప్పింది దిగంబర కవుల్లో ఒకరు మహాస్వప్న సహచరుడు నగ్నముని గారు. మలకపేట్‌లో వారి ఇంటి దగ్గరలో ఉన్నప్పుడు తరుచుగా చర్చకు వచ్చిన సంగతుల్లో ఇదొకటి. ఈ వ్యాసం నేను రాసేముందు ఇదే విషయాన్ని మహాస్వప్న మరో సహచరుడు నిఖిలేశ్వర్‌తో చర్చించి నిర్ధారించుకున్నాను.

> శ్రీశ్రీ చెబుతుండగా మహాస్వప్న రాశాడు అన్నదాన్ని మొత్తం రాశాడా అనే ప్రశ్న తలెత్తడం సహజమే. కానీ మొత్తం అన్న మాటను నేను రాయలేదు. అయితే మహాస్వప్న రాసింది వాస్తవం. ఇందుకు సాక్షి వడ్డేపల్లి సుధాకర్. రాసింది ఎంత భాగమో చెప్పవలసింది శ్రీశ్రీ, మహాస్వప్నలు. వాళ్ళు ఇద్దరూ లేరు.

లిఖిత పూర్వక ఆధారాల విషయానికి వస్తే.. శ్రీశ్రీ పుట్టి నూరేండ్లయినందున శత జయింతి (2009–2010) సమావేశాలు చాలా జరిగాయి. ఈ క్రమంలో 'ఆంధ్రజ్యోతి' 'శత జయంతి కానుక' పేరుతో ఒక కాలమ్ నిర్వహించింది. ఆ సందర్భంగా.. 'మహాకవి శ్రీశ్రీతో ఒక రాత్రి', 'దిగంబరకవి మహాస్వప్న' పేరుతో ఒక పేజీ నిడివి గల ఒక వ్యాసం 2009 ఆగస్టు 6 సంచికలో వెలువడింది. ఆ చర్చనంతా నేను ఫాలో అయ్యాను. ఇది కూడా గుర్తుపెట్టుకొని మహాస్వప్న కనుమూసిన విషయం తెలిసి ఆయన స్మృతిలో వ్యాసం రాసేందుకు సాహసించాను. నాటి తెలుగు సమాజంలో ప్రముఖులైన అనేకమంది రాజకీయ నాయకులు ఇష్టపడిన శ్రీశ్రీ తనకుతాను మహాస్వప్న ఉండే లాడ్జీకి వెళ్లి తన రూముకు ఆహ్వానించడాన్ని చదివి 'శ్రీశ్రీకే అభిమాన కవి' అని రాశాను. ఎంతగా అభిమానించకపోతే మహాకవి ఆహ్వానిస్తాడు! అక్కడ శ్రీశ్రీ తానుగా చేసిన దిగంబరకవుల అనువాదాలు వినిపించడం, దానితర్వాత తాను అనువదించిన మరో రచన ఫ్రెంచ్ విద్యార్థి ఉద్యమంపై వచ్చిన ఆంగ్ల రచనకు తర్జుమా 'రెక్క విప్పిన రెవల్యూషన్'లోని భాగాలను మహాస్వప్నకు వివరిస్తూ ఆయన అభిప్రాయాలు తెలుసుకోవడం కొనసాగింది. తెల్లవారి కలుద్దాం అంటూ 2 గంటలకు విడిపోయారు. తెల్లవారి కలుసుకొని శ్రీశ్రీ భార్య సరోజ కూడా హోటల్‌లోనే ఉండటంతో ఆయన సహ మహాస్వప్న పక్కనే ఉన్న ఖైరతాబాద్ కల్లు కాంపౌండు దారి పట్టారు. అక్కడ మహాస్వప్న సన్నిహిత మిత్రుడు, తిరుగబడు కవుల్లో ఒకరు, వరంగల్‌కు చెందిన వడ్డేపల్లి సుధాకర్ వారితో చేరాడు. ఇక్కడ రెక్క విప్పిన రెవల్యూషన్ కోసం కొన్ని ఆంగ్ల భాగాలు చెబుతుండగా మహాస్వప్న రాశాడు. ఇందుకు ప్రత్యక్ష సాక్షి వడ్డేపల్లి సుధాకర్. నేను ఆయనను ఫోన్లో సంప్రదించి ఇందుకు సంబంధించిన వివరాలను నిర్ధారించుకున్నాను. ఇంతేకాకుండా ఒక ఇంటర్వ్యూలో కూడా దీనిని సుధాకర్ వెల్లడించారు. శ్రీశ్రీ చెబుతుండగా మహాస్వప్న రాశాడు అన్నదాన్ని మొత్తం రాశాడా అనే ప్రశ్న తలెత్తడం సహజమే. కానీ మొత్తం అన్న మాటను నేను రాయలేదు. అయితే మహాస్వప్న రాసింది వాస్తవం. ఇందుకు సాక్షి వడ్డేపల్లి సుధాకర్. రాసింది ఎంత భాగమో చెప్పవలసింది శ్రీశ్రీ, మహాస్వప్నలు. వాళ్ళు ఇద్దరూ లేరు. మరో విషయం కూడా చెప్పాలి. శ్రీశ్రీ కల్లు కాంపౌడు ఘటన గురించి రాస్తూ.. వేణుగోపాల్ అసాధారణ చారిత్రిక వాస్తవం అనడం సమంజసమే. నాటికే ఎంతో ఖ్యాతిగాంచిన శ్రీశ్రీ సామాన్యులకు, ఆయన అభిమానించిన అధోజగత్తు సోదరులు, అన్నార్థులకు స్వాంతన చేకూర్చే కల్లు కాంపౌండుకు వెళ్లడం అసాధారణం. అది ఆయన గొప్పతనం.

– సామిడి జగన్‌రెడ్డి, 85006 32551



## ఆప్తవచనం

ప్రయాణం ఎక్కడో మొదలు పెడతాం
పాట ఏ తోటలోనో ప్రారంభమవుతుంది
తారీఖులు గుర్తుండవు–
తన్లాట ఒక్కటే
వడ్రంగి పిట్ట తొలుస్తున్న
చెట్టు గుండె చప్పుడై ప్రతిధ్వనిస్తుంది!

జారిపోయిన క్షణాలు
జరిగిపోయిన మనుషులు
వదిలిన జ్ఞాపకాలు తగిలిన గాయాలు
మెలిపెడుతున్న నొప్పుల కుప్పల్లోంచి
కొత్త కలల్ని ఏరుకుంటూ
దొరికిన వాటిని దోసిట పట్టుకొని

ఎక్కడో పోగొట్టుకుంటం
ఇంకెక్కడో వెదుకుతుంటం
పోగొట్టుకోవడానికి వెదకటానికి మధ్యన
పొంతన లేని స్థలంలో
అర్థం కాని వాక్యమై తరచూ
ప్రశ్నార్థకంలా నిలబడుతాం!

కనిపించని యుద్ధంలో
అందరమూ క్షతగాత్రులమవుతాం
అందిన సుఖంలో తేడా ఉండవచ్చు
పొందిన దుఃఖం మాత్రం ఒక్కటే!
ఒకరి కంటి కొసల్లోంచి రాలిన
అశ్రుబిందువును మరొకరు
బాష్ప నయనాలతో పలుకరించినప్పుడే
బంధాలు బలీయం!

దారెంట ఏం వదులుతాం?
రెండు బిందువుల మధ్య
నడక సాగిన కాలంలో
గుప్పెడు నవ్వులను
వెన్నెల పువ్వులను
లోకానికి కానుకలుగా
ఇవ్వాలనే గదా!

నీకైనా నాకైనా
సూత్రం ఒక్కటే–
పరస్పర ఊరడింపులోనే
బతుకు–
పరిమళభరితమవుతుంది!

– డాక్టర్ వి.శంకర్

## ప్రకటన

### 'అమ్మపుట్టిన ఊరు' ఆవిష్కరణ

కీ.శే. వింజమూరి అచ్యుతరామయ్య కవితా సంపుటి 'అమ్మపుట్టిన ఊరు'ఆవిష్కరణ సభ 201 9 జూలై 21న సాయంత్రం 5 గంటలకు కాకినాడ గాంధీ భవన్‌లో జరుగుతుంది. దాట్ల దేవదానం రాజు అధ్యక్షతన జరుగు సభలో సన్నిధానం నర్సిం హశర్మ, గనారా, మధునాపంతుల సత్యనారాయ ణమూర్తి, అద్దెపల్లి ప్రభు, బొల్లోజు బాబా, కుంచె నాగసత్యనారాయణ, ముమ్మిడి నాగప్రసాద్, మార్ని జానకిరామ చౌదరి, సుంకర గోపాల్ పాల్గొంటారు. శిఖామణి గ్రంథా న్ని ఆవిష్కరిస్తారు.

- కవిసంధ్య, యానాం

### 'అబ్బూరి ఛాయాదేవి జీవితం–సాహిత్యం' సభ

తెలంగాణ సాహిత్య అకాడమీ, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో 'అబ్బూరి ఛాయాదేవి జీవితం–సాహిత్యం' సభ 2019 జూలై 16న సాయంత్రం 5.45 గం టలకు, హైదరాబాద్ రవీంద్రభారతి హాల్‌లో జరుగుతుంది. నా దృష్టిలో.. కార్యక్ర మంలో భాగంగా.. సి.మృణాళిని ప్రసంగిస్తారు.

- కేంద్రసాహిత్య అకాడమీ తెలుగు విభాగం

### 'నీటి దీపం' ఆవిష్కరణ

తండ హరీష్‌గౌడ్ రచించిన 'నీటి దీపం' కవితా సంపుటి ఆవిష్కరణ సభ 2019 జూలై 21 సాయంత్ర 5.30 గంటలకు, హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరుగతుంది. కవి యాకూబ్ అధ్యక్షతన జరుగు సభలో గౌరవ అతిథులుగా జూలూరు గౌరీశంకర్, ఆచార్య సూర్యాధనుంజయ్, బైస దేవదాసు, డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ ఎస్. రఘు, భూపతి వేంకటేశ్వర్లు, డెంకల స్వప్నసుధాకర్ హాజరవుతారు. కె. శివారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. తిరునగరి శరత్‌చంద్ర పుస్తకాన్ని పరిచయం చేస్తారు.

- కవి సంగమం

### 'కొత్త కథ 2019' ఆవిష్కరణ

కె.సురేష్, మహమ్మద్ ఖదీర్‌బాబు సంపాదకత్వం వహించిన 'కొత్త కథ 2019' ఆవిష్కరణ సభ 2019 జూలై 21న ఉదయం 10.45 గంటలకు హైదరాబాద్, నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో జరుగుతుంది. ప్రసిద్ధ తమిళ రచయిత అరాత్తు కథా సంపుటిని ఆవిష్కరిస్తారు. కాత్యాయని, ఎన్.వేణుగోపాల్, జి.లక్ష్మినరసయ్య, డానీ ప్రసంగిస్తారు. దారులు తొలిచి మార్గం వేసిన ముందుతరం రచయితలకు కృతజ్ఞత ప్రకటించే కార్యక్రమంలో భాగంగా.. పి.సత్యవతి, అల్లం రాజయ్య, వివిన మూర్తి గారలకు 'కథా మార్గదర్శి' జ్ఞాపిక బహూకరణ ఉంటుంది. రైటర్స మీట్ సభ్యురాలు శిశిర గారిచే స్వాగత నృత్య ప్రదర్శన ఉంటుంది. అందరికీ ఆహ్వానం.

- రైటర్స్ మీట్ మిత్రులు


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



ఆషాడమాసం సందర్భంగా ఏడుపాయల వనదుర్గాదేవి ఆదివారం శాకాంబరిదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. వేకువజామున అమ్మవారికి అభిషేకం నిర్వహించిన అర్చకులు ప్రత్యేకంగా అలంకరించగా, దర్శించుకొని భక్తులు తరించిపోయారు. - పాపన్నపేట




స్వామి వారి సన్నిధిలో వేసిన పెద్దపట్నం వద్ద భక్తుల పూజలు

ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి పెద్దపట్నం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉగాది పర్వదినాన ప్రారంభమైన మల్లన్న జాతర నాలుగు నెలలుగా సాగి, జూలై రెండో ఆదివారం పెద్దపట్నం బ్రహ్మోత్సవాలతో ముగియడం ఆనవాయితీ. వేదపండితులు, ఒగ్గు పూజారులు ఉత్సవాలను కనులపండువగా చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయం 9గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. - ఓదెల



## 108లో ప్రసవం

**బెల్లంపల్లి రూరల్ :** ఓ గర్భిణి ప్రసవానికి దవాఖానకు వెళ్తుండగా 108 వాహనంలో బిడ్డకు జన్మనిచ్చిన ఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ఆదివారం చోటుచేసుకున్నది. నెన్నెల మండలానికి చెందిన పులి సుజాత(26)ను డెలివరీ కోసం మంచిర్యాల దవాఖానకు 108లో తీసుకెళ్తుండగా బెల్లంపల్లి వరకు వచ్చేసరికి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లోనే ప్రసవానికి ఏర్పాట్లు చేశారు. సుజాత మగ బిడ్డకు జన్మనివ్వగా, తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది దుర్గం ఆత్మారావ్, సాయి కృష్ణ తెలిపారు.





హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు చేపట్టిన బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# బంగారు తెలంగాణ దిశగా అడుగులు

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ / మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ :** బంగారు తెలంగాణ దిశగా అడుగులు పడుతున్నాయని ఎక్సైజ్, క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ప్రజల సంక్షేమం కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చానని, పాలమూరు జిల్లాలో అభివృద్ధి పరుగులు పెట్టిస్తామని ఉద్ఘాటించారు. వీరన్నపేటలో సీసీ రోడ్డు పనులను మంత్రి ప్రారంభించారు. అంతకుముందు తెలంగాణ టూరిజంలో భాగంగా హైదరాబాద్ చార్మినార్ నుంచి 300 మంది బైక్ రైడింగ్ సభ్యులు చేపట్టిన ర్యాలీని మంత్రి ప్రారంభించారు. బైకర్స్ జిల్లా కేంద్రానికి చేరుకోగానే మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వారితో కలిసి బైక్ నడుపుకొంటూ మయూరీ ఎకో పార్కుకు చేరుకున్నారు. అక్కడ జరిగిన అభివృద్ధి పనులను మంత్రి వారికి వివరించారు. అనంతరం బైక్‌రైడర్స్‌తో కలిసి కేక్ కట్ చేశారు.



కొత్తగూడెంలో మహిళకు సభ్యత్వం ఇస్తున్న ఎంపీ నామా నాగేశ్వరరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు




మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం గురుకుంటలో సభ్యత్వం అందజేస్తున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి



వరంగల్ నగరంలోని శివనగర్‌లో దివ్యాంగునికి పార్టీ సభ్యత్వమిస్తున్న వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

# సభ్యత్వాలకు విశేష స్పందన

కొనసాగుతున్న టీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు ▪ చురుగ్గా కదులుతున్న పార్టీ శ్రేణులు






వనపర్తి జిల్లా రేవల్లి మండలం బండరాయిపాకులలో సభ్యత్వం అందజేస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



వరంగల్ అర్బన్ జిల్లా ఎల్కతుర్తిలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బస్వరాజు సారయ్య, జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** టీఆర్‌ఎస్ సభ్యత్వాల నమోదుకు విశేష స్పందన లభిస్తున్నది. ఊరూవాడా ఎక్కడ చూసిన సభ్యత్వాల సందడి కన్పిస్తున్నది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇంచార్జీలు, జెడ్పీ చైర్మన్లు, ఇతర నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నమోదు ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నారు. సభ్యత్వాలకు వస్తున్న స్పందనను చూసి పార్టీ నాయకులు, కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తున్నారు. ఆదివారం వనపర్తి జిల్లా రేవల్లి మండలం బండరాయిపాకుల గ్రామంలో వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పలువురికి సభ్యత్వాలు అందజేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని గడ్డిఅన్నారం, ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని వినయ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదులో పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ సభ్యత్వ నమోదు ఎంతో ప్రధానమైందన్నారు. టీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తుందని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం అమ్మాపూర్, గురుకుంట, మెట్టుగడ్డ తండాలో నిర్వహించిన సభ్యత్వ నమోదులో పాలమూరు ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. వరంగల్ నగరంలోని శివనగర్‌లో తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, దివ్యాంగుల అభివృద్ధి సంస్థ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, వరంగల్ అర్బన్ జిల్లా ఎల్కతుర్తిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బస్వరాజు సారయ్య తదితరులు పాల్గొని సభ్యత్వాలను అందజేశారు.

**ఉమ్మడి ఖమ్మంలో..**

ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని తల్లంపాడు, కొక్కిరేణి, నేలకొండపల్లి, రాజేష్‌పురం గ్రామాల్లో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎంపీ నామా నాగేశ్వరరావు, పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి తాతా మధు పాల్గొన్నారు. ఖమ్మం నగరంలోని జూబ్లీక్లబ్, లెనిన్‌నగర్‌లో ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్, సత్తుపల్లిలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కల్లూరులో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నూకల నరేశ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య తదితరులు, అశ్వారావుపేట నియోజకవర్గంలో ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని టీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరిగిన అన్ని ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు టీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలిచారన్నారు. సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. సమష్టి కృషితో పార్టీని మరింత బలోపేతం చేయాలని శ్రేణులను కోరారు. భద్రాచలం పట్టణంలో మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, పార్టీ నియోజకవర్గ ఇంచార్జి తెల్లం వెంకట్రావ్ పాల్గొన్నారు.



వనపర్తి జిల్లా పానగల్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

# పల్లె ప్రగతితోనే రాష్ట్రాభివృద్ధి

- మంత్రి నిరంజన్‌రెడ్డి

**రేవల్లి/పాన్‌గల్ :** పల్లెలు ఆర్థిక, పారిశ్రామిక ప్రగతి సాధించినప్పుడే ఆయా రాష్ట్రాలు అభివృద్ధి సాధిస్తాయని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. వనపర్తి జిల్లా రేవల్లి మండలం బండరాయిపాకులలో మంత్రి శనివారం రాత్రి పల్లె నిద్ర చేశారు. ఆదివారం ఉదయం గ్రామంలో పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు. ఏదుల రిజర్వాయర్‌లో బండరాయిపాకుల ముంపునకు గురవుతుండడంతో ఆర్థిక సాయం, మెరుగైన పునరావాసం కల్పించాలని గ్రామస్థులు మంత్రిని కోరారు. ముంపు గ్రామాలైన కొంకలపల్లి, బండరాయిపాకులకు పరిహారం చెల్లించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. పానగల్ మండల కేంద్రంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, ఢిల్లీలో తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి మందా జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

# పలు జిల్లాల్లో ఓ మోస్తరు వాన

- ఖమ్మం జిల్లా మధిరలో అత్యధికంగా 74.5 మి.మీ. వర్షపాతం నమోదు
- రాగల మూడ్రోజులు వర్షాలు: హైదరాబాద్ వాతావరణ కేంద్రం



ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలో కురుస్తున్న వర్షం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఖమ్మం, సూర్యాపేట, నిజామాబాద్, మెదక్, సిద్దిపేట, యాదాద్రి-భువనగిరి, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మూడునుంచి ఏడు సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఖమ్మం జిల్లాలోని మధిరలో అత్యధికంగా 74.5 మి.మీ., సూర్యాపేట జిల్లాఆత్మకూరులో 52.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. నల్లగొండ జిల్లాలోని నకిరేకల్, చిట్యాల మండలాల్లో అరగంటపాటు వర్షం కురవగా, నల్లగొండ, మునుగోడు మండలాల్లో జల్లులు పడ్డాయి. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి, నాగారం మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఖమ్మం నగరంలో ఓ మోస్తరు వర్షం పడగా, ఖమ్మం జిల్లా రఘునాథపాలెం, పాలేరు, మధిర, సత్తుపల్లి డివిజన్లలో చిరుజల్లులు కురిశాయి. ముదిగొండ మండలంలో 31.2 మి.మీ., తిరుమలాయపాలెంలో 25.2 మి.మీ., చింతకానిలో 20 మి.మీ., నేలకొండపల్లిలో 14.8 మి.మీ., ఏన్కూర్‌లో 19.2 మి.మీ., కొణిజర్లలో 13.4 మి.మీ., సత్తుపల్లిలో 14.2 మి.మీ., బోనకల్‌లో 10.4 మి.మీ., ఎర్రుపాలెం మండలంలో 10.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంతోపాటు జడ్చర్లలో ఆదివారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. దాదాపు 20 నిమిషాలపాటు వర్షం పడటంతో రోడ్డుపై నీరుపారింది.

**వచ్చే మూడు రోజులు వర్షాలు..**

రాష్ట్రంలో పలుచోట్ల సోమ, మంగళ, బుధవారాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

**గ్రేటర్ హైదరాబాద్‌కు వర్షసూచన**

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తేతెలంగాణ:** గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల ఆదివారం సాయంత్రం తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం 5.30 గంటల వరకు నగరంలో 5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాగల 24 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉన్నదని చెప్పారు. కాగా, నగరంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రత 34.7 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 23.1 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 61 శాతంగా నమోదైందని అధికారులు తెలిపారు.

## చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

### వృద్ధుడికి దేహశుద్ధి


**పూడూరు :** అభంశుభం తెలియని ఓ చిన్నారికి సెల్‌ఫోన్‌లో నీలిచిత్రాలు చూపిస్తూ లైంగిక దాడికి యత్నించిన వృద్ధుడికి గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పెద్ద ఉమ్మెంతాల్ గ్రామానికి చెందిన జె.రాయికోటి (60) ఎలక్ట్రికల్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి గతంలో మూడు వివాహాలు జరిగాయి. రాయికోటి ప్రవర్తన నచ్చక అతని భార్యలు వదిలి వెళ్లారు. ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేనిసమయంలో చిన్నారి(5)ని పిలిపించుకున్నాడు. సెల్‌ఫోన్‌లో నీలిచిత్రాలు చూపిస్తూ లైంగిక దాడికి ప్రయత్నించాడు. చిన్నారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు విషయాన్ని చెప్పడంతో కోపోద్రిక్తులైన కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలిసి నిందితుడు రాయికోటికి దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు.

# వైద్యం వికటించి శిశువు మృతి

**సత్తుపల్లి, నమస్తే తెలంగాణ :** సిబ్బంది నిర్లక్ష్యంతో అప్పుడే పుట్టిన శిశువు మృతి చెందిన ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి ఏరియా దవాఖానలో జరిగింది. సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లికి చెందిన రమ్య ఆదివారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చేరింది. విషయాన్ని దవాఖాన సిబ్బంది వైద్యురాలికి సమాచారం ఇచ్చినా ఆమె రాలేదు. స్టాఫ్ నర్సు సిబ్బందితో కలిసి ప్రసవం చేసేందుకు ప్రయత్నించింది. సాధారణ ప్రసవం చేసే క్రమంలో పరిస్థితి విషమించడంతో సిబ్బంది ఆందోళనకు గురై వైద్యురాలికి సమాచారమిచ్చారు. వెంటనే వైద్యురాలు దవాఖానకు చేరుకొని పరిశీలించగా, శిశువు అప్పటికే మృతిచెందడంతో ఆమె వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న బాధితురాలి బంధువులు, గ్రామస్థులు దవాఖాన వద్ద ఆందోళన చేపట్టారు.

# పీసీసీ నేతగా ఉత్తమ్ పనికిరాడు

- ఆయన్ను సొంత పార్టీ వారే అంగీకరించడం లేదు
- ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్



నకిరేకల్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ బడుగుల. చిత్రంలో ఎమ్మెల్యే చిరుమర్తి

**నకిరేకల్ నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని, అందుకే తెలంగాణ ప్రజలంతా కేసీఆర్ వెంటే ఉన్నారని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి ఎంపీ బడుగుల మాట్లాడారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ పాలకులు, నాయకులే కేసీఆర్ సర్కార్‌పై ప్రశంసలు కురిపిస్తుంటే రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మాత్రం అభివృద్ధిని ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసత్య ప్రచారంతో కాలం వెళ్లదీస్తున్నారని, అసలు అధ్యక్షుడిగా ఆయన్ను ఆ పార్టీ నాయకులే ఒప్పుకోవడం లేదన్నారు. టీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుందని, మున్సిపల్ ఎన్నికల్లోనూ టీఆర్‌ఎస్ ప్రభంజనం కొనసాగుతుందని ధీమావ్యక్తం చేశారు.



ఆదిలాబాద్‌లో టీఆర్‌ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న



వరంగల్ రూరల్ జిల్లా పరకాలలో గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

# చేరికల జోష్

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** గులాబీ పార్టీలోకి వలసలు జోరందుకున్నాయి. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు టీఆర్‌ఎస్ గూటికి చేరుతున్నారు. ఆదివారం ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడులో సీపీఎం నాయకుడు, ఎంపీటీసీ రెంటాల వెంకయ్య అలియాస్ ఆనంద్‌తోపాటు మరో 200 కుటుంబాల వారు సీపీఎం కార్యకర్తలు ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తాతా మధు, జెడ్పీ పరిషత్ చైర్మన్ వాసుదేవరావు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. ఆదిలాబాద్‌లో పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే జోగు రామన్న సమక్షంలో సమక్షంలో, వరంగల్ రూరల్ జిల్లా పరకాలలో కాంగ్రెస్‌కు చెందిన సుమారు 200 మంది ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో, పెద్దపల్లి జిల్లా మంథని మండలం బిట్టుపల్లిలో సర్పంచ్ పోగుల సదానందం ఆధ్వర్యంలో 100 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ సమక్షంలో గులాబీ గూటికి చేరారు.

## ట్రస్మా పెద్దపల్లి జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

**రామగిరి:** తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల సంఘం (ట్రస్మా) పెద్దపల్లి జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం సెంటినరీకాలనీలో ఎన్నుకున్నారు. జిల్లా నుంచి ఆయా పాఠశాలల యాజమాన్యాలు హాజరు కాగా, నూతన కమిటీని జడ్పీ చైర్మన్ పుట్ట మధు హాజరై అభినందించారు. అధ్యక్షుడిగా అబ్బు కేశవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అబ్బు బుచ్చిరెడ్డి, కోశాధికారిగా పాశం ఓదెలు యాదవ్, అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా అశోక్, చంద్రమౌళి, ఉమామహేశ్వర్, జాయింట్ సెక్రెటరీగా కుమారస్వామి, వెంకటరెడ్డి ఎన్నుకున్నారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాలలో సిరిసిల్ల ఫిట్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విజ్ఞాన మందిరం, జిమ్‌ను గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రతి పేద విద్యార్థికి ఉన్నత విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వేరోస్ ఆధ్వర్యంలో విద్యార్థులలో ప్రతిజ్ఞ చేయించారు. - కోనరావుపేట



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి ప్రథమ చికిత్స చేసి మానవత్వం చాటుకున్నారు భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం జైకేసారం వద్ద వలిగొండ మండలం జాలుకాలువ గ్రామానికి చెందిన షేక్‌ఇమామ్(33)ను లారీ ఢీకొట్టింది. అదే మార్గంలో వెళ్తున్న బూర నర్సయ్యగౌడ్ అతనికి ప్రథమ చికిత్స చేసి, దవాఖానకు తరలించారు. - చౌటుప్పల్ రూరల్

# కర్ణాటకంలో మరో మలుపు

కూటమి నేతలకు ఎమ్మెల్యే నాగరాజ్ ఝలక్

ముంబైలోని 'అసమ్మతి' క్యాంప్‌నకు చేరిక

రాజీనామాను వెనక్కి తీసుకోనని ప్రకటన

భవిష్యత్ కార్యాచరణపై కూటమి నేతల తలమునకలు

సీఎం కుమారస్వామి తక్షణమే రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్

**బెంగళూరు, జూలై 14:** కర్ణాటక రాజకీయం రోజుకో మలుపు తిరుగుతున్నది. కాంగ్రెస్-జేడీఎస్ ముఖ్యనేతల బుజ్జగింపుతో రాజీనామాపై వెనక్కి తగ్గినట్లు కనిపించిన రెబెల్ ఎమ్మెల్యే ఎంబీటీ నాగరాజ్ యూటర్న్ తీసుకున్నారు. ఆదివారం ముంబైలోని అసమ్మతి ఎమ్మెల్యేల క్యాంప్‌కు చేరుకోగానే రాజీనామాను వెనక్కి తీసుకోనన్నారు. దీంతో భవిష్యత్ కార్యాచరణపై కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ కూటమి నేతలు తలమునకలవుతున్నారు. అసెంబ్లీలో సీఎం కుమారస్వామి బలపరీక్ష ఈ వారం జరుగను న్న నేపథ్యంలో అసమ్మతి ఎమ్మెల్యేలతో బుజ్జగింపులు ముమ్మరం చేశారు. మరోవైపు సంకీర్ణ సర్కార్ మైనార్టీలో పడిందని, సీఎం తక్షణమే రాజీనామా చేయాలని బీజేపీ కర్ణాటక శాఖ అధ్యక్షుడు యెడ్యూరప్ప డిమాండ్ చేశారు. 'సీఎంకు నిజంగా ప్రజాస్వామ్యంపై గౌరవముంటే, తక్షణం రాజీనామా చేయాలి లేదా సోమవారం విశ్వాస పరీక్షకు సిద్ధం కావాలి' అని అన్నారు.

**ఎమ్మెల్యే నాగరాజ్ యూటర్న్**

కాంగ్రెస్, జేడీఎస్ నేతలకు హోస్కోటే ఎమ్మెల్యే నాగరాజ్ ఆదివారం ఝలక్ ఇచ్చారు. పతనం అంచున ఉన్న సంకీర్ణ ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు ఎమ్మెల్యే నాగరాజ్‌తో శనివారం కూటమి నేతలు సుదీర్ఘ మంతనాలు జరిపిన విషయం తెలిసిందే. మరో రెబల్ ఎమ్మెల్యే సుధాకర్‌ను కలిశాక తుది నిర్ణయం తీసుకుంటానని నాగరాజ్ అన్నారు. ముంబై వెళ్లే ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ఎమ్మెల్యే సుధాకర్ తన ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. రెండ్రోజులుగా అందుబాటులో లేరు. సుధాకర్‌ను కన్విన్స్ చేసి, వెనక్కి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తా' అని అన్నారు. ముంబై చేరాక నాగరాజ్ మీడియాతో మాట్లాడుతూ.. రాజీనామాపై వెనక్కు తగ్గేది లేదని తేల్చిచెప్పారు. బెంగళూరులో నాగరాజ్ చార్టెడ్ ఫ్లైట్ ఎక్కుతున్న దృశ్యాలు, ఆయన మీడియాతో మాట్లాడిన వెంటనే ఆ పరిసరాల్లో బీజేపీ నేత అశోక్ కనిపించడం చానళ్లలో ప్రసారం కావడంతో దీని వెనక బీజేపీ హస్తం ఉన్నదని కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ ఆరోపించారు. ఆయన ఆరోపణలు సత్యదూరమని నాగరాజ్ ఖండించారు. మరోవైపు ముంబైలో ఉంటున్న 12 మంది రెబల్ ఎమ్మెల్యేలు తాము రాజీనామాలపై వెనక్కి తగ్గబోమన్నారు. ఢిల్లీలో ఉన్న ఎమ్మెల్యే సుధాకర్ తమతో కలుస్తారని చెప్పారు.

**భేటీలతో కాంగ్రెస్, జేడీఎస్ నేతల బిజీబిజీ**

నాగరాజ్ ముంబై వెళ్లినట్లు వార్తలు వెలువడిన నేపథ్యంలో సీఎం కుమారస్వామి, జేడీఎస్ అధినేత హెచ్‌డీ దేవెగౌడతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ నేతలూ విడిగా భేటీ అయ్యారు. తర్వాత సీఎం కుమారస్వామి, మంత్రి డీకే శివకుమార్, సీఎల్పీ నేత సిద్ధరామయ్య భేటీ అయ్యారు. అంతకు ముందు కుమారస్వామి, శివకుమార్ దవాఖానలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే నాగేంద్రను పరామర్శించారు. నాగేంద్రతో బీజేపీ టచ్‌లో ఉన్నట్లు వార్తలు వెలువడ్డ నేపథ్యంలో కలిశారు.

**రామలింగారెడ్డి బుజ్జగింపునకు ప్రయత్నాలు**

అసంతృప్త ఎమ్మెల్యే రామలింగారెడ్డిని బుజ్జగించేందుకు కూటమి నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆయనను బుజ్జగిస్తే, మరో ముగ్గురు బెంగళూరు ఎమ్మెల్యేలూ ఆయన వెంట వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. తన రాజీనామాపై 15న స్పీకర్ ఎదుట హాజరయ్యే వరకు తానేమీ మాట్లాడనని రామలింగారెడ్డి అన్నారు. బలపరీక్షను బుధవారం చేపట్టాలని సీఎం శుక్రవారం బీఏసీలో ప్రతిపాదించినా ప్రధాన విపక్షం బీజేపీ హాజరుకాకపోవడంతో నిర్ణయం తీసుకోలేదు.



కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సమావేశమైన మాజీ సీఎం సిద్ధరామయ్య



అసోంలోని కజిరంగా పార్కులో ఖడ్గమృగాలు



త్రిపుర రాజధాని అగర్తలలో నీట మునిగిన కార్లు



మధ్యప్రదేశ్‌లో తాళ్ల సాయంతో నది దాటుతున్న మహిళలు

# ఈశాన్యంలో వర్ష బీభత్సం

అసోంలో పదకొండు, అరుణాచల్‌లో ఆరుగురు మృతి

70 శాతం నీట మునిగిన కజిరంగా జాతీయ పార్కు

ఎత్తైన ప్రాంతాలకు ఖడ్గమృగాలు, ఇతర జంతువుల తరలింపు

**న్యూఢిల్లీ:** నేపాల్, బంగ్లాదేశ్ సహా ఈశాన్యరాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నా యి. వరదలతో పలు రాష్ట్రాలు అతలాకుతలమయ్యాయి. భారీ వర్షాలు, వరదలు, కొండ చరియలు విరిగిపడటంతో అసోం, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, సిక్కిం, మిజోరం రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో ప్రజలు చనిపోయారు. గత 72 గంటల్లో అసోంలో 11 మంది చనిపోగా, అరుణాచల్‌ప్రదేశ్‌లో ఆరుగురు, బీహార్‌లో నలుగురు, బెంగాల్‌లో ఒక్కరు మరణించారు. భారీ వర్షాలతో బ్రహ్మపుత్ర నది పొంగి ప్రవహిస్తున్నది. కుండపోత వర్షాలతో అసోంలోని 28 జిల్లాల్లో 26.5 లక్షల మంది ప్రభావితమయ్యారు. 1,800 పల్లెలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కజిరంగా జాతీయ పార్కు 70శాతానికి పైగా నీట మునిగింది. పార్కులోని ఖడ్గమృగాలు, ఇతర జంతువులను ఎత్తైన ప్రాంతాలకు తరలించారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో కూడా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఓ కారు లోయలో పడటంతో ముగ్గురు చనిపోగా.. వరదల్లో ఓ మహిళ కొట్టుకుపోయిం ది. వర్షాలకు ఓ పాఠశాల గోడ కూలడంతో ఇద్దరు చిన్నారులు చనిపోయారు. మిజోరంలో ట్లబుంగ్ పట్టణాన్ని వరదలు చుట్టుముట్టడంతో 400 ఇండ్లు మునిగిపోయాయి. కోసి నది ఉప్పొంగుతూ ప్రవహిస్తుండటంతో అసోం, బీహార్ సరిహద్దుల్లో నివసిస్తున్న 700 మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బీహార్‌లోని కిషన్‌గంజ్‌లో ఇద్దరు చిన్నారులు చనిపోయారు. పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయ్‌గురి జిల్లాలోని ఓ కాలువలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. మధ్యప్రదేశ్‌లో కురుస్తున్న భారీ వర్షాలు జనజీవనాన్ని అస్తవ్యస్థం చేస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో 10 మంది చనిపోయారు.

**నేపాల్‌లో వర్ష బీభత్సం.. 60 మంది మృతి**

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలు నేపాల్‌ను అతలాకుతలం చేస్తున్నాయి. గత గురువారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడి 60 మంది మరణించారు. మరో 38 మంది గాయపడ్డారు. మరో 35 మంది అదృశ్యమయ్యారు. 25కి పైగా జిల్లాల్లో 10,385 కుటుంబాలు ఇబ్బందుల పాలయ్యాయి. దేశంలోని వివిధ ప్రాంతా ల్లో ఆపదలో చిక్కుకున్న 1,104 మందిని, ఒక్క కఠ్మాండులోనే 185 మందిని నేపాల్ సైన్యం, పోలీసులు రక్షించారు. సహాయ చర్యలు చేపట్టేందుకు నేపాల్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా 27,380 మంది పోలీసులను మోహరించింది.

## రామభక్తులు కాదు రాక్షస అనుచరులు

బీజేపీ నేతలపై మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ధ్వజం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మతం పేరిట అరాచకాలకు పాల్పడుతున్న బీజేపీ నాయకులు రామభక్తులు కాదని రాక్షసుల అనుచరులని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. రాముడి పేరు చెప్పుకునే బీజేపీ నేతలు ఒక్కసారి మర్యాద పురుషోత్తముడిగా పేరుతెచ్చుకున్న ఆయన చరిత్ర చదివి మనుషులుగా మారాలని హితవు పలికారు. ముంబై చాందివాలిలో శనివారం రాత్రి జరిగిన మజ్లీస్ పార్టీ బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ మతం పేరిట హింసాత్మక చర్యలకు పాల్పడుతున్న బీజేపీ నేతలు రాముడి పేరిట రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎదురు కాల్పులు

ఇద్దరు మావోయిస్టులు హతం

**దంతేవాడ/కొత్తగూడెంక్రైం:** ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లా కిరండూల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. వారిద్దరిలో ఒక్కొక్కరిపై రూ.5 లక్షల రివార్డు ఉంది. డీఆర్జీ బలగాలు గమనియాపాల్ అడవుల్లో గాలింపు చేపట్టారు. వారికి తారసపడ్డ మావోయిస్టులు జవాన్లపై కాల్పులు జరిపారు. దీంతో అప్రమత్తమైన డీఆర్జీ పోలీసులు ఆత్మరక్షణార్థం జరిపిన ఎదురు కాల్పుల్లో పిరియా గ్రామ మహిళా మావోయిస్టు మంగ్లీ, మిర్చిపారా ప్రాంత దేవా మృతి చెందారు.

## మంత్రి పదవికి సిద్ధూ రాజీనామా!

గత నెల 10వ తేదీనే అధిష్ఠానానికి పంపినట్లు ట్వీట్

**చండీగఢ్, జూలై 14:** పంజాబ్‌కు చెందిన కాంగ్రెస్ నేత నవ్‌జ్యోత్ సింగ్ సిద్ధూ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. జూన్ 10నే రాజీనామా లేఖను పార్టీ అధిష్ఠానానికి పంపినట్లు ఆదివారం ట్విట్టర్‌లో వెల్లడించారు. తన రాజీనామా లేఖను కూడా అందులో పోస్ట్ చేశారు. 2017 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు సిద్ధూ బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఆ పార్టీ విజయం సాధించడంతో మంత్రి వర్గంలో కీలకమైన స్థానిక సంస్థలు, పర్యాటకం, సాంస్కృతిక శాఖలు ఆయనకు దక్కాయి. కాగా పంజాబ్ సీఎం కెప్టెన్ అమరీందర్ సింగ్, మంత్రి సిద్ధూ మధ్య తొలి నుంచి మాటల యుద్ధం జరుగుతున్న విషయం తెలిసిందే.

## హిమాచల్‌లో భవనం కూలి ఇద్దరు మృతి

**సిమ్లా:** హిమాచల్‌ప్రదేశ్‌లోని సోలన్ జిల్లాలో ఘోర ప్రమాదం సంభవించింది. జిల్లాలోని కుమార్‌హట్టి-నహన్ రోడ్డుపై గల నాలుగు అంతస్థుల భవనం ఆదివారం కుప్పకూలడంతో అందులో చిక్కుకున్న వారిలో ఒక సైనికుడితోపాటు ఇద్దరు మృతి చెందారు. శిథిలాల కింద 37 మంది చిక్కుకున్నారు. వారిలో 18 మంది సైనికులతోపాటు 23 మంది ప్రజలు గాయపడ్డారని సోలన్ డిప్యూటీ కమిషనర్ కేసీ చమన్ తెలిపారు. మరో 12 మంది శిథిలాల్లో చిక్కుకున్నారు. భారత సైన్యం, సీఆర్పీఎఫ్, రాష్ట్ర పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ జవాన్లు సహాయ చర్యల్లో పాల్గొన్నారు. ఈ ఘటనపై గవర్నర్ ఆచార్య దేవ్‌వ్రత్, సీఎం జైరామ్ ఠాకూర్ తీవ్ర సంతాపం తెలిపారు. ప్రమాద కారణాలపై దర్యాప్తునకు ఆదేశించినట్లు సీఎం జైరామ్ ఠాకూర్ చెప్పారు. గాయపడిన వారికి చికిత్స చేయించాలని అధికారులను ఆదేశించారు. పాతకాలం నాటి ఈ భవనంలో దాబా హోటల్‌తోపాటు గెస్ట్‌హౌస్ నిర్వహిస్తున్నారు. ఇటీవల భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ఈ భవనం కుప్పకూలిందని జిల్లా అధికారి తెలిపారు.

## రంగులరాట్నం కూలి ఇద్దరి మృతి

**అహ్మదాబాద్, జూలై 14:** గుజరాత్‌లోని అహ్మదాబాద్ థీమ్ పార్క్‌లో రంగులరాట్నం ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు కుప్పకూలడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. 26 మంది గాయపడ్డారు. ఈ ఘటన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నిపుణుల బృందం అక్కడికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. గాయపడ్డ వారిని చికిత్స కోసం దవాఖానల్లో చేర్చామని అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ విజయ్ నెహ్రా తెలిపారు. గత నెలలో తమిళనాడులోని కాంచీపురం జిల్లా కిష్కింధ థీమ్ పార్క్‌లోనూ రంగులరాట్నం కుప్పకూలి ఒకరు మృతి చెందిన సంగతి తెలిసిందే.

## ఎన్నారై పాలసీ అమలుకు కృషిచేయండి

- టీఆర్‌ఎస్ పార్లమెంటరీ నాయకుడు నామాకు కువైట్ టీఆర్‌ఎస్ అధ్యక్షురాలు వినతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎన్నారై పాలసీ అమలు కోసం కృషిచేయాలని టీఆర్‌ఎస్ ఎన్నారై కువైట్ విభాగం అధ్యక్షురాలు అభిలాష గొడిశాల.. టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు నామా నాగేశ్వర్‌రావును కోరారు. ఆమె ఆదివారం ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. విదేశాల్లో ఉంటున్న తెలంగాణవారికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. గల్ఫ్‌లో ఇబ్బందులు పడుతున్న కార్మికులకు న్యాయం జరుగాలంటే ఎన్నారై పాలసీ త్వరగా అమలయ్యేలా చూడాలని విజ్ఞప్తిచేశారు. కువైట్‌లో టీఆర్‌ఎస్ పార్టీ తరపున చేపట్టిన కార్యక్రమాలను ఆమె నామాకు వివరించారు.



టీఆర్‌ఎస్ ఎంపీ నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న కువైట్ ఎన్నారై అధ్యక్షురాలు అభిలాష

## రచ్చకెక్కిన టీడీపీ నేతలు

ట్విట్టర్‌లో కేశినేని నాని, బుద్ధా వెంకన్న పరస్పర ఆరోపణలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీ టీడీపీ నేతల మధ్య అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. విజయవాడ ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న మధ్య ట్విట్టర్ వార్ కొనసాగుతున్నది. ఇద్దరు నేతలు ఒకరిపై మరొకరు పరోక్షంగా విమర్శలు గుప్పించుకుంటూ రోడ్డున పడ్డారు. బుద్ధా వెంకన్నను ఉద్దేశించి ఆదివారం ఉదయం కేశినేని ట్వీట్ చేశారు. 'నాలుగు ఓట్లు సంపాదించలేనివాడు, నాలుగు పదవులు సంపాదిస్తున్నాడు. నాలుగు పదాలు చదువలేనివాడు, నాలుగు వాక్యాలు రాయలేనివాడు ట్వీట్ చేస్తున్నాడు. ఇది మన దౌర్భాగ్యం' అంటూ ట్విట్టర్‌లో విమర్శించారు. దీనిపై కొద్దిసేపటికే బుద్ధా వెంకన్న కౌంటర్ ఇచ్చారు. 'సంక్షోభ సమయంలో పార్టీ కోసం, నాయకుడి కోసం పోరాడేవాడు కావాలి. ఇతర పార్టీల నాయకులతో కలిసి కూల్చేవాడు ప్రమాదకరం. నీలాగా అవకాశవాదులు కాదు.. చనిపోయేవరకూ చంద్రబాబు కోసం సైనికుడిలా పోరాడేవాడు కావాలి' అంటూ ట్వీట్ చేశారు.

## బిగ్‌బాస్ యాజమాన్యంపై ఫిర్యాదు

- రాయదుర్గం పోలీసులను ఆశ్రయించిన నటి గాయత్రిగుప్తా
- మహిళాస్వేచ్ఛకు భంగం కలిగేలా వ్యవహరించారని ఆరోపణ



రాయదుర్గం పీఎస్‌లో బిగ్‌బాస్ యాజమాన్యంపై ఫిర్యాదుచేస్తున్న నటి గాయత్రి గుప్తా

**శేరిలింగంపల్లి:** బిగ్‌బాస్ టీవీ షో నిర్వాహకులు మహిళా స్వేచ్ఛకు భంగం కలిగేలా వ్యవహరించారని నటి గాయత్రిగుప్తా ఆదివారం రాత్రి బిగ్‌బాస్ యాజమాన్యంపై రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదుచేశారు. మణికొండలో నివాసముండే గాయత్రిగుప్తా కేసు వివరాలను అనంతరం మీడియాకు వెల్లడించారు. బిగ్‌బాస్ సీజన్-3లో పాల్గొనేందుకు తనను గత ఏప్రిల్‌లో మా టీవీ తెలుగు చానల్ యాజమాన్యం సంప్రదించిందని, వారి ఇంటర్వ్యూ శైలి మహిళల స్వేచ్ఛకు భంగం కలిగేలా ఉందని తెలిపారు. వందరోజులపాటు షోలో పాల్గొనేందుకు తనను ఎంపికచేసిన బిగ్‌బాస్ యాజమాన్యం ప్రతినిధులు.. మహిళల స్వేచ్ఛను హరించేలా మాట్లాడారని, చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## మోదీ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

- ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి పిలుపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రధాని మోదీ అనుసరిస్తున్న మతతత్వ, రైతాంగవ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నిర్మించాలని అఖిలభారత కిసాన్‌సభ (ఏఐకేఎస్) జాతీయకౌన్సిల్ సమావేశాల్లో నిర్ణయించినట్టు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి హన్నన్‌మొల్లా పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. దేశంలో వృద్ధిరేటు పడిపోతుంటే.. కేంద్ర ఆర్థికమంత్రి పెరుగుతున్నదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 13 రాష్ట్రాల్లో కరువు విలయతాండవం చేస్తున్నా.. నివారణచర్యలు చేపట్టడం లేదని మండిపడ్డారు. సమావేశంలో ఏఐకేఎస్ అధ్యక్షుడు అశోక్‌దావులే, తెలంగాణ రైతుసంఘం అధ్యక్ష, కార్యదర్శులు టీ జంగారెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏకపక్ష విధానాల రూపకల్పన వద్దు

- అటవీ విధానాల్లో రాష్ట్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- సరిహద్దు సమస్యల పరిష్కారానికి తరచూ సదస్సులు
- హైదరాబాద్‌లో అటవీశాఖ జాతీయ సదస్సులో నిర్ణయాలు
- ముగింపు సదస్సుకు హాజరైన భూపాల్‌రెడ్డి, టంకశాల అశోక్

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** అటవీ సంపదను రక్షించడానికి పొరుగు రాష్ట్రాలు సమన్వయ, సహకారంతో వ్యవహరించాలని హైదరాబాద్‌లో జరిగిన అటవీశాఖ జాతీయ సదస్సు నిర్ణయించింది. 'అటవీ సంరక్షణలో కొత్త విధానాలు, నూతన ఆవిష్కరణలు' అంశంపై తెలంగాణ అటవీశాఖ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగిన సదస్సు ఆదివారం ముగిసింది. మానవాళి మనుగడకు అడవుల ప్రాధాన్యంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించింది. అటవీ విధానాల రూపకల్పనలో ఏకపక్షం వద్దని, ఆయా రాష్ట్రాల అభిప్రాయాలను కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలని అభిప్రాయపడింది.అటవీ సరిహద్దు సమస్యలను పరిష్కరించుకొనేందుకు తరుచూ జాతీయ సదస్సులు నిర్వహించాలని సదస్సులో నిర్ణయించారు. తదుపరి జాతీయ సదస్సు నవంబర్‌లో మహారాష్ట్రలో జరుగనున్నది. తెలంగాణలో చేపడుతున్న హరితహారం ఆదర్శంగా ఉన్నదని, అడవుల పునరుద్ధరణ కూడా అనుసరణీయంగా ఉన్నందున స్ఫూర్తిగా తీసుకోవాలని సదస్సులో పలువురు పీసీసీఎఫ్‌లు సూచించారు.

**ఆడవుల అక్రమణలు తగ్గాయి: భూపాల్‌రెడ్డి**

తెలంగాణలో అటవీ భూముల సమస్యలకు త్వరలోనే సీఎం కే చంద్రశేఖర్‌రావు పరిష్కారం చూపుతారని సీఎం ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి చెప్పారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన రెండురోజులకే అడవుల పరిస్థితిపై సమగ్రచర్చ జరిపారని గుర్తుచేశారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎప్పుడూ లేని విధంగా విస్తృతస్థాయిలో సమావేశం ఏర్పాటుచేసిన సీఎం కేసీఆర్.. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకున్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారని తెలిపారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమానికి రూపకల్పన చేశారని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏటా మూడు వేల హెక్టార్ల భూమి ఆక్రమణకు గురికాగా.. తెలంగాణ ప్రభుత్వం తీసుకొన్న కఠిన చర్యల కారణంగా వేయి హెక్టార్లకు తగ్గిందని పేర్కొన్నారు.



బేగంపేట్ హరిత ప్లాజాలో జరిగిన అటవీశాఖ అధికారుల జాతీయ సదస్సులో పాల్గొన్న తెలంగాణ, మహారాష్ట్ర, తమిళ నాడు, కేరళ పీసీసీఎఫ్‌లు, ప్రభుత్వ సలహాదారు టంకశాల అశోక్

### జన చైతన్యం పెరుగాలి: టంకశాల అశోక్

అడవులు, వన్యప్రాణుల రక్షణపై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాలని ప్రభుత్వ సలహాదారు, సీనియర్ జర్నలిస్ట్ టంకశాల అశోక్ చెప్పారు. పచ్చదనాన్ని పెంచి పర్యావరణాన్ని కాపాడటంలో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. హరితహారంలో గ్రామీణ ప్రాంత ప్రజలే ఎక్కువ ఆసక్తితో పాల్గొంటున్నారని, ప్రజల భాగస్వామ్యం మరింత పెరుగాల్సిన అవసరమున్నదని అభిప్రాయపడ్డారు. అనంతరం తెలంగాణ పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రాల అటవీ సమస్యలపై అవగాహనకు నిర్వహించిన తొలి జాతీయ సదస్సు సఫలమైందని తెలిపారు.తెలంగాణలో అటవీ భూముల వివాదాలను పరిష్కారానికి కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల మాదిరిగా డిజిటలైజేషన్ చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఆర్వోఎఫ్ఆర్ కింద గత ప్రభుత్వాలు తెలంగాణలో 5.14 లక్షల ఎకరాలను బదలాయించాయని తెలిపారు. కాగజ్‌నగర్‌లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌పై జరిగిన దాడి సంచలనం రేపిందన్నారు. సదస్సులో తమిళనాడు పీసీసీఎఫ్ ఆర్‌కే ఉపాధ్యాయ్, కేరళ పీసీసీఎఫ్ కేశవన్, మహారాష్ట్ర పీసీసీఎఫ్ యూకే అగర్వాల్‌తోపాటు మహారాష్ట్ర పీసీసీఎఫ్ (ఐటీ) ఎమ్‌కే రావు, తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రఘువీర్, ఉన్నతాధికారులు పృధ్వీరాజ్, శోభ, మునీంద్ర, లోకేశ్‌జైస్వాల్, డోబ్రియాల్, స్వర్గం శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి, కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ ప్రాజెక్ట్ ఫీల్డ్ డైరెక్టర్లు వినోద్‌కుమార్, సిన్హా పాల్గొన్నారు.

# రుణాలివ్వని బ్యాంకులు

- పంటల బీమాపై నీలినీడలు
- ముంచుకొస్తున్న ప్రీమియం గడువు
- పత్తికి నేడే చివరిరోజు
- మిగిలిన పంటలకు ఈ నెల 31 తుదిగడువు
- పొడిగించాలని కోరుతున్న రైతులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఓవైపు ప్రతికూల వాతావరణంతో సతమతమవుతున్న రైతులను మరోవైపు బ్యాంకులు మరింత కుంగదీస్తున్నాయి. సకాలంలో వ్యవసాయ రుణాలను ఇవ్వకపోవడంతో ప్రస్తుత వానకాలం సీజన్‌లో పంటల బీమా అమలు ప్రశ్నార్థకంగా మారింది. వానకాలం పంటల బీమా ప్రీమియం చెల్లింపు గడువు తేదీలు సమీపించడంతో ఈసారి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)తోపాటు వాతావరణ ఆధారిత బీమాలో పంటల విస్తీర్ణం, రైతుల నమోదు గణనీయంగా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రధాన పంటగా అధిక విస్తీర్ణంలో సాగవుతున్న పత్తికి బీమా ప్రీమియం చెల్లింపు గడువు ఈ నెల 15 (సోమవారం)తో ముగియనుండగా.. వరితో పాటు ఇతర పంటల ప్రీమియం చెల్లింపు గడువు ఈ నెల 31తో ముగియనున్నది. సాగవుతున్నదానిలో కనీసం 50 శాతం విస్తీర్ణమైనా పంటల బీమా పరిధిలో ఉండాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ.. కంపెనీలు పెడుతున్న గడువు తేదీలతో ఆ లక్ష్యం నెరవేరడంలేదు. రాష్ట్రంలో గతేడాది వానకాలంలో దాదాపు 6 లక్షల మంది రైతులు, యాసంగిలో 1.7 లక్షల మంది రైతులు బీమా పరిధిలోకి వచ్చారు. ఈసారి ఈ సంఖ్య కనీసం 5 లక్షలైనా దాటుతుందా? లేదా? అన్నది సందేహంగా మారింది. ప్రస్తుత వానకాలంలో పంటల సాగు విస్తీర్ణం 1.08 కోట్ల ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 44 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగు మొదలైనట్టు వ్యవసాయశాఖ వెల్లడించింది. ఇందులో పత్తి అత్యధికంగా 20 లక్షలకుపైగా ఎకరాల్లో సాగవుతున్నది. ఇందులో 10 శాతం కూడా బీమా పరిధిలోకి రాలేదని అధికారులు చెప్తున్నారు. రైతు రుణం తీసుకునే సమయంలోనే ఆ పంటకు చెల్లించాల్సిన బీమా ప్రీమియంను బ్యాంకు మినహాయించుకొని మిగిలిన మొత్తాన్ని మంజూరు చేస్తుంది. ప్రస్తుత వానకాలంలో పంట రుణాల లక్ష్యం రూ.29,871 కోట్లుకాగా.. అందులో కనీసం రూ.1000 కోట్లు కూడా పంపిణీ కాలేదని అధికారులు చెప్తున్నారు. మరోవైపు ఇతర పద్ధతుల్లో ప్రీమియం చెల్లించడంపై అవగాహన లేకపోవడంతో రైతులు అటువైపు చూడటం లేదు. దీంతో కాలం కలిసిరాక అన్నదాత నష్టపోతే ఎటువంటి పరిహారం అందని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రీమియం చెల్లింపులపై వ్యవసాయ విస్తరణాధికారులు రైతుల్లో అవగాహన కల్పించి బీమాలో నమోదయ్యేలా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉన్నది. ఏఈవోలు సమగ్ర సమాచార సేకరణ, రైతుబంధు లాంటి పనుల్లో తలమునకలవడమే ఇందుకు కారణం.

**రాష్ట్రంలో పంటల బీమా వివరాలు**

రాష్ట్రంలో 2016 వానకాలం, యాసంగిలో కలిపి 1.39 కోట్ల ఎకరాల్లో పంటలు సాగవగా.. కేవలం 20.95 లక్షల ఎకరాలు మాత్రమే (15 శాతం) బీమా పరిధిలోకి వచ్చాయి. వీరిలో 8.26 లక్షల మంది రైతులు ప్రీమియం చెల్లించారు. అలాగే 2017 వానకాలం, యాసంగిలో కలిపి 1.41 కోట్ల ఎకరాల్లో పంటలు సాగవగా.. దాదాపు 30 లక్షల ఎకరాల్లోని పంటలు (21 శాతం) బీమా పరిధిలోకి వచ్చాయి. 2017 వానకాలంలో మొత్తం 7.92 లక్షల మంది రైతులు పంటల బీమాలో పేర్లు నమోదు చేసుకున్నారు. వీరిలో రుణం తీసుకొని ప్రీమియం చెల్లించిన వారు 7.75 లక్షల మందికాగా.. రుణం లేకుండా 16,433 మంది మాత్రమే ప్రీమియం చెల్లించారు. 2017 యాసంగిలో మొత్తం 1.62 లక్షల మంది రైతులు ప్రీమియం చెల్లించగా.. పంట రుణం తీసుకొని 1.44 లక్షల మంది, రుణం లేకుండా 18,579 మంది ప్రీమియం చెల్లించారు. 2018 వానాకాలం, యాసంగి పంటల బీమాకు సంబంధించిన వివరాలను బ్యాంకులు, బీమా కంపెనీలు వెల్లడించలేదు. బీమా కంపెనీలు ప్రీమియం చెల్లింపు గడువును పొడిగించాలని రైతులు కోరుతున్నారు.

## ధర్మపోరాటం పేరిట అధర్మపోరాటం

బాబు దీక్షపై బీజేపీ ఎంపీ సుజనాచౌదరి ఎద్దేవా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే న్యాయం ఉంటుందని తెలిసినా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ధర్మపోరాటం పేరిట అధర్మ పోరాటాలు చేశారని ఎంపీ సుజనాచౌదరి వ్యాఖ్యానించారు. ఇటీవలే టీడీపీ నుంచి బీజేపీలో చేరిన సుజనా.. ఆదివారం తొలిసారిగా విజయవాడకు వచ్చిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. తాను బాబుకు చెప్పినా ఆనాడు వినలేదని, కొందరి మాటలు విని బాబు ధర్మపోరాట దీక్షలు చేశారని అన్నారు. బీజేపీ- టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో జరిగినంత అభివృద్ధి అంతకుముందెన్నడూ జరుగలేదని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిన బీజేపీని ఏపీలో అధికారంలోకి తీసుకొచ్చేందుకు తనవంతు కృషిచేస్తానని తెలిపారు. అనంతరం సుజనాను పార్టీ కార్యకర్తలు సన్మానించారు.

## ఏపీలో టీడీపీ పనైపోయింది

- తానా సభల్లోనే మిగులుతున్నది
- నకిలీగాంధీలతో నిండిన కాంగ్రెస్
- బీజేపీ నాయకుల వ్యాఖ్యలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏపీలో టీడీపీ పనైపోయిందని, తానా సభల్లో మాత్రమే అది మిగులుతున్నదని బీజేపీ జాతీయ కార్యదర్శి రాంమాధవ్, మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్, బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ పార్టీ నకిలీ గాంధీలతో నిండిపోయిందని వ్యాఖ్యానించారు. గుంటూరులో ఆదివారం బీజేపీ ఆఫీస్ బేరర్ల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ అంటే ఒక రాజకీయ సంస్కృతి, భిన్నమైన రాజకీయ సంస్కృతికి ప్రధాని మోదీ ఆద్యుడని పేర్కొన్నారు. అనంతరం గన్నవరంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చౌహాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు, మాజీ మంత్రి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

**బాబు జైలుకు వెళ్లక తప్పదు**

గత ప్రభుత్వంచేసిన అవినీతిని వైఎస్ జగన్ సర్కార్ వెలికితీయాలని, అవినీతికి పాల్పడిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చే రెండేండ్లలో జైలుకెళ్లక తప్పదని బీజేపీ ఏపీ ఇంచార్జి సునీల్ దేవ్రా పేర్కొన్నారు. బీజేపీలో చేరిన తర్వాత రాజ్యసభ సభ్యుడు సుజనాచౌదరి తొలిసారి రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ముక్త్ భారత్ నినాదాన్ని ఎన్టీఆర్.. ఏపీలో వినిపించి సక్సెస్ అయ్యారన్న ఆయన.. ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు.

## కొత్త పాస్‌బుక్ ఉన్నా వేరొకరికి పట్టా!



పాస్‌పుస్తకాలు చూపుతున్న నర్సింహారెడ్డి, ప్రమీల

**హుస్నాబాద్, నమస్తే తెలంగాణ:** నా పేరు బొడ్గం నర్సింహారెడ్డి. నా భార్య పేరు ప్రమీల. మాది సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం జనగాం గ్రామం. నా పేరిట గ్రామ శివారులోని సర్వే నంబర్లు 505లో 16 గుంటలు, 507/బీలో 4.24 ఎకరాలు, 508/ఇలో 4.16 ఎకరాలు.. మొత్తం 9.16 ఎకరాల భూమి ఉన్నది. నా భార్య ప్రమీల పేరిట మరికొంత భూమి ఉన్నది. రెవెన్యూ అధికారులు నాకు ఖాతా నంబర్ 949తో, నా భార్యకు ఖాతా నంబర్ 105తో 2018 ఏప్రిల్ 10న కొత్త పాస్‌పుస్తకాలు జారీచేశారు. మాకు రైతుబంధు సహాయం కూడా అందింది. అయితే, ఆ తర్వాత రెవెన్యూ అధికారులు అదే సర్వే నంబర్లలోని భూమిని ఈ ఏడాది జనవరిలో వేరొకరికి పట్టాచేసి.. వారికి కూడా పాస్‌పుస్తకాలు జారీచేశారు. దీంతో నాకు రైతుబంధు సాయం ఆగిపోయింది. నాకు సమాచారం ఇవ్వకుండానే మరొకరికి పాస్‌పుస్తకం ఎలా జారీచేస్తారని ప్రశ్నిస్తే.. ఆర్డీవో వద్దకు అప్పీలుకువెళ్లండంటూ అక్కన్నపేట తాసిల్ కార్యాలయం అధికారులు చెప్తున్నారు. గతంలో అక్కన్నపేట తాసిల్దార్‌గా పనిచేసిన రామేశ్వర్ సదరు భూమికి ప్రొసీడింగ్ ఇవ్వగా, అనంతరం తాసిల్దార్‌గా వచ్చిన నాగజ్యోతి పాస్‌పుస్తకం జారీచేశారు. అంతే కాకుండా, నా భార్య ప్రమీల పేరిట ఖాతా నంబర్ 105తో ఉన్న పాస్‌పుస్తకంలోని సర్వే నంబర్ 515/బీ/1లోని 2.30 ఎకరాలను కూడా మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే తొలగించారు. ఎన్నో ఏండ్లుగా మేము కాస్తులో ఉన్న భూములను అధికారులు కాసులకు కక్కుర్తిపడి వివాదంలోకి నెట్టారు. దీనిపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించి మాకు న్యాయంచేయాలి.

- బొడ్గం నర్సింహారెడ్డి

## పాస్‌బుక్ ఇచ్చి వాపస్ తీసుకున్నరు



**జనగామ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** నా పేరు డ్యాగల భారతమ్మ. మాది జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం మండలగూడెం. నా భర్త రాములు మరణించడంతో వారసత్వంగా వచ్చిన ఖిలాషాపురంలోని సర్వే నంబర్ 875లో 5 ఎకరాల భూమిని సాగుచేసుకుంటున్నాను. డ్యాగల లక్ష్మీనారాయణ అనే వ్యక్తి రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకొని నా భూమిలోని మూడెకరాలకు నకిలీ పత్రాలు సృష్టించి పహాణీలో రాయించుకొన్నాడు. ఈ విషయమై గ్రామ కమిటీలో పంచాయితీ పెట్టాను. నా భూమిని లక్ష్మీనారాయణ కబ్జాచేసింది నిజమేనని తేలింది. ఈ మేరకు ఆ మూడెకరాల భూమిని నా పేరిట రికార్డుల్లోకి ఎక్కించాలని తీర్మానించారు. దీంతో స్పందించిన తాసిల్దార్ రవిచంద్రారెడ్డి సర్వే నంబర్ 875లో 5 ఎకరాలకు రికార్డులు సరిచేసి నా పేరిట పాస్‌పుస్తకం జారీచేశారు. అయితే లక్ష్మీనారాయణ వీఆర్వో రాజయ్య ద్వారా తాసిల్దార్‌ను మచ్చిక చేసుకొన్నాడు. అనంతరం తాసిల్దార్ నాకు జారీచేసిన పాస్‌పుస్తకాన్ని విచారణ పేరిట వెనక్కి తీసుకొన్నాడు. తిరిగి ఇవ్వకుండా, విచారణచేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. భూమిని సాగుచేసుకొనేందుకు వెళ్తే లక్ష్మీనారాయణ కుమారులు కుమార్, చంద్రశేఖర్ బెదిరింపులకు పాల్పడుతున్నారు. రెండేండ్లుగా పాస్‌పుస్తకం కోసం తాసిల్ చుట్టూ తిరుగుతూనే ఉన్నాను. వీఆర్వో, తాసిల్దార్ బదిలీ కావడంతో నా సమస్య అలాగే ఉండిపోయింది. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి నాకు న్యాయంచేయాలని కోరుతున్నాను.

- భారతమ్మ

## భూమిని ఆన్‌లైన్ చేయండి సారూ..

- తాసిల్ కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోయిన
- వికారాబాద్ మండలం మద్గుల్‌చిట్టంపల్లివాసి నర్సింహులు ఆవేదన



**వికారాబాద్ రూరల్:** వికారాబాద్ జిల్లా, వికారాబాద్ మండలం, మద్గుల్‌చిట్టంపల్లికి చెందిన కుమ్మరిపల్లి వీరప్ప కుమారుడు నర్సింహులుకు సర్వే నంబర్ 67లో మూడెకరాల భూమి ఉన్నది. ఈ భూమిని 2003లో ధన్నారం మల్లయ్య నుంచి సర్వే నంబర్ 67/1అలో ఉన్న 1.20 ఎకరాలు, ధర్నారం శంకరయ్య నుంచి సర్వే నంబర్ 67/1ఆలో ఉన్న 1.20 ఎకరాలను కొన్నారు. అప్పటి నుంచి నర్సింహులు కాస్తులో ఉన్నారు. 2008లో అతని పేరిట రిజిస్ట్రేషన్ అయింది. నాటి వీఆర్వో ఆ భూమిని పాస్‌పుస్తకంలో రాసి, ఆన్‌లైన్ చేయడం మరిచిపోయారు. ఈ భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు తాసిల్ కార్యాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా, వీఆర్వోలు మారినా ఆన్‌లైన్‌లో మాత్రం ఎక్కించలేదు. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో కొత్త పాస్‌పుస్తకం ఇచ్చారు. కానీ అందులో గతంలో అతని పేరిట ఉన్న భూమిని మాత్రం ఆన్‌లైన్‌లో ఎక్కించి పాస్‌పుస్తకం అందించారు. 2003లో కొన్న భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించకుండా రేపు మాపు అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. నిత్యం తాసిల్ చుట్టూ తిరుగడం వల్ల బాధితుడి ఆరోగ్యం క్షీణించింది. దీంతో ఇక తిరుగలేని పరిస్థితి ఏర్పడింది. రెవెన్యూ సదస్సులో తాసిల్దార్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. దీంతో రైతుబంధు సాయం రూ.27 వేలు కోల్పోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొన్న భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించి తనకు న్యాయంచేయాలని బాధితుడు కోరుతున్నారు.

# అమ్మిన భూమిపై కన్ను పడింది!

- అధికారులతో కుమ్మక్కై రికార్డుల్లో పేరు మార్పు
- 32 ఎకరాలను 17 ఏండ్ల కింద అమ్మి ఇప్పుడు బెదిరింపు
- విచారణ చేపట్టి ఆర్డీవోకు నివేదించిన నాంపల్లి తాసిల్దార్
- ఏడాదైనా స్పందించని ఉన్నతాధికారులు
- న్యాయం కోసం నల్లగొండ జిల్లా పసునూరువాసి కామిశెట్టి బుచ్చయ్య వేడుకోలు



భూమి పత్రాలు చూపుతున్న కామిశెట్టి బుచ్చయ్య, ఆయన కుటుంబసభ్యులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం పసునూరు గ్రామానికి చెందిన కామిశెట్టి బుచ్చయ్యది పేద కుటుంబం. ఆయనకు నలుగురు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇంటిల్లిపాది కష్టపడి పైసా పైసా కూడబెట్టి ఇదే గ్రామానికి చెందిన పసునూరు సుమతమ్మ వద్ద 2002లో సర్వే నంబర్లు 282, 283లోని 32 ఎకరాల భూమి కొన్నారు. మరో 4 ఎకరాలకుపైగా భూమిని పూటు కరాబు (రాళ్లురప్పలు ఉన్న సాగుకు యోగ్యం కాని) కింద ఇచ్చేందుకు అంగీకరించిన తర్వాతే బుచ్చయ్య.. గ్రామపెద్దల సమక్షంలో తెల్లకాగితంపై రాసుకొని 32 ఎకరాల భూమి కొన్నారు. భూమిని అమ్మిన పసునూరు సుమతమ్మ కుటుంబం ఆ తర్వాత హైదరాబాద్‌కు మారింది. కామిశెట్టి బుచ్చయ్య ఈ భూమిని కొన్న విషయం నాటి వీఆర్వోకు తెలుసు. దీంతో అనుభవదారు కాలంలో కామిశెట్టి బుచ్చయ్య పేరు నమోదుచేసి, కొనుగోలు చేయడం ద్వారా సంక్రమించిందని స్పష్టంగా పహాణీలో రాశారు. ఇలా ఏటా పహాణీ వస్తున్నది. సాదాబైనామాల ద్వారా జరిగిన క్రయవిక్రయాలను పట్టాచేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించడంతో తాము కొన్న భూమిని పట్టాచేయాలని బుచ్చయ్య దరఖాస్తు చేసుకొన్నారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు వీరి పేరిట భూమిని మార్పిడిచేశారు. 2017 నవంబర్ 11వ తేదీన మీసేవ ద్వారా తీసుకొన్న పహాణీలో ఈ రెండు సర్వే నంబర్లలో కొన్న భూమి మొత్తానికి పట్టాదారుగా, అనుభవదారుగా కామిశెట్టి బుచ్చయ్య పేరు వచ్చింది. డిజిటల్ సంతకం కూడా అయింది.

### రికార్డుల్లో పేరు మార్చేశారు

రైతుబంధు కింద ఎకరానికి రూ.8 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుండటంతో సుమతమ్మకు దురాశ కలిగింది. అమ్మిన భూమికి తాను కాగితం మాత్రమే రాసిచ్చానని, రిజిస్ట్రేషన్ చేయలేదు.. కాబట్టి ఈ భూమి తనదేనని వాదించడం మొదలుపెట్టారు. ఏటా ఎకరానికి రూ.8 వేల చొప్పున మొత్తం రూ.2.56 లక్షలు వస్తాయన్న దురాశతో గ్రామానికి చేరుకొన్న సుమతమ్మ.. సదరు భూమిని తాను అమ్మలేదని చెప్పారు. రెవెన్యూ అధికారులను బెదిరించి, వారితో కుమ్మక్కై బుచ్చయ్య పేరిట ఉన్న 32 ఎకరాల భూమిని రికార్డుల్లో తన పేరిట ఎక్కించుకొన్నారు. అందరికీ రైతుబంధు సాయం వచ్చి తమకు రాలేదని బుచ్చయ్య కుటుంబసభ్యులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. 'ఈ భూమి మీ పేరిట లేదు. మీరు ఎవరి నుంచి కొన్నారో.. వారి పేరిట పట్టా అయింది' అని అధికారులు చెప్పడంతో బాధితులు విస్తుపోయారు. నాటి నుంచి నేటివరకు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని బాధిత కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### ఊరంతా అండగా నిలిచినా..

కామిశెట్టి బుచ్చయ్య 32 ఎకరాల భూమిని 17 ఏండ్ల కిందట కొన్నారని పసునూరు గ్రామ సర్పంచ్ పోగుల వెంకటరెడ్డి మండల రెవెన్యూ అధికారికి ధ్రువీకరణపత్రం అందజేశారు. సర్వే నంబర్లు 282, 283లలోని 32 ఎకరాల భూమిని పసునూరి సుమతమ్మ వద్ద బుచ్చయ్య కొన్నారని, 2004-2005 నుంచి అనుభవదారుగా అడంగల్‌లో వస్తున్నదని, ఇప్పటికీ కాస్తులో ఉంటూ సాగుచేస్తున్నారని తెలిపారు. ఈ మేరకు గ్రామ ప్రజలతో సమావేశం ఏర్పాటుచేసి ధ్రువీకరించామని చెప్పారు. కామిశెట్టి బుచ్చయ్య సర్వే నంబర్లు 282, 283లలోని 32 ఎకరాల భూమిని పసునూరి సుమతమ్మ వద్ద కొన్న విషయం వాస్తవమేనని 2018 జూన్ 29వ తేదీన దేవరకొండ ఆర్డీవోకు అప్పటి తాసిల్దార్ నివేదిక కూడా ఇచ్చారు. ఈ నివేదిక ఇచ్చి ఏడాది దాటినా ఇప్పటివరకు ఈ భూమిని బుచ్చయ్య పేరిట రికార్డుల్లోకి ఎక్కించకపోవడం గమనార్హం. ఫలితంగా ఈ భూమిని సాగు చేసుకొంటున్న ఈ పేద కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు, రైతుబీమా పథకాలు అందడం లేదు. భూమిని కొన్నప్పుడు ఏడుగురుగా ఉన్న ఈ కుటుంబసభ్యుల సంఖ్య.. ప్రస్తుతం 28కి చేరింది. కుటుంబమంతా ఈ భూమిపైనే ఆధారపడి జీవిస్తున్నదని, తమకు న్యాయంచేయాలని బుచ్చయ్య వేడుకొంటున్నారు. ఉన్నత సామాజికవర్గానికి చెందిన సుమతమ్మ.. రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి రికార్డుల్లో పేరు మార్చారని, తమను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### మట్టి బిడ్డలం.. ఆదుకోండి సారూ

పైకి నివేదిక ఇచ్చాం. పైనుంచి లెటర్ వస్తే చేస్తామని రెవెన్యూ అధికారులు చెప్తున్నారు. రైతుబంధు డబ్బు రావడంలేదు. నేను వృద్ధుడిని అయ్యా. నా పిల్లలకు ఈ భూమే ఆధారం. తలా ఇంత సాగు చేసుకొని బతుకుతున్నారు. దయచేసి నా భూమిని నా పేరిట పట్టాచేయండి. నా పిల్లలకు ఇవ్వండి. కాయకష్టం చేసుకొని బతుకుతున్నాం. ఇంటిల్లిపాది కూలినాలి చేసుకొని, ఇంత అప్పుచేసి.. దొరసానమ్మ దగ్గర భూమిని కొన్న. నా బిడ్డలు ఈ మట్టిలనే పనిచేసి బతుకుతున్నరు. దొరసానమ్మ కొడుకులు పట్నంల చదువుకొని అమెరికాకు పోయింద్రు. ఈ మట్టి బిడ్డలను ఆదుకోండి సారూ.

- కామిశెట్టి బుచ్చయ్య, రైతు, పసునూరు

### రికార్డులు పరిశీలించి న్యాయంచేస్తా

నేను బదిలీపై వచ్చిన తర్వాత ఎన్నికల విధుల్లో ఉన్నాం. బాధితులు వచ్చి కలిస్తే రికార్డులన్నింటినీ పరిశీలిస్తాను. న్యాయం చేయడానికి నా వంతు కృషిచేస్తాను.

- నాగిరెడ్డి అరుణజ్యోతి, నాంపల్లి తాసిల్దార్

## విరాసత్ భూమికీ తిప్పలే

- పాత బుక్‌లో ఉన్నా కొత్తదాంట్లో మరిచారు
- కాస్తులో ఉన్నా రికార్డుల్లో నమోదుకాని భూమి
- పట్టాభూమిని ప్రభుత్వ భూమి అంటున్న అధికారులు
- ధర్మగంటను ఆశ్రయించిన యాదాద్రి భువనగిరి జిల్లావాసి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని గుండ్లగూడెం గ్రామానికి చెందిన గడ్డం లచ్చిరెడ్డికి అదే గ్రామంలోని సర్వే నంబర్లు 299/అ 2, 301/ఇ, 414, 416, 417, 419, 300/ఆ, 418/ఇ, 420 లో 8 ఎకరాల ముప్పావు గుంట ఉన్నది. తన తండ్రి నరసింహారెడ్డి నుంచి వారసత్వంగా ఈ భూమి లచ్చిరెడ్డికి సంక్రమించింది. 1986లో నరసింహారెడ్డి చనిపోవడంతో 1988 లో మొత్తం భూమిని లచ్చిరెడ్డి తన పేరిట విరాసత్ చేయించుకున్నారు. అప్పటినుంచి ఇప్పటివరకూ కబ్జాలో లచ్చిరెడ్డే ఉన్నారు. భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టేంతవరకూ పాత పాస్‌పుస్తకంలోనూ లచ్చిరెడ్డి పేరిట 8 ఎకరాల ముప్పావు గుంట నమోదై ఉన్నది. భూ రికార్డుల ప్రక్షాళన తర్వాత కేవలం 3.33 ఎకరాలకు మాత్రమే రెవెన్యూ అధికారులు కొత్త పాస్‌పుస్తకం మంజూరుచేశారు. మిగిలిన నాలుగు ఎకరాల 7 గుంటల ముప్పావు గుంట భూమిని కొత్త పాస్‌పుస్తకంలో రాయలేదు. కొత్త పాస్‌పుస్తకంలో తక్కువ భూమిని నమోదుచేశారని రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా.. రికార్డుల సవరణ చేయలేదని బాధితుడు లచ్చిరెడ్డి వాపోయారు. తన భూమికి సంబంధించి గట్టిగా నిలదీస్తే అది ప్రభుత్వ భూమి అంటూ దబాయిస్తున్నారని పేర్కొన్నారు. నరసింహారెడ్డి నుంచి లచ్చిరెడ్డికి విరాసత్ చేసినప్పుడు పాతపాస్ పుస్తకంలో పట్టాగా నమోదై ఉన్న భూమి.. ఇప్పుడు ప్రభుత్వ భూమి ఎలా అయిందని ప్రశ్నిస్తే అధికారులు సమాధానం చెప్పటంలేదని లచ్చిరెడ్డి తెలిపారు.

### మా భూమి మాకివ్వాలి

మా భూమి ప్రభుత్వ భూమే అయితే నా పేరిట జారీచేసిన పాస్‌పుస్తకంలో పట్టా అని ఎందుకు నమోదుచేశారు? అప్పుడు పట్టా భూమి అని రికార్డుల్లో నమోదు చేసి.. ఇప్పుడు ప్రభుత్వ భూమి అనడం అన్యాయం. మొత్తం 8 ఎకరాల ముప్పావు గుంటపై ఇప్పటికీ మేమే కాస్తులో ఉన్నాం. వెంటనే మా మొత్తం భూమిని కొత్త పాస్‌పుస్తకంలో నమోదు చేసి రైతుబంధు అందేలా చర్యలు తీసుకోవాలి.

- గడ్డం లచ్చిరెడ్డి, బాధితుడు

### గుండ్లగూడెంలో ప్రభుత్వ భూములున్నాయి

గుండ్లగూడెంలో ప్రభుత్వ భూములున్న మాట వాస్తవం. లచ్చిరెడ్డికి మాత్రం అప్పుడున్న అధికారులు పట్టా భూమి అని తప్పుగా నమోదు చేశారు. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో ఎల్‌ఆర్‌ఈపీ సర్వేచేసి పాస్‌పుస్తకం మంజూరుచేయకుండా ఆపారు. గత అధికారులు చేసిన తప్పిదానికి నేనేం చేయలేను. లచ్చిరెడ్డి సమస్యకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, సర్వేచేసిన అనంతరం అది ప్రభుత్వ భూమా? పట్టా భూమా? నిర్ణయించి సమస్యను పరిష్కరిస్తాం.

- శ్యాంసుందర్‌రెడ్డి, ఆలేరు తాసిల్దార్

## 28 గుంటలు మాయం

- వారసత్వ భూమికి రెక్కలు
- తాసిల్ చుట్టూ అక్కాచెల్లెళ్ల ప్రదక్షిణ



పాస్‌పుస్తకం చూపుతున్న కృష్ణవేణి

**బయ్యారం:** తల్లితండ్రులు చనిపోయిన తర్వాత వారసత్వంగా సంక్రమించాల్సిన భూమి హక్కు పత్రాల కోసం ఇద్దరు అక్కాచెల్లెళ్లు రెండేండ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడంలేదు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన మేకల దర్గయ్యకు సర్వే నంబర్ 44/అలో 27 గుంటలు, 45/అలో 1.13 ఎకరాల భూమి ఉన్నది. అందుకు సంబంధించి 444 ఖాతా నంబర్‌తో పాస్‌పుస్తకం కూడా ఉన్నది. దర్గయ్యకు ముగ్గురు కుమార్తెలున్నారు. వారి పెండ్లి సమయంలో పసుపుకుంకుమ కింద పెద్ద కుమార్తె భట్టు కృష్ణవేణికి ఎకరం, రెండో కుమార్తె పిడుగు రమాదేవికి ఎకరం భూమిని రాసిచ్చారు. అయితే 2013లో దర్గయ్యతోపాటు ఆయన భార్య కూడా మరణించారు. దీంతో ఆ భూమిని తమ పేరిట మార్చాలని కృష్ణవేణి, రమాదేవి భూరికార్డుల ప్రక్షాళన సమయంలో తాసిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకొన్నారు. అనంతరం ఖాతా నంబర్ 643తో కృష్ణవేణి పేరిట సర్వే నంబర్లు 44/అ/1లో 6 గుంటలు, 45/అ/1లో మరో 20 గుంటలకు, రమాదేవికి ఖాతా నంబర్ 644తో సర్వే నంబర్లు 44/అ/2లో 6 గుంటలు, 45/అ/2లో 20 గుంటల భూమికి సంబంధించి పాస్‌పుస్తకాలు అందజేశారు. రెండు ఎకరాల్లో ఇద్దరికీ కలిపి ఎకరం 12 గుంటల భూమి ఉన్నట్టు పాస్‌పుస్తకాలు అందజేసిన అధికారులు.. ఇంకా 28 గుంటల భూమిని ఇద్దరి పేరిట నమోదు చేయాల్సి ఉన్నది. ఆ భూమిని కూడా తమ పాస్‌పుస్తకాల్లో నమోదుచేయాలంటూ కృష్ణవేణి, రమాదేవి పలుమార్లు రెవెన్యూ సిబ్బందిని వేడుకొన్నారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు రెండేండ్ల నుంచి నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుండటంతో ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు.

### సర్వేచేయని అధికారులు

హక్కుపత్రాల్లో తమకు 28 గుంటల భూమి తక్కువగా రావడంతో కృష్ణవేణి, రమాదేవి సంబంధిత వీఆర్వోను ప్రశ్నించారు. అయితే సంబంధిత సర్వే నంబర్‌లో కాస్తు ప్రకారం సరిపడ భూమికి పాస్‌పుస్తకాలు ఇచ్చామని, మిగిలిన భూమి ఏ సర్వే నంబర్‌లో ఉన్నదో తెలియాలంటే 44, 45 నంబర్లలోని అందరి భూముల సర్వే కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దీంతో వారు సర్వే కోసం 2018 ఏప్రిల్ 4న మీసేవలో దరఖాస్తు చేసుకొన్నారు. 15 నెలలు గడుస్తున్నా సర్వే చేయకపోవడంతో సమస్య అపరిష్కృతంగానే మిగిలిపోయింది. ఈ విషయమై తాసిల్దార్ పుల్లారావును వివరణ కోరగా.. త్వరలోనే సర్వే నిర్వహించి సమస్యను పరిష్కమని చెప్పారు.

# పానం మంచిగ లేదన్నా పట్టించుకుంటలేరు

- అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధునితో రెవెన్యూ ఆటలు
- వారసత్వ భూమికి నకిలీ సాదాబైనామా
- ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా దయలేదు
- 'ధర్మగంట'తో వికారాబాద్ జిల్లావాసి ఆవేదన

**అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధునికీ రెవెన్యూ తిప్పలు తప్పడం లేదు. వృద్ధులతోనూ రెవెన్యూ అధికారులు ఆటాడుకుంటున్నారు. భూ సమస్యలు పరిష్కరించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఉన్న కొద్దిపాటి భూమికి దొంగ సాదాబైనామా పత్రాలు సృష్టించి దోచేస్తున్నా.. రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదు. తమ భూమి సమస్యను పరిష్కరించాలని కాళ్లరిగేలా తిరిగినా కనికరించడం లేదు. వికారాబాద్ జిల్లా వికారాబాద్ మండలంలోని సిద్లూర్ పైఘ గ్రామానికి చెందిన మౌలానా తన సమస్య పరిష్కారం కోసం ధర్మగంటను ఆశ్రయించారు.**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వికారాబాద్ జిల్లా వికారాబాద్ మండలంలోని సిద్లూర్ పైఘ గ్రామానికి చెందిన మహ్మద్ మౌలానా తాత మోహలాన్ సాబ్. మోహలాన్ సాబ్, హుస్సేన్‌సాబ్ అన్నదమ్ములు. వారికి వారసత్వంగా 4.29 ఎకరాల భూమి వచ్చింది. అందులో మోహలాన్ సాబ్ వాటాగా 241/అ సర్వే నంబర్‌లో 20 గుంటలు, సర్వే నంబర్ 242/అ లో 1.35 ఎకరాలు, హుస్సేన్‌సాబ్ వాటాగా 241/ఆ సర్వే నంబర్‌లోని 20 గుంటలు, 242/ఆ సర్వే నంబర్‌లోని 1.34 ఎకరాలు పంచుకున్నారు. మోహలాన్‌కు 2.15 ఎకరాలు, హుస్సేన్‌సాబ్‌కు 2.14 ఎకరాలు భూమి వచ్చింది. అయితే హుస్సేన్‌సాబ్ మరణానంతరం ఆయన పేరిట ఉన్న భూమిని ఆయన భార్య మోరియంబికి విరాసత్ చేశారు. మోహలాన్‌సాబ్ వాటాను ఆయన కొడుకు జమాలుద్దీన్ చనిపోవడంతో మనవడు మౌలానా పేరిట విరాసత్ చేశారు. మోరియంబికి వారసులు లేకపోవడంతో ఆమె పేరిట ఉన్న 2.14 ఎకరాలను 1970లోనే మౌలానా పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. దీంతో మొత్తం 4.29 ఎకరాల భూమి మౌలానాకు సంక్రమించింది. ఇందులోనుంచి 241/అ సర్వే నంబర్ లోని 20 గుంటలు, 242/అ సర్వే నంబర్‌లోని 1.35 ఎకరాలను 1992 లో శెట్టి శివలీలకు మౌలానా విక్రయించారు. హైదరాబాద్‌లో ఉద్యోగరీత్యా ఉండటం వల్ల మోరియంబి నుంచి సంక్రమించిన 2.34 ఎకరాలను మౌలానా సాగుచేయలేదు. దానిని అదునుగా భావించిన శెట్టి శివలీల బంధువు మల్లేశ్ ఈ 2.34 ఎకరాలకు తప్పుడు సాదాబైనామా సృష్టించి తన పేరిట మార్చుకొని, అనంతరం శెట్టి శివలీలకు విక్రయించారని బాధితుడు చెప్తున్నారు. తమ భూమిని తమకు కాకుండా చేయడంలో అప్పటి వీఆర్వో మాధవరెడ్డి మల్లేశ్‌కు సహకరించారని మౌలానా ఆరోపిస్తున్నారు. తమ సమస్యను పరిష్కరించాలని ఎన్నో ఏండ్లుగా రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రెవెన్యూ కార్యాలయాల చుట్టు కాళ్లరిగేలా తిరిగినా కనికరించడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### రికార్డులు పరిశీలిస్తా

వెంటనే రికార్డులు పరిశీలిస్తా. సమస్య ఎక్కడ వచ్చిందో గుర్తించి పరిష్కరిస్తాం. బాధితుడికి న్యాయం చేస్తాం.

- చిన్నఅప్పల నాయుడు, వికారాబాద్ తాసిల్దార్

### నేను భూమి అమ్మలేదు



నా పానం మంచిగుంటలేదు. క్యాన్సర్ కారణంగా అనారోగ్యానికి గురైన. అయినా అధికారులు మాత్రం తిప్పుకుంటున్నారు. ఇప్పుడిక ఓపికలేదు. నేనెవరికీ భూమి అమ్మలేదు. తప్పుడు పత్రాలు పుట్టించి భూమిని దోచేయడం అన్యాయం. నాకున్నది ఆ భూమి మాత్రమే. రెవెన్యూ అధికారుల అండతోనే నా భూమిని నాకు కాకుండా చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నా భూమిని నాకిప్పించాలి.

- మహ్మద్ మౌలానా, బాధితుడు

## పదిహేనేండ్లుగా అందని పట్టా

పెద్దకొత్తపల్లి తాసిల్ చుట్టూ బాధితుడు రఘువీర్ ప్రతాప్ ప్రదక్షిణ



**పెద్దకొత్తపల్లి:** నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని కల్వకోల్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగి రఘువీర్ ప్రతాప్‌కు వారసత్వంగా వచ్చిన 10 ఎకరాల భూమిని 2005లో అతని తండ్రి నారాయణదాసు ఇద్దరు కుమారులకు నోటరీ ద్వారా సమానంగా పంపిణీచేశారు. చిన్న కుమారుడైన రఘువీర్ ప్రతాప్ పేరిట 2005లో ఐదెకరాలను రిజిస్ట్రేషన్‌చేశారు. పాస్‌పుస్తకాల కోసం అప్పటి నుంచి తాసిల్ చుట్టూ రఘువీర్ ప్రతాప్ తిరుగుతూనే ఉన్నారు. ఆర్డీవో, కలెక్టర్‌కు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. చివరికి బాధితుడు ధర్మగంటను ఆశ్రయించారు. జిల్లా రెవెన్యూ అధికారులు విచారణచేసి తనకు పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వాలని కోరారు. ఈ విషయమై డీటీ బాలరాజును వివరణ కోరగా.. ఈ భూమి విషయంలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య పంచాయితీ ఉన్నది. కోర్టు అనుమతితో నారాయణదాసు పెద్ద కుమారుడు దశరథంరాంకు ఐదెకరాలకు పాస్‌పుస్తకం ఇచ్చామని తెలిపారు. దీంతో చిన్న కుమారుడు రఘువీర్‌ప్రతాప్ ఆర్డీవోకు ఫిర్యాదుచేశారన్నారు. ప్రస్తుతం ఆర్డీవో కోర్టులో విచారణ కొనసాగుతున్నదని వివరించారు.

# జగజ్జేత ఇంగ్లండ్




**44 ఏండ్ల తర్వాత పుట్టింటికి చేరిన ప్రపంచకప్**

**ఫైనల్లో ఇంగ్లండ్ 'సూపర్' విక్టరీ.. ఆఖర్లో తడబడ్డ న్యూజిలాండ్**

రక్తం మరగడం అంటే ఏంటో.. రోమాలు నిక్కబొడవడం ఎలా ఉంటుందో.. ప్రపంచకప్ ఫైనల్ చూసిన వారికి సరిగ్గా తెలిసుంటుంది.

బంతి బంతికి టెన్షన్‌తో నరాలు చిట్లిపోతుంటే.. ప్రతీ పరుగు గుండెను అరచేతుల్లోకి తెస్తుంటే.. ఆడేది 22 మందే అయినా.. కోటాను కోట్ల మంది అభిమానులు ఊగిపోతుంటే..ఉత్కంఠ అనే పదం చిన్నబోయిన వేళ హోరాహోరీ అనడం చాలా తక్కువైన తరుణాన ఇరు జట్ల ఆటగాళ్లు కొదమ సింహాల్లా పోరాడినా..కీలక సమయంలో ఒత్తిడిని జయించిన ఇంగ్లండ్‌నే విజయం వరించింది.

విశ్వ వేదికపై 23 ఏండ్ల తర్వాత నయా చాంపియన్ అవతరించింది. ఐసీసీ 12వ ప్రపంచకప్ ట్రోఫీని ఆతిథ్య జట్టే ముద్దాడింది. ఒకటికి మూడుసార్లు తుదిమెట్టుపై బోల్తాపడ్డ బ్రిటీష్ జట్టు 44 ఏండ్ల తండ్లాటకు ముగింపు పలుకుతూ.. నాలుగో ప్రయత్నంలో కిరీటాన్ని కైవసం చేసుకుంది.

హృదయ స్పందన చెవులకు స్పష్టంగా వినిపించేంత నిశబ్దం.. చివరి ఓవర్లో సాగిన ఉత్కంఠకు నరాలే కాదు ఆ స్థానంలో ఉక్కు తీగలున్నా తెగిపడేవే. ప్రపంచకప్‌కు అసలు సిసలు ముగింపు. తుదిపోరు ఎలా ఉండాలని ప్రతీ అభిమాని భావిస్తాడో అంతకుమించి మజాతో సాగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్‌కు నిరాశ ఎదురైంది. సెమీఫైనల్లో కోట్లాది మంది భారతీయులు ఆశలు చిదిమేసిన న్యూజిలాండ్ తుదిమెట్టుపై మరోసారి చిత్తైంది. క్రితం సారి ప్రపంచకప్ ఫైనల్లో ఓడిన కివీస్ ఈసారి కూడా అదే ఫలితంతో వెనుదిరిగింది. ఆ జట్టు బ్యాటింగ్ వెన్నెముక విలియమ్సన్ నడిసంద్రంలో నావను వదిలేయడంతో మొదట బ్లాక్‌క్యాప్స్ ఓ మోస్తరు స్కోరుకే పరిమితం అయింది. అయినా పోరాట పటిమను వదలని కివీస్ బౌలింగ్‌లో రాణించి ఇంగ్లండ్ హిట్టర్లను చక్కగా అడఅడ్డుకున్నా.. సూపర్ ఓవర్ థ్రిల్లర్‌లో పైచేయి సాధించలేకపోయింది.

## సూపర్ ఓవర్ సాగిందిలా..

ఇంగ్లండ్: 3 1 4 1 2 4 — మొత్తం 15

బౌలర్: బౌల్ట్ — బ్యాట్స్‌మెన్: స్టోక్స్, బట్లర్

న్యూజిలాండ్: wd 2 6 2 2 1 1+W — మొత్తం 15 +W

బౌలర్: ఆర్చర్ — బ్యాట్స్‌మెన్: గప్టిల్, నీషమ్

**లండన్:**


న్యూజిలాండ్ చేసిన స్కోరు చూస్తే.. ఇంగ్లండ్ విజయం నల్లేరుపై నడకే అనిపించింది. కానీ నాణ్యమైన బౌలింగ్ వనరులున్న కివీస్ పట్టు వదల్లేదు. వంద లోపే నాలుగు వికెట్లు పడగొట్టింది. ఇంకేముంది ఆతిథ్య జట్టు పనైపోయింది. బ్లాక్‌క్యాప్స్ ట్రోఫీ ఎగరేసుకుపోవడం ఖాయమే అనిపించింది. కానీ ఈ దశలో అసాధారణంగా పోరాడిన స్టోక్స్, బట్లర్ ఇంగ్లండ్‌ను గెలుపు వాకిలి వరకు తెచ్చారు. కానీ 7 పరుగుల వ్యవధిలో ఫెర్గూసన్ 2 వికెట్లు తీసి కివీస్‌ను తిరిగి పోటీలోకి తెచ్చాడు. ఇక చివరి ఓవర్‌లో సాగిన ఉత్కంఠలో 2 రనౌట్లతో ఇంగ్లండ్ ఆలౌట్ కావడంతో స్కోరు సమమై 'సూపర్ ఓవర్'అనివార్యమైంది. ప్రపంచకప్ చరిత్రలో తొలిసారి సూపర్ ఓవర్ ద్వారా విజేతను నిర్ణయించాల్సి వచ్చింది. క్షణ క్షణం ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్‌లో ఒత్తిడిని అధిగమించిన ఇంగ్లండ్‌నే విజయం వరించింది. బంతి బంతికి ఆధిక్యం చేతులు మారుతూ వచ్చిన పోరు తొలుత 'టై'అయినా.. సూపర్ ఓవర్‌లో ఇంగ్లిష్ జట్టు 'సూపర్ సే భి ఊపర్'రేంజ్‌లో బ్యాటింగ్ చేసి 15 పరుగులు సాధించింది. అనంతరం కివీస్ కూడా సరిగ్గా 15 పరుగులే చేసినా.. మ్యాచ్‌లో కివీస్(16) కంటే ఎక్కువ బౌండరీలు (24) కొట్టిన ఇంగ్లండ్‌నే విజయం వరించింది. 44 ఏండ్లుగా ఊరిస్తూ వస్తున్న కప్పు ఎట్టకేలకు క్రికెట్ పుట్టినింటికి చేరింది. ఆదివారం క్రికెట్ మక్కా లార్డ్స్‌లో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ సూపర్ ఓవర్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి నయా చాంపియన్‌గా అవతరించింది. మరోవైపు న్యూజిలాండ్ వరుసగా రెండోసారి రన్నరప్‌తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 241 పరుగులు చేసింది. ఓపెనర్ నికోల్స్ (55; 4 ఫోర్లు) అర్ధ శతకం సాధించగా.. టామ్ లాథమ్ (47; 2 ఫోర్లు, 1 సిక్స్) పోరాడాడు. భీకర ఫామ్‌లో ఉన్న కెప్టెన్ కేన్ విలియమ్సన్ (30) మంచి ఆరంభాన్ని భారీ స్కోరుగా మలచలేకపోయాడు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్ (3/37), లియామ్ ప్లంకెట్ (3/42) సత్తాచాటారు. అనంతరం లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ 50 ఓవర్లలో సరిగ్గా 241 పరుగులకే ఆలౌటైంది. స్టోక్స్ (98 బంతుల్లో 84; 5 ఫోర్లు, 2 సిక్సర్లు), బట్లర్ (60 బంతుల్లో 59; 6 ఫోర్లు) పోరాడినా చివరకు మ్యాచ్ 'టై'అయింది. స్టోక్స్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, విలియమ్సన్‌కు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు దక్కాయి.

### చివరి ఓవర్ సాగిందిలా

| బంతి | పరుగులు |
|---|---|
| 1 | 0 |
| 2 | 0 |
| 3 | 6 |
| 4 | 2+4(ఓవర్ త్రో) |
| 5 | 1+రనౌట్ |
| 6 | 1+రనౌట్ |

### ఆరంభం పేలవం..

సెమీఫైనల్లో బలమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న భారత్‌పై దాదాపు ఇంతే లక్ష్యాన్ని కాపాడుకున్న న్యూజిలాండ్ ఈసారి కూడా చివరి వరకు పోరాడింది. ఇంగ్లండ్ తురుపు ముక్క జాసన్ రాయ్ (17) ఆరంభంలోనే ఔట్ కావడంతో లక్ష్య ఛేదనలో ఆతిథ్య జట్టు తడబడింది. ఇన్నింగ్స్ తొలి బంతికే బతికిపోయిన రాయ్‌ను హెన్రీ ఔట్ చేశాడు. జో రూట్ (30 బంతుల్లో 7) మరీ నెమ్మదిగా ఆడటంతో పవర్ ప్లే ముగిసేసరికి ఇంగ్లండ్ వికెట్ నష్టానికి 39 రన్స్ చేసింది. అప్పటికే ఒకసారి క్యాచ్ మిస్ కావడంతో బతికిపోయిన బెయిర్‌స్టో (36; 7 ఫోర్లు) కూడా ఎక్కువ సేపు నిలువలేకపోయాడు. ఇంగ్లండ్‌కు అసలు సిసలు షాక్ మాత్రం నీషమ్ ఇచ్చాడు. వేసిన తొలి బంతికే కెప్టెన్ మోర్గాన్ (9)ను ఔట్ చేసి కివీస్ శిబిరంలో ఆనందం నింపాడు. దీంతో ఇంగ్లండ్ 86/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది.


స్టోక్స్ (84*)

### ఆదుకున్న స్టోక్స్, బట్లర్

న్యూజిలాండ్ బౌలర్లు చెలరేగిపోతుండటంతో.. ఆరంభంలో ఆచితూచి ఆడిన స్టోక్స్, బట్లర్ కుదురుకున్నాక జోరు పెంచారు. దీంతో ఇంగ్లండ్ 28 ఓవర్లో 100 పరుగుల మార్క్ దాటింది. ఈ క్రమంలో మొదట బట్లర్ (53 బంతుల్లో), ఆ తర్వాత స్టోక్స్ (81 బంతుల్లో) అర్ధ శతకాలు పూర్తి చేసుకున్నారు. ఐదో వికెట్‌కు 110 రన్స్ జోడించాక.. 31 బంతుల్లో 46 పరుగులు చేయాల్సిన దశలో బట్లర్ వెనుదిరిగడంతో ఉత్కంఠ తారాస్థాయికి చేరింది. ఓవైపు స్టోక్స్ ఉన్నా.. మరో ఎండ్‌లో వోక్స్ (2) కూడా ఔటవడంతో గెలుపు సమీకరణం 18 బంతుల్లో 34కు చేరింది. బౌల్ట్ వేసిన 48వ ఓవర్ తొలి బంతికి ఫోర్ కొట్టిన స్టోక్స్ కొంతలో కొంత ఒత్తిడి తగ్గించాడు. ఫలితంగా లక్ష్యం 12 బంతుల్లో 24కు చేరింది. ఈ ఓవర్‌లో నీషమ్ 9 పరుగులిచ్చి ప్లంకెట్ (10)తో పాటు ఆర్చర్ (0)ను ఔట్ చేయడంతో సమీకరణం 6 బంతుల్లో 15కు చేరింది. బౌల్ట్ వేసిన చివరి ఓవర్‌లో చిత్ర విచిత్రాలు జరగ్గా.. ఆఖరికి మ్యాచ్ టైగా ముగిసింది. కివీస్ బౌలర్లలో ఫెర్గూసన్, నీషమ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు.

### తలా కొన్ని..

ఫైనల్ వరకు జట్టును ముందుండి నడిపించిన నాయకుడు విలియమ్సన్.. తుదిపోరులో మాత్రం అంచనాలకు తగ్గట్లు ఆకట్టుకోలేకపోయాడు. మిగిలిన వారు తలా కొన్ని పరుగులు చేయడంతో కివీస్ సెమీస్‌లో భారత్‌కు నిర్దేశించిన లక్ష్యం కంటే రెండు పరుగులు ఎక్కువ టార్గెట్‌ను ఇంగ్లండ్ ముందుంచగలిగింది. టాస్ గెలిచిన విలియమ్సన్ మరో ఆలోచన లేకుండా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అందుకు తగ్గట్లే.. మార్టిన్ గప్టిల్ (19; 2 ఫోర్లు, 1 సిక్స్) కొన్ని చక్కటి షాట్లతో మంచి టచ్ లో కనిపించాడు. ఏడో ఓవర్‌లో వోక్స్.. గప్టిల్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. విలియమ్సన్ ఆరంభంలో ఆచితూచి ఆడటంతో పవర్ ప్లే ముగిసే సరికి న్యూజిలాండ్ 33/1తో నిలిచింది. ఫలితంగా 22 ఓవర్లలో కివీస్ స్కోరు వంద దాటింది. రెండో వికెట్‌కు 74 పరుగులు జోడించాక కెప్టెన్ వెనుదిరిగాడు. ప్లంకెట్ వేసిన గుడ్‌లెంగ్త్ బంతి కేన్ బ్యాట్‌ను ముద్దాడుతూ వెళ్లి కీపర్ చేతిలో పడింది. మొదట అంపైర్ తిరస్కరించినా.. మోర్గాన్ రివ్యూ కోరి ఫలితం సాధించాడు. నడిపించే నాయకుడు త్వరగా పెవిలియన్ చేరడంతో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ తడబడింది. కాసేపటికే నికోల్స్ కూడా వెనుదిరిగాడు. సీనియర్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్ (15) అంపైర్ తప్పుడు నిర్ణయానికి పెవిలియన్ బాటపట్టాల్సి వచ్చింది. రివ్యూ లేకపోవడంతో కివీస్ చేసేదేమిలేకపోయింది. ఈ దశలో నీషమ్ (19), లాథమ్ కాసేపు పోరాడారు. పరిస్థితిని చక్కదిద్దుతున్న తరుణంలో ప్లంకెట్ మరోసారి దెబ్బ కొట్టాడు. నీషమ్‌ను ఔట్ చేసి ఐదో వికెట్‌కు నమోదైన 46 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. గ్రాండ్‌హోమ్ (16) పెద్దగా ఆకట్టుకోలేకపోగా.. అర్ధసెంచరీకి 3 పరుగుల దూరంలో లాథమ్ ఔటయ్యాడు. న్యూజిలాండ్ చివరి 10 ఓవర్లలో 62 పరుగులు చేసి 3 వికెట్లు కోల్పోయింది.

### ప్రైజ్ మనీ (కోట్లలో)

విజేత : 27.38

రన్నరప్ : 13.7

సెమీస్‌లో ఓడిన జట్లకు : 5.47

**3** ఆతిథ్య జట్టు కప్పు అందుకోవడం ఇది మూడోసారి. 2011లో టోర్నీకి ఆతిథ్యమిచ్చిన భారత్ ఈ సంప్రదాయానికి తెరతీస్తే.. ఆ తర్వాత ఆస్ట్రేలియా, తాజాగా ఇంగ్లండ్ ఆ ఘనత సాధించాయి.


**3** గత మూడు వరల్డ్‌కప్‌ల్లో ఛేజింగ్ చేసిన జట్లే గెలుపొందాయి. 2011లో శ్రీలంకపై భారత్ రెండో బ్యాటింగ్ చేసి నెగ్గగా.. 2015లో న్యూజిలాండ్‌పై ఆస్ట్రేలియా అలాగే గెలిచింది. తాజాగా కివీస్‌పై ఇంగ్లండ్ కూడా ఛేజింగ్‌లోనే విజయం సాధించింది.

### స్కోరు బోర్డు

**న్యూజిలాండ్:** గప్టిల్ (ఎల్బీ) వోక్స్ 19, నికోల్స్ (బి) ప్లంకెట్ 55, విలియమ్సన్ (సి) బట్లర్ (బి) ప్లంకెట్ 30, టేలర్ (ఎల్బీ) వుడ్ 15, లాథమ్ (సి) (సబ్) విన్స్ (బి) వోక్స్ 47, నీషమ్ (సి) రూట్ (బి) ప్లంకెట్ 19, గ్రాండ్‌హోమ్ (సి) (సబ్) విన్స్ (బి) వోక్స్ 16, శాంట్నర్ (నాటౌట్) 5, హెన్రీ (బి) ఆర్చర్ 4, బౌల్ట్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు:** 30, **మొత్తం:** 50 ఓవర్లలో 241/8. **వికెట్ల పతనం:** 1–29, 2–103, 3–118, 4–141, 5–173, 6–219, 7–232, 8–240, **బౌలింగ్:** వోక్స్ 9–0–37–3, ఆర్చర్ 10–0–42–1, ప్లంకెట్ 10–0–42–3, వుడ్ 10–1–49–1, రషీద్ 8–0–39–0, స్టోక్స్ 3–0–20–0.

**ఇంగ్లండ్:** రాయ్ (సి) లాథమ్ (బి) హెన్రీ 17, బెయిర్ స్టో (బి) ఫెర్గూసన్ 36, రూట్ (సి) లాథమ్ (బి) గ్రాండ్‌హోమ్ 7, మోర్గాన్ (సి) ఫెర్గూసన్ (బి) నీషమ్ 9, స్టోక్స్ (నాటౌట్) 84, బట్లర్ (సి) (సబ్) సౌథీ (బి) ఫెర్గూసన్ 59, వోక్స్ (సి) లాథమ్ (బి) ఫెర్గూసన్ 2, ప్లంకెట్ (సి) బౌల్ట్ (బి) నీషమ్ 10, ఆర్చర్ (బి) నీషమ్ 0, రషీద్ (రనౌట్) 0, వుడ్ (రనౌట్) 0, **ఎక్స్‌ట్రాలు:** 17, **మొత్తం:** 50 ఓవర్లలో 241 ఆలౌట్. **వికెట్ల పతనం:** 1–28, 2–59, 3–71, 4–86, 5–196, 6–203, 7–220, 8–227, 9–240, 10–241, **బౌలింగ్:** బౌల్ట్ 10–0–67–0, హెన్రీ 10–2–40–1, గ్రాండ్‌హోమ్ 10–2–25–1, ఫెర్గూసన్ 10–0–50–3, నీషమ్ 7–0–43–3, శాంట్నర్ 3–0–11–0.

## హిమా దాస్‌కు మరో స్వర్ణం


హిమా దాస్

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ టోర్నీల్లో వరుస స్వర్ణాలతో భారత స్టార్ స్ప్రింటర్ హిమా దాస్ చాటుతున్నది. చెక్‌రిపబ్లిక్‌లో జరుగుతున్న క్లాడ్నో స్మారక అథ్లెటిక్స్ మీట్ మహిళల 200మీటర్ల విభాగంలో హిమ స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది. 23.43 సెకన్లలో లక్ష్యాన్ని ఛేదించి అగ్రస్థానంలో నిలిచి అదరగొట్టింది. 11రోజుల వ్యవధిలో ఆమెకు ఇది మూడో పసిడి పతకం కావడం విశేషం. ఈనెల 2న పోలండ్‌లో జరిగిన పోజ్నన్ అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్‌లో, ఈనెల 7న కుంటో అథ్లెటిక్స్ మీట్‌లో చెరో స్వర్ణాన్ని హిమ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. క్లాడ్నో మీట్.. పురుషుల 400మీటర్ల పోటీలో మహమ్మద్ అనాస్ కూడా స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. 45.21 సెకన్లలో లక్ష్యాన్ని దాటి తన పేరిట ఉన్న జాతీయ రికార్డును మెరుగుపరుచుకున్నాడు.

## వినేశ్ పసిడి పట్టు



**ఇస్తాంబుల్:** యాసర్ డోగు అంతర్జాతీయ టోర్నీలో భారత రెజ్లర్ల అద్భుత ప్రదర్శన దిగ్విజయంగా కొనసాగుతున్నది. మహిళల 53కిలోల విభాగంలో బరిలోకి దిగిన స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ స్వర్ణ పతకంతో మెరిసింది. ఫైనల్లో వినేశ 9–5 తేడాతో ఎక్టరీనా పోల్సెచుక్(రష్యా)పై విజయం సాధించింది. సీమా(50కి), మంజు (59కి) తర్వాత భారత్‌కు పసిడి అందించిన మూడో రెజ్లర్‌గా వినేశ్ నిలిచింది. పురుషుల 61కిలోల కేటగిరీ ఫైనల్లో రాహుల్ అవారె 4–1తో మునిర్ అక్టస్(టర్కీ)పై విజయంతో స్వర్ణం దక్కించుకున్నాడు. ఇదే విభాగంలో ఉత్కర్ష్ కాలెకు కాంస్యం దక్కింది. దీపక్ పూనియా(86కి)కు రజతం, సుమిత్(125కి)కు కాంస్య కైవసం చేసుకున్నారు.


## భారత్‌కు ఆరు పతకాలు

**న్యూఢిల్లీ:** జర్మనీ వేదికగా జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచకప్‌లో భారత షూటర్లు అదరగొడుతున్నారు. ఆదివారం జరిగిన వేర్వేరు పోటీల్లో రెండు స్వర్ణాలు సహా ఆరు పతకాలను కొల్లగొట్టారు. పురుషుల 50మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో గౌరవ్ రానా(553), అర్జున్ చీమా(551) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. గౌరవ్, అర్జున్, విజయ్‌వీర్‌తో కూడిన భారత త్రయం 1651 స్కోరుతో పసిడిని తమ ఖాతాలో వేసుకుంది. మహిళల 50మీటర్ల పిస్టల్ ఈవెంటులో ప్రియా రాఘవ్(535), విభూతి భాటియా(531) రజత, కాంస్యాలు సాధించారు. హర్షద నితావెతో కలిసి ప్రియ, విభూతి టీమ్ విభాగంలో రజతం సొంతం చేసుకున్నారు.


## నొవాక్ నవ్వాడు..

**వింబుల్డన్‌ను కైవసం చేసుకున్న జొకోవిచ్**

**ఉత్కంఠపోరులో ఫెదరర్‌పై సెర్బియా వీరుడి విజయం**


జొకోవిచ్

ఐదు సెట్లు.. ఐదు గంటలు.. మూడు టై బ్రేకర్లు... క్షణక్షణం ఉత్కంఠ.. ప్రతీ నిమిషానికి చేతులు మారిన ఆధిక్యం.. కనురెప్ప వేస్తే ఆ సమయంలోనే ఏం జరుగుతుందోననే అభిమానుల ఉత్సుకత... ఇలాంటి ఉద్విగ్నభరిత క్షణాల మధ్య జరిగిన వింబుల్డన్ ఫైనల్‌లో చివరికి సెర్బియా వీరుడు నొవాక్ జకోవిచ్ నవ్వాడు. స్విస్‌స్టార్ ఫెదరర్‌పై సుదీర్ఘ పోరాటం తర్వాత దక్కిన విజయంతో విజయ గర్జన చేశాడు. చివరిదాకా అలుపెరుగని పోరాటం చేసిన స్విస్‌స్టార్ ఫెదరర్ పరాజయం చెందాడనే కంటే, కాస్త వెనుకబడ్డాడనే మాటే సరిగా ఉంటుందేమో. ఎందుకంటే పాయింట్ల పరంగా ఎక్కువ సాధించింది రోజరే. మొత్తంగా జొకోవిచ్‌కు ఇది 16వ గ్లాండ్‌స్లామ్ టైటిల్ కాగా... ఐదో వింబుల్డన్ ట్రోఫీ.


ఫెదరర్

**లండన్:**

సమవుజ్జీల పోరు అనే ఉపమానానికి సరైన నిర్వచనంలా... ఉత్కంఠపోరు అనే మాటకు అసలైన అర్థం చెబుతూ ఆదివారం జరిగిన వింబుల్డన్ పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో సెర్బియా వీరుడు నొవాక్ జకోవిచ్‌నే విజయం వరించింది. తొలి క్షణం నుంచి చివరి క్షణం దాకా నువ్వా–నేనా అన్నట్టు సాగిన పోరాటంలో స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్‌పై 7–6(7/5), 1–6, 7–6(7/4), 4–6, 13–12(7/3) తేడాతో జొకోవిచ్ గెలిచాడు. 4గంటల55 నిమిషాల పాటు ఐదు సెట్లుగా సాగిన మ్యాచ్‌లో టైబ్రేకర్ల రూపంలో మూడు సెట్లను గెలిచి సెర్బియా స్టార్ ట్రోఫీని ముద్దాడాడు. ఓవరాల్‌గా జొకోవిచ్‌కు ఇది 16వ గ్రాండ్‌స్లామ్ గెలుపు కాగా.. ఐదో వింబుల్డన్ ట్రోఫీ. నంబర్ వన్ సీడ్‌గా బరిలోకి దిగిన జొకో చెమటోడ్చి పోరాడి టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు.

### తొలి నుంచీ ఉత్కంఠే..

తొలి సెట్‌లో మొదటి గేమ్‌ను ఫెదరర్ గెలిచాక.. రెండోదాన్ని జొకోవిచ్ సొంతం చేసుకున్నాడు. ఇక అప్పటి నుంచి ఎవరి సర్వీస్‌ను వారు కాపాడుకోవడంతో తొలి సెట్ టైబ్రేకర్‌కు వెళ్లింది. ఆ తరుణంలో ఆధిపత్యం ప్రదర్శించిన సెర్బియా స్టార్ మొదటి సెట్‌ను సొంతం చేసుకున్నాడు. ఇక రెండోసెట్‌లో అనూహ్యంగా పుంజుకున్న ఫెదరర్ ఓ దశలో 4–0తో నిలిచి క్లీన్‌స్వీప్ చేస్తాడనుకున్న సమయంలో జొకో ఓ గేమ్ నెగ్గాడు. ఆ తర్వాత ఊపు కనబరిచిన రోజర్ ఎక్స్‌ప్రెస్ రెండో సెట్‌ను 6–1తో గెలిచి సత్తా చాటాడు. ఆ తర్వాత మళ్లీ షరామామూలుగా మూడో సెట్‌లో ఎవరి సర్వీస్‌లో వారు గేమ్స్ నెగ్గుకుంటూ పోవడంతో టైబ్రేకర్ ఎదురుగా... జొకొవిచ్ 7–4తో గెలిచాడు. నాలుగో సెట్‌లో ఓ దశలో 2–2 ఉన్న సమయంలో విజృంభించిన ఫెదరర్ 5–2తో ముందుకు దూసుకెళ్లాడు. చివరకు సెట్‌ను 6–4తో గెలిచి ముందడుగేశాడు. ఇక నిర్ణయాత్మకమైన చివరి సెట్ క్షణక్షణం ఉత్కంఠగా సాగింది. ఇద్దరు టెన్నిస్ స్టార్లు నువ్వా–నేనా అన్నట్టు తలపడ్డారు. మొదటి, మూడో సెట్‌ను తలపిస్తూ సమానంగా ముందుకు సాగారు. ఓ దశలో జొకో సర్వీస్‌ను బ్రేక్ చేసి.. 8–7తో నిలిచినా మ్యాచ్‌ను చేజిక్కించుకోవడంలో ఫెదరర్ విఫలమయ్యాడు. చివరికి 12–12తో సమానం కాగా ఎదురైన టైబ్రేకర్‌లో 7–3తో ఐదో సెట్‌ను కైవసం చేసుకున్న జొకో విజయం సాధించాడు.

### ఫెదరర్‌కే ఎక్కువ పాయింట్లు

మ్యాచ్‌ను గెలిచింది జొకోవిచ్ అయిన పాయింట్లు మాత్రం ఫెదరరే ఎక్కువ సాధించాడు. ఫెదరర్ ఏకంగా 25 ఏస్‌లను సంధించగా.. జొకో 10మాత్రమే సాధించగలిగాడు. ఇక విన్నర్ల విషయంలోనూ 94తో స్విస్‌స్టార్ అదరగొట్టగా... సెర్బియా వీరుడు 54కే పరిమితమయ్యాడు. మ్యాచ్ మొత్తంగా ఫెదరర్ 218.. జొకో 204 పాయింట్లు సాధించారు.



## మూడేండ్లలో సియట్ రూ.3,500 కోట్ల పెట్టుబడి

**న్యూఢిల్లీ, జూలై 14:** ప్రముఖ టైర్ల తయారీ సంస్థ సియట్ భారీ పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమైంది. వచ్చే మూడేండ్లకాలంలో ఉత్పత్తి సామర్థ్యాన్ని రెట్టింపు చేయడానికి రూ.3,500 కోట్ల మేర పెట్టుబడి పెట్టనున్నట్లు 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ విడుదల చేసిన వార్షిక నివేదికలో వెల్లడించింది. ఈ విషయాన్ని వాటాదారులకు చేరవేసింది. గుజరాత్‌లో ఉన్న హలోల్ ప్లాంట్ విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయని, దీంతో కెపాసిటీ 9.6 లక్షలకు చేరుకోనున్నది. వీటితోపాటు రూ.2 వేల కోట్ల పెట్టుబడితో చెన్నై వద్ద ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో ప్రతియేటా 96 లక్షల ప్యాసింజర్ కార్ల టైర్లు ఉత్పత్తి కానున్నాయి. అలాగే నాగ్‌పూర్ వద్ద ఉన్న ద్విచక్ర వాహన టైర్ల ప్లాంట్ల సామర్థ్యాన్ని 170 లక్షలకు పెంచబోతున్నది. ఈ విస్తరణ పనులు వచ్చే మార్చి నాటికి పూర్తికానున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం సంస్థకు ముంబై, నాసిక్, హలోల్, నాగ్‌పూర్‌ల టైర్ల ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. భవిష్యత్ అవసరాల నిమిత్తం ఈ ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచుతున్నట్లు కంపెనీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

## అంధుల కోసం యాప్..

కరెన్సీ నోట్ల గుర్తింపునకు తెస్తున్న ఆర్బీఐ



**న్యూఢిల్లీ, జూలై 14:** అంధులు, దృష్టి లోపాలున్నవారు కరెన్సీ నోట్లను గుర్తించడానికి వీలుగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఓ మొబైల్ అప్లికేషన్ (యాప్)ను తీసుకురానున్నది. ఇప్పటికీ ద్రవ్య వ్యవస్థలో నగదుకే ప్రాధాన్యత ఉండటంతో చూపు లేని వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగరాదని ఆర్బీఐ సంకల్పించింది. ఇందులో భాగంగానే మొబైల్ అప్లికేషన్ రూపకర్తల కోసం అన్వేషిస్తున్నామని తెలిపింది. ప్రస్తుతం చలామణిలో రూ.10, 20, 50, 100, 200, 500, 2,000 నోట్లున్న విషయం తెలిసిందే. వీటికితోడు కేంద్రం జారీచేసే రూపాయి నోటు కూడా ఉన్నది. నిజానికి పాత పెద్ద నోట్ల రద్దుతో నగదు లావాదేవీలు పడిపోయి.. డిజిటల్ లావాదేవీలు ఊపందుకున్నాయి. అయితే నెమ్మదిగా మళ్లీ వ్యవస్థలోకి నోట్ల రాక పెరుగడం, డిజిటల్ లావాదేవీలు తగ్గడం జరిగింది. ఫలితంగా అంధుల కోసం, వారి నగదు లావాదేవీల సహాయార్థం ఆర్బీఐ మొబైల్ అప్లికేషన్‌పై దృష్టి సారించింది. ఎప్పట్నుంచో ఈ ప్రతిపాదనను సెంట్రల్ బ్యాంక్ వినిపిస్తూనే ఉన్నా.. బిడ్డర్ల నుంచి అంతగా ఆసక్తి వ్యక్తం కావడం లేదు. అయినా కొత్త నోట్లను గుర్తించేందుకు ఆర్బీఐ వివిధ చర్యలు తీసుకుంటూనే ఉన్నది. ప్రస్తుత నోట్లకు ఇరు వైపులా కొన్ని గీతలను పెట్టిన సంగతి విదితమే. రూ.100, 200, 500, 2,000 నోట్లపై ఈ గీతల సంఖ్య ఆధారంగా ఆ నోటు విలువను కనుగొనేలా ఏర్పాట్లు చేసింది. చేతి స్పర్శతో ఆ గీతలను గుర్తించేలా రూపొందించింది. మరింత మెరుగైన సాంకేతికత కోసం మొబైల్ అప్లికేషన్‌కు ప్రయత్నిస్తున్నది. మొ బైల్ కెమెరా ఎదుట కరెన్సీ నోటును పెట్టి ఫొటో తీయగానే అందులోని యాప్ సా యంతో ఆ నోటు ఎంతో వినిపించేలా, లే దంటే అంధులకు అర్థమయ్యే రీతిలో వివరించే ఏర్పాటుండాలని ఆర్బీఐ కోరుకుంటున్నది.

## సంక్షోభంలో డీహెచ్‌ఎఫ్‌ఎల్!

DHFL Changing Rules Changing Lives

- భయంకర పరిస్థితులపై సంస్థ ఆందోళన
- మనుగడే ప్రశ్నార్థకమన్న సంకేతాలు
- దిగజారుతున్న వ్యాపారం.. పెరుగుతున్న నష్టాలు

**న్యూఢిల్లీ, జూలై 14:** ఆర్థిక సంక్షోభం అంచున దివాన్ హౌజింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (డీహెచ్‌ఎఫ్‌ఎల్) నిలబడింది. స్వయంగా సంస్థ హెచ్చరికలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి మరి. ప్రస్తుతం దేశంలోని అతిపెద్ద హౌజింగ్ ఫైనాన్స్ కంపెనీల్లో డీహెచ్‌ఎఫ్‌ఎల్ కూడా ఒకటిగా ఉన్నది. అయితే కొనసాగుతున్న ఆర్థిక ఒత్తిడి, నిధుల సమీకరణకు సన్నగిల్లిన అవకాశాల మధ్య సంస్థ మనుగడే ప్రశ్నార్థకంగా ఉందని డీహెచ్‌ఎఫ్‌ఎల్ సంస్థే అంటుండటం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరం (2018-19) చివరి త్రైమాసికం (జనవరి-మార్చి)లో ఏకంగా రూ.2,223 కోట్ల నికర నష్టాన్ని శనివారం సంస్థ చూపిన విషయం తెలిసిందే. పెరిగిన మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ), తగ్గిన రుణాల పంపిణీ.. సంస్థ నష్టాలను విపరీతంగా పెంచేశాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2017-18) ఇదే వ్యవధిలో సంస్థ రూ.134 కోట్ల లాభాన్ని అందుకోవడం గమనార్హం. మొత్తం 2018-19లో సంస్థ నష్టం రూ.1,036 కోట్లుగా ఉండగా, 2017-18లో ఇది రూ.1,240 కోట్ల లాభంగా ఉన్నది. ఈ పరిణామం సంస్థ ముందుకు సాగడంపై అనుమానాల్ని రేకెత్తిస్తున్నదని, ఇటువంటి పరిస్థితుల్లో సంస్థ కొనసాగడం ఇక కష్టమేనన్న అభిప్రాయాన్ని ఈ సందర్భంగా డీహెచ్‌ఎఫ్‌ఎల్ వ్యక్తం చేయడం గమనార్హం.

**రూ.28 కోట్ల వడ్డీ చెల్లింపుల్లో విఫలం**

మరోవైపు నాన్-కన్వర్టబుల్ డిబెంచర్లపై రూ.28.58 కోట్ల వడ్డీని చెల్లించడంలో డీహెచ్‌ఎఫ్‌ఎల్ విఫలమైంది. ఈ నెల 6, 8 తేదీల్లోగానే చెల్లించాల్సి ఉందని, ఇంకా జరుపలేదని సంస్థ స్పష్టం చేసింది. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు రుణాల పునర్ వ్యవస్థీకరణపై బ్యాంకర్లతో చర్చిస్తున్నామని సంస్థ ఈ సందర్భంగా తెలియజేసింది. రిటైల్, హోల్‌సేల్ పోర్ట్‌ఫోలియోల అమ్మకంపైనా చర్చలు జరిగాయని వివరించింది. కాగా, మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్‌కు చెందిన ఐసీఆర్‌ఏ, స్టాండర్డ్ అండ్ పూర్స్‌కు చెందిన క్రిసిల్.. డీహెచ్‌ఎఫ్‌ఎల్ కమర్షియల్ పేపర్ రేటింగ్‌ను గత నెల తగ్గించిన విషయం తెలిసిందే.

### జీడీపీ దారెటు?



ఓ వైపు వచ్చే ఐదేండ్లలో దేశ జీడీపీ స్థాయిని ప్రస్తుతంతో పోల్చితే రెట్టింపు చేసి 5 లక్షల కోట్ల డాలర్లకు తీసుకెళ్లాలని కేంద్ర ప్రభుత్వం కలలు కంటుంటే.. మరోవైపు వరుస సంక్షోభాలు ఉన్న వృద్ధిరేటును కాస్తా దిగజారుస్తాయా? అన్న అనుమానాల్ని రేకెత్తిస్తున్నది. ఇప్పటికే ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ సంక్షోభం.. దేశీయ బ్యాంకింగేతర ఆర్థిక రంగాన్నేగాక.. స్థూల దేశీయోత్పత్తిని వణికిస్తున్నది. దీనికి డీహెచ్‌ఎఫ్‌ఎల్ సంక్షోభం తోడైతే.. దేశ జీడీపీ ఢమాలే. బ్యాంకింగ్ రంగం ఎలాగూ మొండి బకాయిలు, మోసాలతో సతమతమవుతున్నది. ఇప్పుడు బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల రంగం కూడా కుప్పకూలితే మోదీ సర్కారు ఆశలు అడియాసలేనన్న భయాలు నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, స్టాక్ మార్కెట్లూ ప్రభావితం అవుతాయని విశ్లేషిస్తున్నారు. పైగా భారీ సంస్థలు మూతబడితే లక్షల్లో ఉద్యోగులు ఉపాధిని కోల్పోతారని, అప్పుడు పెరిగే నిరుద్యోగం.. అటు ప్రభుత్వానికి, ఇటు దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త చిక్కుల్ని తెచ్చిపెట్టగలదని హెచ్చరిస్తున్నారు. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్, జెట్ ఎయిర్‌వేస్, ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ ఇలాంటి సంస్థలు అర్ధంతరంగా మూతబడటంతో ఉద్యోగులు ఏ స్థాయిలో రోడ్డున పడ్డారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

### వేధిస్తున్న నిధుల కొరత



ఎన్‌బీఎఫ్‌సీలను నిధుల కొరత వేధిస్తున్నది. మొండి బకాయిలు ప్రమాదకర స్థాయికి చేరిన నేపథ్యంలో బ్యాంకులు రుణ వితరణను భారీగా తగ్గించుకున్నాయి. ఇది ఎన్‌బీఎఫ్‌సీలను పెద్ద ఎత్తునే ప్రభావితం చేసింది. బ్యాంకింగ్ రంగ సంస్కరణ.. ఇతర రంగాలకు ఆర్థిక ఇబ్బందులను తెచ్చిపెడుతున్నది. ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో దేశ జీడీపీ 5.8 శాతానికి దిగజారడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. నిజానికి అటు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఇటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ).. ఎన్‌బీఎఫ్‌సీలకు కొత్త రుణాలను ఇవ్వాలని, ఇప్పటికే ఉన్న రుణాలను పునర్‌వ్యవస్థీకరించాలని సూచిస్తూనే ఉన్నాయి. అయినప్పటికీ ఎన్‌పీఏల భయంతో బ్యాంకర్లు మునుపటి స్థాయిలో రుణాలను ఇవ్వలేకపోతున్నాయి. దివాలా కోర్టుల్లో వేల కోట్ల రుణాలు తీసుకున్న సంస్థలుండటంతో కొత్త తలనొప్పులు అవసరమా? అన్న ధోరణి బ్యాంకర్లలో కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో పరిస్థితులు ఇలాగే కొనసాగితే దేశ వృద్ధిరేటు బలికాక తప్పదన్న ఆందోళన నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నది.

## రూ.6.3 లక్షల కోట్ల పెట్టుబడులు

- ఇంటింటికీ నల్లా పథకంతో నీరు, శానిటేషన్ రంగానికి ఊపు
- జేఎం ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషనల్

**న్యూఢిల్లీ, జూలై 14:** వచ్చే ఐదేండ్లలో ఇంటింటికీ నల్లా కనెక్షన్ (నల్ సే జల్) పథకంతో నీరు, శానిటేషన్ రంగాల్లోకి రూ.6.3 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశాలున్నాయని జేఎం ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషనల్ నివేదిక ఒకటి చెబుతున్నది. 2024కల్లా ప్రతీ ఇంటికీ నల్లాల ద్వారా నీరందించే లక్ష్యాన్ని మోదీ సర్కారు తాజా బడ్జెట్‌లో నిర్దేశించుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ పథకం.. ఆయా రంగాలకు కొత్త జోష్‌నివ్వగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. పైపులు, ఈపీసీ, వాటర్ ట్రీట్‌మెంట్ పంపులు, వాల్వ్‌లు, సిమెంట్ తదితర రంగాలకు పెట్టుబడులు పోటెత్తుతాయన్న అంచనాను వేసింది. 'మా అధ్యయనంలో వాటర్, శానిటేషన్ రంగాలపై జల విధాన నిపుణులు వెల్లడించిన అభిప్రాయాల ప్రకారం ఒక్కో నల్లా కనెక్షన్‌కు దాదాపు రూ.8,000-9,000 ఖర్చవుతుందని అంచనా. ఇలా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు కనీసం రూ.5.6 లక్షల కోట్ల నుంచి 6.3 లక్షల కోట్ల వ్యయం అయ్యే వీలున్నది' అని జేఎం ఫైనాన్షియల్ తెలిపింది. 2013-14 నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు చేసిన వ్యయానికి ఇది రెట్టింపు కావడం గమనార్హం. కాగా, ఉత్తరాఖండ్ వంటి పర్వత ప్రాంత రాష్ర్టాల్లో ఒక్కో నల్లా కనెక్షన్ వ్యయం రూ.18,000గా ఉండొచ్చని జేఎం ఫైనాన్షియల్ అంచనా వేసింది. అలాగే కర్నాటకలో ఈ ఖర్చు రూ.3,000గానే ఉండొచ్చన్నది. అయితే సగటున మాత్రం రూ.8,000-9,000లుగా ఉండే వీలున్నది.

## ఇండిగో అల్లకల్లోలం

తారాస్థాయికి ప్రమోటర్ల విభేదాలు

పరస్పర ఆరోపణలపై సెబీ, కేంద్రం దృష్టి



**న్యూఢిల్లీ, జూలై 14:**

దేశీయ ప్రైవేట్ రంగ విమానయాన దిగ్గజం ఇండిగో ప్రమోటర్ల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరు వైపుల నుంచి వస్తున్న ఆరోపణలపై మార్కెట్ రెగ్యులేటర్ సెబీ దృష్టి సారించింది. సెబీతోపాటు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కూడా కన్నేసింది. లోతుగా ఈ ఆరోపణలపై విచారణను మొదలుపెట్టాయి. పాలనాపరమైన లోపాలు, నిబంధనల ఉల్లంఘన వంటి వాటిపై ఆరా తీస్తున్నాయి. ఇండిగో ప్రమోటర్లు, మిత్రులూ కూడా అయిన రాహుల్ భాటియా, రాకేశ్ గంగ్వాల్ మధ్య ఇప్పుడు పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్నది. ఎప్పట్నుంచో వీరిరువురి నడుమ కోల్డ్‌వార్ నడుస్తుండగా, ఇటీవలే అది బయటపడింది. పాన్ షాప్ కన్నా అధ్వాన్నంగా ఇండిగో నిర్వహణ ఉందని గంగ్వాల్ బహిరంగ విమర్శలు చేయడం, సంస్థ పరిపాలనా లోపాలు, నిబంధనల ఉల్లంఘనపై జోక్యం చేసుకోవాలంటూ సెబీని కోరడం తెలిసిందే. 2015లో ఇండిగో షేర్లు స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ అవగా, సెబీ నిబంధనలను సంస్థ ఉల్లంఘించిందన్న ఫిర్యాదు గంగ్వాల్ నుంచి వచ్చింది. ప్రస్తుతం ఇండిగోలో భాటియా నేతృత్వంలోని ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌కు మెజారిటీ వాటా ఉన్నది. ఈ క్రమంలోనే ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్ (ఐజీఈ) గ్రూప్ లావాదేవీలకు సంబంధించి గంగ్వాల్ చేసిన పలు వ్యాఖ్యలను ఇటు సెబీ, అటు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. సెబీ, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఇతర రెగ్యులేటర్లకు గంగ్వాల్ లేఖ నేపథ్యంలో ఈ నెల 19లోగా ఆరోపణలపై స్పందించాలంటూ ఇండిగోకు నోటీసులు అందాయి. బోర్డు సభ్యులతోపాటు ఇతర ఉన్నతాధికారులకూ సెబీ సమన్లు వచ్చే వీలుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

**గంగ్వాల్ స్వార్థపరుడు: ఐజీఈ**

ఇండిగో ఆరంభం నుంచీ ప్రమోటర్ల గ్రూపుల మధ్య పారదర్శకత ఎప్పుడూ లోపించలేదని ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్ (ఐజీఈ) తెలిపింది. నిజానికి గంగ్వాల్ ఓ పరిమిత స్వభావి అని, స్వార్థపరుడంటూ పేర్కొన్నది. గంగ్వాల్ ఆరోపణలను తిప్పికొట్టడానికి గడిచిన వారం రోజుల్లో ఐజీఈ మూడు ప్రకటనలను జారీ చేయడం గమనార్హం. ఈ సందర్భంగా సంస్థ ఇబ్బందుల్లో ఉన్నా.. నయాపైస తీసేవాడు కాదని, అవసరమైతే ఆస్తుల్ని అమ్మేద్దాం అన్న ప్రతిపాదనలు చేసేవాడని చెప్పుకొచ్చింది. చివరకు కార్పొరేట్ గవర్నెన్స్ గురించి వివాదాలను సృష్టించాడని తెలియజేసింది.

**కార్పొరేట్ల పద ప్రయోగాలు**

ఇండిగో ప్రమోటర్ల మధ్య మాటల యుద్ధం తీవ్ర స్థాయిలో నడుస్తున్నది. సంస్థ నిర్వహణ పాన్ దుకాణం కంటే దారుణంగా ఉందని గంగ్వాల్ దుయ్యబట్టిన విషయం తెలిసిందే. ఇటీవలికాలంలో చాలా సంస్థల్లో ప్రమోటర్ల మధ్య విభేదాలు బయటపడగా, అప్పుడు ఆయ ప్రమోటర్లు రకరకాల పద ప్రయోగాలను చేశారు. గదిలో ఏనుగు, పేపర్లకే పరిమితం, కోటరీ, వ్యక్తిగత మాన్యం అన్న ఎన్నో పదాలు దొర్లాయి. వీటన్నిటినీ దర్యాప్తు సంస్థలు తమ కేసు ఫైలింగ్‌లో పేర్కొంటున్నాయిప్పుడు. తీవ్ర మోసాల దర్యాప్తు కార్యాలయం (ఎస్‌ఎఫ్‌ఐవో).. ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ కుంభకోణంలో ఇలాంటి పదాలను ప్రస్తావించడం విశేషం.



### ఉత్పత్తిని పెంచుకున్న టాటా స్టీల్

**న్యూఢిల్లీ, జూలై 14:** దేశీయ స్టీల్ దిగ్గజం టాటా స్టీల్ ఉత్పత్తి గణనీయంగా పెంచుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ 76.10 లక్షల టన్నుల స్టీల్‌ను ఉత్పత్తి చేసింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో ఉత్పత్తి చేసిన 69.70 లక్షల టన్నులతో పోలిస్తే 9.18 శాతం పెరిగినట్లు సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. వీటిలో ఒక టాటా స్టీల్ 43.70 లక్షల టన్నులను ఉత్పత్తి చేయగా, టాటా స్టీల్ యూరప్ విభాగం 26.60 లక్షల టన్నులు, టాటా స్టీల్ సౌత్ ఈస్ట్ ఆసియా 5.8 లక్షల టన్నులను ప్రొడ్యూస్ చేసింది. గత త్రైమాసికంలో సంస్థ 38.70 లక్షల టన్నుల స్టీల్‌ను విక్రయించింది. అలాగే యూరప్‌లో 22 లక్షల టన్నులు, ఆగ్నేయా ఆసియా దేశాల్లో 6 లక్షల టన్నుల విక్రయాలు జరిపింది. ధరలు స్వల్పంగా పెరుగడం, సరఫరాలో ఇబ్బందులు తలెత్తినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

## ఎల్ఐసీ దూకుడు

జూన్‌లో రూ.26,030 కోట్లు వసూలు చేసిన సంస్థ

LIC భారతీయ జీవన బీమా నిగమ LIFE INSURANCE CORPORATION OF INDIA

**న్యూఢిల్లీ, జూలై 14:** ప్రభుత్వరంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ నూతన ప్రీమియం వసూళ్ళలో దూసుకుపోతున్నది. గడిచిన నెలలో ఎల్ఐసీతోపాటు ఇతర సంస్థలు కలిపి రూ.32,241 కోట్ల నూతన ప్రీమియం వసూళ్లను సాధించాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో 24 సంస్థలు వసూలు చేసిన రూ.16,611.57 కోట్లతో పోలిస్తే 94 శాతం అధికమయ్యాయని బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ తెలిపింది. దేశంలో అతిపెద్ద సంస్థయైన ఎల్ఐసీ..నూతన ప్రీమియం వసూళ్లు రెండింతలు పెరిగి రూ.26,030.16 కోట్లుగా నమోదయ్యాయి. 2018 సంవత్సరం ఇదే నెలలో సంస్థ రూ.11,167.82 కోట్లను వసూలు చేసింది. గత నెలలో వసూలైనదాంట్లో ఎల్ఐసీవే 74 శాతం కాగా, మిగతా 26 శాతం 23 ప్రైవేట్ రంగ సంస్థలవి. 13.32 లక్షల పాలసీలను విక్రయించడం ద్వారా కేవలం ఎల్ఐసీ కేవలం ఒకే నెలలో రూ.25 వేల కోట్లను వసూలు చేసి రికార్డు సృష్టించింది. ప్రైవేట్ రంగానికి చెందిన 23 సంస్థలు కలిపి రూ.6,211.17 కోట్లను మాత్రమే వసూలు చేశాయి. అంతక్రితం ఏడాది వసూలైన రూ.5,443.75 కోట్లతో పోలిస్తే 14.10 శాతం అధికమని ఐఆర్‌డీఏఐ తెలిపింది.

## కార్పొరేట్ల ఫలితాలు కీలకం

- స్థూల ఆర్థికాంశాలు, క్రూడాయిల్, రూపాయి కూడా..
- స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేయనున్న అంశాలు

**న్యూఢిల్లీ, జూలై 14:**

గతవారంలో భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్లకు ఈవారంలో దేశీయ స్థూల ఆర్థికాంశాలతోపాటు కార్పొరేట్ల ఫలితాలు దిశానిర్దేశం చేయనున్నాయి. కార్పొరేట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, విప్రో, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లతోపాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికపు వృద్ధిరేటు గణాంకాలు కూడా ఈ వారంలోనే విడుదలకానుండటంతో మదుపరులు వీటిపై ప్రత్యేక దృష్టి సారించే అవకాశాలున్నాయని మార్కెట్ విశ్లేషకులు అంచనావేస్తున్నారు. వాణిజ్యానికి సంబంధించిన పరిణామాలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి కదలికలు, ఇంధన ధరల ఆధారంగా మదుపరులు ఆచితూచి అడుగులు వేసే అవకాశాలున్నాయి. కార్పొరేట్ల ఆర్థిక ఫలితాలు నిరుత్సాహకరంగా ఉండటం, సమీక్షకాలంలో మెరుగైన వృద్ధికి కీలకంగా మారిన ఫలితాలు అంతంత మాత్రంగానే ఉండటంతో సూచీలు తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొనేందుకు ఆస్కారం ఉన్నదని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. ఐటీ దిగ్గజాలైన ఇన్ఫోసిస్, టీసీఎస్‌లు అంచనాలకు తగ్గట్టుగానే ఆర్థిక ఫలితాలను ప్రకటించడం కొంతలో కొంత ఊరటనిచ్చే అంశాలు. గత శుక్రవారం మార్కెట్ ముగిసిన తర్వాత విడుదలైన ఇన్ఫోసిస్ ఫలితాలు 5.3 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, ఈ ఏడాది ఆదాయంలో రెండంకెల వృద్ధిని నమోదు చేసుకోనున్నదని అవుట్‌లుక్‌లో పేర్కొంది. గతవారంలో విడుదలైన రిటైల్ ద్రవ్యోల్బణం ఆరు నెలల కనిష్ఠ స్థాయికి చేరుకోగా, పారిశ్రామిక ప్రగతి నిరాశాజనకంగా ఉండటం ఈవారం మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణ గణాంకాలు మాత్రం సోమవారం విడుదల కానున్నాయి. మే నెలలో టోకు ద్రవ్యోల్బణం 22 నెలల కనిష్ఠ స్థాయి 2.45 శాతానికి పడిపోయిన విషయం తెలిసిందే. ఆహార పదార్థాల ధరలు శాంతించడం, చమురు, విద్యుత్ చార్జీలు తగ్గుముకం పట్టడం కూడా ఇందుకు కలిసొచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లు కూడా కీలక పాత్ర పోషించనున్నాయని, ముఖ్యంగా అమెరికా ఉత్పత్తులపై భారత్ అధికంగా సుంకాలు విధించడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బహిరంగంగా విమర్శించడం మార్కెట్లకు ఒత్తిడికి గురికావచ్చునని ఎపిక్ రీసర్చ్ సీఈవో ముస్తాఫా నదీమ్ తెలిపారు. శుక్రవారం మార్కెట్ ముగిసిన తర్వాత స్థూల ఆర్థికాంశాల డాటా విడుదల కానున్నది. గడిచిన వారంలో బీఎస్ఈ సెన్సెక్స్ 777.16 పాయింట్లు తగ్గి 38,736.23లకు పడిపోగా, నిఫ్టీ 258.65 పాయింట్లు దిగువకు పడిపోయి 11,552.50 వద్ద ముగిసింది. జూన్‌లో అంతంత మాత్రంగా నమోదైన వార్షలు గడిచిన రెండు వారాలుగా భారీగా కురుస్తుండటంతో భారత ఆర్థిక వ్యవస్థకు ఇది సానుకూల అంశం.



**ఈ వారంలో 90 సంస్థల ఫలితాలు**

ఈవారంలో 90 కార్పొరేట్ సంస్థలు తమ ఆర్థిక ఫలితాలను విడుదల చేయబోతున్నాయి. వీటిలో రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యెస్ బ్యాంక్, విప్రో, మైండ్‌ట్రీ, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, ఆర్‌బీఎల్ బ్యాంక్, ఏసీసీ, కాల్గేట్ పామోలివ్, డాబర్ ఇండియా, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఐసీఐసీఐ లాంబర్డ్ జనరల్ ఇన్సూరెన్స్, బంధన్ బ్యాంక్ తమ ఫలితాలను విడుదల చేయబోతున్నాయి. మార్చి 31తో ముగిసిన త్రైమాసికంలో నమోదైన లాభాలతో పోలిస్తే ఆ తర్వాతి త్రైమాసికంలో మందకొడి వృద్ధి తప్పదని, వీటికితోడు నిధుల లభ్యత క్షీణించడం కూడా మార్కెట్‌కు కలిసిరాని అంశాలని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.

**టెక్నికల్ అవుట్‌లుక్**


గతవారంలో భారీగా పతనమైన నిఫ్టీ..ఈ వారంలో 11,650 పాయింట్ల నుంచి 11,550 పాయింట్ల మధ్య కదలాడే అవకాశాలున్నాయి. గత నాలుగు సెషన్లలో సూచీ 200 పాయింట్లకు పైగా పతనం చెందిన విషయం తెలిసిందే.

### ఇంధన ధరలు పైపైకి..

అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు భగ్గుమంటున్నాయి. జూలై 12తో ముగిసిన వారంలో బ్రెంట్ క్రూడాయిల్ ధరలు ఐదు శాతం పెరిగి ఆరువారాల గరిష్ఠ స్థాయికి చేరకున్నాయి. బ్యారెల్ ధర 66.72 డాలర్లు పలికింది. అమెరికా-ఇరాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితులు, చమురు ఉత్పత్తిని తగ్గించుకోనున్నట్లు ఒపెక్ దేశాల కుటమి ప్రకటించడం కూడా ధరలు ఎగబాకడానికి పరోక్షంగా దోహదం చేశాయి. జూలై 5తో ముగిసిన వారంలో ఫారెక్స్ రిజర్వులు రికార్డు స్థాయి 429.91 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.

## ఐదేండ్లలో రూ.3.25 లక్షల కోట్లు

- డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా సేకరించనున్న కేంద్రం



**న్యూఢిల్లీ, జూలై 14:** అంతకంతకు పెరుగుతున్న ద్రవ్యలోటును కట్టడిచేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆపసోపాలు పడుతున్నది. వచ్చే ఐదేండ్లకాలంలో ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాలను విక్రయించడం ద్వారా 4700 కోట్ల డాలర్ల నిధులను సేకరించాలని కేంద్రం చూస్తున్నది. మన కరెన్సీలో ఇది రూ.3.25 లక్షల కోట్లకు పైమాటే. చిన్న స్థాయి సంస్థల్లో వాటాను 51 శాతం వరకు విక్రయించాలనుకుంటున్న కేంద్రం..అతిపెద్ద సంస్థల్లోనైతే ఈ వాటాను 40 శాతానికి తగ్గించాలనుకుంటున్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. గడిచిన రెండు దశాబ్దకాలంలో ఇంతటి భారీ స్థాయిలో వాటాలను విక్రయించడం ఇదే తొలిసారి కానున్నది. గతవారంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాలను విక్రయించడం ద్వారా రూ.75 వేల కోట్లను ఈ ఏడాది సేకరించనున్నట్లు ప్రకటించారు. ప్రైవేట్ పెట్టుబడులను ఆకట్టుకోవడానికి, ద్రవ్యలోటును నియంత్రించడానికి వాటాల విక్రయానికి పెద్దపీట వేస్తున్నది కేంద్రం. ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ గత ఐదేండ్లలో 40.92 బిలియన్ డాలర్ల నిధులను డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా సేకరించింది. 2009 నుంచి 2014 మధ్యకాలంలో పరిపాలించిన కాంగ్రెస్ హాయంలో సేకరించిన 14.52 బిలియన్ డాలర్లతో పోలిస్తే మూడు రెట్లు అధికం. వాటాల విక్రయానికి సంబంధించి ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్‌జీసీ), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, గెయిల్, విద్యుత్ రంగ సంస్థయైన ఎన్‌హెచ్‌పీసీ, ఎన్‌టీపీసీ, ఎన్ఎండీసీ, కోల్ ఇండియా, భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్‌లు ఉన్నాయని పేరు చెప్పని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

## రూ.3,551 కోట్ల ఎఫ్‌పీఐల పెట్టుబడులు

- జూలై నెలలో ఇప్పటివరకు వచ్చిన విదేశి పెట్టుబడులు



**న్యూఢిల్లీ, జూలై 14:** దేశీయ ఈక్విటీ మార్కెట్లలోకి విదేశీ పెట్టుబడుల హవా కొనసాగుతున్నాయి. ప్రస్తుత నెల తొలి వారంలో తమ పెట్టుబడులను వెనక్కితీసుకున్న విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు..మొత్తంమీద ఈ నెలలో ఇప్పటి వరకు రూ.3,551 కోట్ల పెట్టుబడులను పెట్టారు. తాజా డిపాజిటరీ నివేదిక ప్రకారం ఈ విషయం వెల్లడైంది. జూలై 1 నుంచి 12 మధ్యకాలంలో ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.4,953.77 కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయిన ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ)..డెబిట్ మార్కెట్లలోకి మాత్రం రూ.8,504.78 కోట్లను పెట్టుబడి రూపంలో చొప్పించారు. నికరంగా రూ.3,551.01 కోట్లను పెట్టుబడి పెట్టినట్లు అయింది. జూలై 5న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దెబ్బకు తొలి ఆరు సెషన్లలో ఈక్విటీ మార్కెట్ల నుంచి ఎఫ్‌పీఐలు తమ పెట్టుబడులను భారీగా తరలించుకుపోయారు. వరుసగా ఐదు నెలలపాటు ఎఫ్‌పీఐలు దేశీయ మార్కెట్లోకి నిధులను చొప్పిస్తున్నారు. జూన్‌లో రూ.10,384.54 కోట్లు చొప్పించిన ఎఫ్‌పీఐలు..మే నెలలో రూ.9,031.15 కోట్లు, ఏప్రిల్‌లో రూ.16,093 కోట్లు, మార్చి నెలలో రూ.45,981 కోట్లు, ఫిబ్రవరిలోనూ రూ.11,182 కోట్లను పెట్టుబడి రూపంలో పెట్టారు. విదేశీ పెట్టుబడులను ఆకట్టుకోవడానికి బడ్జెట్‌లో పలు కీలక నిర్ణయాలు తీసుకోవడం, ముఖ్యంగా ఎఫ్‌పీఐలకు కేవైసీ నిబంధనలను మరింత సరళతరం చేయడం పెట్టుబడులు పెరుగడానికి దోహదం చేశాయని మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ సీనియర్ విశ్లేషకులు హిమాన్షు శ్రీవాత్సవ తెలిపారు. ఈవారం ఎఫ్‌పీఐలకు చాలా కీలకమని ఆయన వ్యాఖ్యానించారు.



BIG C
225+ STORES | TS | AP | TN
AASHADAM SALE*
SCRATCH & WIN*
10 CRORES
WORTH OF GIFTS*
1 EMI FREE*
UP TO 51% DISCOUNT*
FLAT 30% Paytm CASH BACK*
5% CASH BACK* HDFC BANK HDB FINANCIAL SERVICES
vivo V15 Pro EMI ₹1799
V15 EMI ₹1333
vivo Y17 EMI ₹1066
1 EMI FREE BAJAJ FINSERV
3GB + 32GB LOWEST EMI ₹999
oppo A5s
realme
ALL MODELS AVAILABLE
SAMSUNG Galaxy A30 | A50 | A70
0% Down Payment Processing Fee No Cost EMI
All MODELS AVAILABLE
mi
3GB + 32GB 57% DISCOUNT
micromax HS2 Infinity
3GB + 32GB 40% DISCOUNT
LAVA Z81
SKYWIN
2300 mAh
₹799
GYM Bag FREE
SAMSUNG
Galaxy A
Aashadam Sambaralu
Buy a Samsung Galaxy Smartphone*& get a chance to win*fabulous prizes.
Daily Prize
Galaxy A10 - 10 (N)
Total - 310 (N)
Weekly Prize
Bajaj Platina Bikes - 1 (N)
Total - 5 (N)
Bumper Prize
Hundai Santro Car - 1 (N)
*No other offers are applicable.
*T&C appy. For more details contact the BIG C outlet. offer valid on purchase of any Samsung Smart phone above Rs.10000/-
0% Down Payment Processing Fee No Cost EMI
BAJAJ FINSERV
HOME CREDIT
IDFC FIRST Bank
HDFC BANK
HDB FINANCIAL SERVICES
Pine Labs
Helpline 1800 123 4578
www.bigcmobiles.com
for more offers
visit your nearest Big C Store
BIG C

నమస్తే తెలంగాణ

# జిందగీ

సోమవారం 15 జూలై 2019 WWW. NTNEWS.COM /nt.zindagi




## గోడను బట్టి ఫ్రేమ్

**ఇంట్లో గోడలకు అందమైన ఫొటోలు, ఫ్రేమ్‌లను తగిలించుకునేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కడ వాటిని అమర్చితే ఇల్లంతా కళగా ఉంటుందో చూసుకుని దాని ప్రకారం వాటిని అక్కడ తగిలించాలి. అలా వేలాడదీయడం వల్ల ఇల్లు అంతకు ముందు కంటే కొత్తగా కనిపిస్తుంది. గోడకు వాటిని తగిలించేటప్పుడు ఇవి తప్పని సరి.**

- ఫొటో ఫ్రేమ్, లేదా పిక్చర్‌ను గోడకు తగిలించాలనుకునే ముందుగా ఫ్రేమ్ ఎంత సైజులో ఉన్నదో కొలత తీసుకోవాలి.
- అలా తీసుకున్న తర్వాత దానిని పెన్సిల్‌తో మార్క్ చేయాలి.
- ముందు గది వాతావరణం, గది వెలుతురు, గోడపై ఏ ప్రదేశంలో ఉంచితే బాగుంటుందో చూసుకోవాలి.
- అంతేకాకుండా ఎంత ఎత్తులో తగిలిస్తే దృష్టిని ఆకర్షిస్తుంది అనేటువంటి అంశాలను పరిగణలోకి తీసుకుని నిర్ణయించాలి.
- గోడకు డ్రిల్లింగ్ చేసే సమయంలో లోపల విద్యుత్ తీగలున్నాయో లేదో పరిశీలించాలి.
- ఆ తర్వాత ఎటువంటి ప్రమాదానికి అవకాశం లేదనుకున్న ప్రదేశంలోనే డ్రిల్ చేయాలి.
- ఫొటో ఫ్రేమ్ పరిమాణం, బరువు గోడ ఆపగలుగుతుందో లేదో నిర్ధారించుకోవాలి.
- ఫొటో ఫ్రేమ్ బరువును తట్టుకునే స్క్రూలు, మేకులు మాత్రమే వాడాలి.

సక్సెస్ మంత్ర



# చేనేతకు గ్లోబల్ గుర్తింపు తెచ్చిన షీనారాయ్

**చేతి వృత్తులకు, ఎన్నో హస్త కళలకు భారతదేశం పుట్టినిల్లు. చేతివృత్తులతో విరాజిల్లిన భారత్ అంటే ప్రపంచానికే ఆసక్తి. ఆ ఆసక్తే భారత్‌ను కనుగొనేందుకు మార్గాన్ని అన్వేషించేలా చేసింది. అ అన్వేషణే ప్రపంచ గతిని మార్చేసింది. భారతీయ చేతివృత్తుల్లో నాడు.. నేడూ వస్త్రపరిశ్రమే రారాజు. ప్రస్తుత కాలంలో సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక పద్ధతులు వచ్చి చేనేత కొంత వెనుబడినా ఇప్పుడు కుప్పలు తెప్పలుగా పుట్టుకొస్తున్న ఫ్యాషన్ దుస్తులకు ఆ చేతివృత్తి నైపుణ్యమే ప్రేరణ. ఫ్యాషన్ ప్రపంచం మొత్తం భారతీయ చేనేతలోంచే కొత్తదనాన్ని వెతుక్కుంటుందంటే అతిశయోక్తికాదు. ఫ్యాషన్ డిజైనింగ్‌లో ఉన్నత విద్యను అభ్యసించి, ఆధునిక ఫ్యాషన్ రంగాన్ని ఔపోసన పట్టిన ఆమె అసలైన ఫ్యాషన్ మన చేనేతలోనే ఉందని గుర్తించారు. అందుకే ఆధునిక ఫ్యాషన్‌ను అద్భుత చేనేత కళను మేళవించి ఫ్యాషన్ డిజైనింగ్‌లో దూసుకుపోతున్నారు. మోగ్రా పేరిట సంస్థ ప్రారంభించి అసలైన ఫ్యాషన్ చేనేతలోనే ఉందని ప్రపంచానికి చాటి చెప్పిన షీనారాయ్ సక్సెస్‌మంత్ర.**

**సాధించాలనే** పట్టుదల ఉండాలే కానీ ఎంత గొప్ప రంగంలోనైనా విజయం సాధించవచ్చు. కోల్‌కతాకు చెందిన షీనారాయ్ కూడా తాను కోరుకున్న రంగంలో ఇష్టంగా పనిచేసి ఏడాదిలోపే సంస్థను గ్లోబల్ బ్రాండ్‌గా మార్చేసింది. రోజుకో ఫ్యాషన్ మారుస్తున్న పాశ్చాత్య దేశాలకే ఫ్యాషన్ అంటే ఏమిటో తెలియజేసింది.



### చేతివృత్తికి ఫ్యాషన్‌ను జతచేసి..

భారతదేశంలో ప్రస్తుతం ఫ్యాషన్ రంగంలో రెండు ప్రధాన ధోరణులున్నాయి. ఒకటి పాశ్చాత్య సీజనల్ సైకిల్, పాప్ ఆర్ట్, భారీ ఉత్పాదక ఈ కామర్స్ వాణిజ్యం, లగ్జరీ బ్రాండ్లు కాగా.. రెండోది వారసత్వ చేనేత, డిజైనింగ్ రంగం. పూర్వీకుల నుంచి చేతివృత్తి కళను వారసత్వంగా పొందినవారు ప్రస్తుత డిజిటల్ రంగంతో అనుసంధానం కావడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ అందులో అనేక సవాళ్లు. ఆ సవాళ్లను ఎదుర్కొనేందుకు షీనారాయ్ కూడా సిద్ధమయ్యారు. అందరికంటే భిన్నంగా చేస్తే వ్యాపారం ఎప్పుడూ లాభసాటిగానే ఉంటుందన్న సూత్రాన్ని నమ్మే ఆమె ఆధునిక ఫ్యాషన్‌కు భారతీయ చేతివృత్తుల కళను అలంకరించి అద్భుత విజయం సాధించారు. ఢిల్లీలోని నిఫ్ట్‌లో ఫ్యాషన్ డిజైనింగ్ చదివిన ఆమె ప్రపంచంలోని ఫ్యాషన్ పోకడలన్నీ అధ్యయనం చేశారు. ఎన్నో పుస్తకాలు తిరిగేశారు. చివరకు అసలైన ఫ్యాషన్ భారతీయ చేనేతలోనే ఉందని గుర్తించారు. మోర్గా పేరుతో సంస్థను స్థాపించి ప్రపంచం మొత్తానికీ తన ఫ్యాషన్ కళను పరిచయం చేస్తున్నారు.

### చిన్న పెట్టుబడితో..

షీనారాయ్‌కి చిన్నప్పటి నుంచీ ఫ్యాషన్ డిజైనింగ్ అంటే అమితాసక్తి. వారసత్వ సంపదకు నిలయమైన కోల్‌కతాలో.. ఆధునిక పోకడల కేంద్రమైన ఢిల్లీలో ఆమె రెండు భిన్నమైన వాతావరణాల్లో పెరిగారు. ఈ రెండు చోట్ల వ్యక్తుల అలవాట్లు, ఆకాంక్షలు, జీవిత విధానాలను లోతుగా అధ్యయనం చేశారు. బాలికల పాఠశాలలో చదివిన షీనా.. అప్పటి నుంచే తన మిత్రులు ఎలాంటి డ్రెస్సులు ధరిస్తున్నారు.. అవి వాళ్లకు ఎలాంటి లుక్‌ను ఇస్తున్నాయనే విషయాలను పరిశీలించేవారు. నిఫ్ట్‌లో చదువు పూర్తవగానే రెక్కలు కట్టుకొని ఆకాశం వైపు ఎగిరారు. ఫ్యాషన్ ప్రపంచంలో విహరించారు. మొదట ప్రఖ్యాత డిజైనర్ ప్రశాంత్ వర్మ వద్ద ఫ్యాషన్ డిజైనింగ్‌లో మెళకువలు తెలుసుకున్నారు. ఆ తర్వాత న్యూయార్క్ చేరుకున్న ఆమె.. లేడీ గాగా, ది బ్లాక్ ఐడ్ పియాస్, జిమ్ స్టీన్‌మ్యాన్, బ్రూనో మార్స్ వంటి పాప్ డిజైన్లకు డిజైనర్‌గా ఉన్న ఆషర్ లెవన్ వద్ద పనిచేశారు. ఫ్యాషన్ అండ్ యూ డాట్ కామ్, ఇండియన్ రూట్స్ డాట్ కామ్ సంస్థల్లో కీలకంగా పనిచేశారు. ఈ అనుభవాలు ఆమెకు ఫ్యాషన్ రంగాన్ని పూర్తిగా అవగాహన చేసుకొనేందుకు తోడ్పడింది. దాంతో ఆమె మదిలో ఒక బలమైన బృహత్ లక్ష్యంతో న్యూయార్క్ నుంచి ఢిల్లీ ఫ్లయిటెక్కారు. పశ్చిమదేశాల్లోని డిజైన్లు, స్ట్రీట్ స్టయిల్ తూర్పుదేశాల సంప్రదాయాల ప్రభావం ఉన్నప్పటికీ మన సొంతదేశంలో ఆ వ్యక్తిత్వాన్ని, కళలను కోల్పోతున్నాం. దేశంలో ఎంతో మంది బహుళ నైపుణ్యంగల డిజైనర్లు సంప్రదాయ టెక్స్‌టైల్స్‌తో శోభాయమానమైన డిజైన్లు చేస్తున్నారు. అయితే, అతికొద్దిమంది మాత్రమే పాశ్చాత్య వస్త్రాలకు స్థానిక, చేతివృత్తుల వనరులను వాడుతున్నారు. ఆ సమయంలోనే బలమైన సాంస్కృతి ముద్ర ఉండాలన్న సంకల్పంతో 2014 జూన్‌లో మోగ్రా పురుడుపోసుకొంది' అని షీనా చెప్పారు. ఆమెకు ఎంతో ఇష్టమైన పువ్వు పేరే తన సంస్థకు పెట్టుకున్నారు.

### నిరంతర పరిశ్రమ

ప్రపంచవ్యాప్తంగా ఫ్యాషన్లు గంటగంటకూ మారిపోతుంటాయి. పశ్చిమదేశాల్లో సీజనల్ సైకిల్‌కు ప్రాధాన్యం ఇస్తారు. మోగ్రా సంస్థ దీనికి భిన్నంగా ఉండాలని షీనా మొదటే నిర్ణయించుకొన్నారు. అందుకే సీజన్ అన్న ఆలోచన లేకుండా నిరంతరం కొత్త ఫ్యాషన్ కోసం అన్వేషణ మొదలుపెట్టారు.'మా పరిశోధన అధికభాగం ఆన్‌లైన్‌లో ఉన్నప్పటికీ దుస్తుల ఎంపికకు మాత్రం స్వయంగా చేనేత క్లస్టర్లకే వెళ్తాం. ఆ దుస్తులు ఎల్లప్పుడూ దశాబ్దాలు, ఒక్కోసారి శతాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయ డిజైన్లతోనే ముచ్చటగొలుపుతుంటాయి. ఒకసారి సరుకు దొరికిన తర్వాత వాటిని తీసుకెళ్లి ప్రస్తుత కాలానికి తగినట్లుగా డిజైన్లు రూపొందిస్తాం' అని షీనా తెలిపారు.

### వ్యాపారంలో నిజాయితీ


షీనాకు లాభమే లక్ష్యం కాదు. ఫ్యాషన్ రంగం ఆమెకు ఒక 'ప్యాషన్'. అందుకే ఆమె వ్యాపారంలో నిజాయితీని నమ్ముకున్నారు.'ఉత్పత్తిదారుడు నేతపని నైపుణ్యానికి తగిన ధర చెల్లిస్తున్నపుడు ఉత్పత్తిదారుడికి, కొనుగోలుదారుడికి మధ్య న్యాయబద్ధమైన వ్యాపారమనే భాగస్వామ్యముండాలి. మా విషయమే తీసుకొంటే, మన వృత్తి నిపుణుడితో మంచి డీల్ లభించినప్పుడు ధర విషయం ఆలోచించకూడదు. ఎందుకంటే వాళ్లు స్థానికంగా ఉన్నవాళ్లకు శిక్షణనిచ్చి ఉపాధి కల్పిస్తారు. కళను సజీవంగా ఉంచుతారు. భారతీయ నైపుణ్యాలను పాశ్చాత్య డిజైన్లలో మిళితం చేయాలన్న లక్ష్యంతో నేను ప్రారంభించిన మోగ్రా అనుకోకుండానే న్యాయబద్ధమైన వ్యాపారానికి వేదిక అయ్యింది. కేవలం చేతితో తయారుచేసిన సంప్రదాయ దుస్తులను వనరులుగా వాడుతున్నప్పటి నుంచి న్యాయబద్ధమైన ధరనే చెల్లిస్తున్నాను. ఆ విధంగా వారికి నేను ఒక వనరుగా మారాను' అని షీనా ఎంతో ఆనందంగా చెప్పారు.

వినియోగదారుల ఇష్టాయిష్టాల్లో కూడా స్పష్టమైన మార్పు వచ్చిందని షీనా గుర్తించారు. 'నేడు ప్రజలు తమ జీవిత విధానంపట్ల చాలా జాగ్రత్తలు తీసుకొంటున్నారు. తమ ఆహార అలవాట్లలాగే వార్డ్రోబ్ కూడా స్థానికంగా ఉత్పత్తి అయిన చేనేత నైపుణ్యంతో కూడిన వస్త్రాలతో నిండిపోవాలని కోరుకొంటున్నారు. ఇందుకోసం కొంచెం ఎక్కువ ధర చెల్లించేందుకు కూడా వెనుకాడటం లేదు. వినియోగదారుల్లో ఈ మార్పులే మోగ్రా అభ్యున్నతికి మార్గాలు' అని ధీమాగా చెప్తున్నారు.

### ఆన్‌లైన్‌కు దూరంగా..

వినియోగదారులు కూడా ఆన్‌లైన్ షాపింగ్ వైపు వేగంగా ఆకర్షితులవుతున్నారు. కానీ, షీనా మాత్రం తమ ఉత్పత్తులను వినియోగదారుల వద్దకు చేర్చేందుకు ఈ కామర్స్ జోలికి వెళ్లలేదు. గతంలో ఈ కామర్స్ సంస్థల్లో పనిచేసిన అనుభవం ఉన్న ఆమెకు అందులోని లోటుపాట్లేమిటో బాగా తెలుసు. ఈ కామర్స్‌లో బాండ్లదే హవా. వస్తువు ఎక్కడ తయారవుతున్నది? ఎలా తయారవుతున్నదన్నదానికి ప్రాధాన్యం ఉండదు. కానీ షీనా తన ఉత్పత్తులను కొనే వినియోగదారులు వాటి గొప్ప కథలను కూడా తెలుసుకోవాలని ఆశించారు. అందుకే వినియోగదారులు తమ డిజైన్లను ప్రత్యక్షంగా చూసి, వాటి గొప్పతనాన్ని తెలుసుకొని కొనేలా స్టోర్లలో విక్రయిస్తున్నారు. ఎంతో మంది కొత్త డిజైనర్లు భారతీయ నేత నైపుణ్యాలను ప్రపంచానికి పరిచయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వారందరికంటే వినియోగదారుడికి అత్యుత్తమ వస్తువులను, తక్కువ ధరలకు అందించటమే మోగ్రా ప్రత్యేకత' అని చెప్తారు షీనా రాయ్. మోగ్రా ఉత్పత్తులకు మార్కెట్లో అంచనాలకు మించి ఆదరణ లభిస్తుండటం షీనాకు మరింత ప్రోత్సాహన్నిస్తున్నది. వినియోగదారులతోపాటు మీడియా కూడా మోగ్రా డిజైన్లు అద్భుతంగా ఉన్నాయని కొనియాడుతుండటంతో ఆమె ఆనందానికి అవధులు లేవు.





### గ్లోబల్ బ్రాండ్

గుండెల నిండా ఆత్మవిశ్వాసం.. సాధించాలన్న దృఢ సంకల్పంతో కేవలం లక్ష రూపాయలతో షీనారాయ్ ప్రారంభించిన మోగ్రా ఇప్పుడొక గ్లోబల్ బ్రాండ్. భారత్‌లోనే కాకుండా థాయ్‌లాండ్, శ్రీలంక, కొరియా, అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, గ్రీస్, ఆస్ట్రేలియా, బ్రెజిల్.. ఇలా అనేక దేశాల్లో మోగ్రా డిజైన్లను అభిమానిస్తున్నారు. భారతీయ చేనేత నైపుణ్యాలను విశ్వవ్యాప్తం చేస్తూ డిజైనింగ్‌లో అద్భుతాలు సృష్టిస్తున్న మోగ్రాను షీనా ఒంటి చేత్తో నడిపిస్తూ మంచి వ్యాపారవేత్తగా కూడా గుర్తింపు పొందారు. మోగ్రాకు అకౌంటెంట్, ఫొటోగ్రాఫర్, పీఆర్‌ఓ, మార్కెటింగ్ గురు.. అన్నీ తానై షీనా తాను ఎంచుకొన్న రంగంలో దూసుకుపోతున్నారు.

## ఒక తిరస్కరణ.. పెద్ద సమాధానం..

**ఒక ప్రయత్నంలో తిరస్కరణను ఒక్కొక్కరూ ఒక్కో విధంగా తీసుకుంటారు. ఆ తిరస్కరణకు కారణమైన దాని లోపాలను సరిచేసుకోవడం, ఒక అడుగు వెనక్కి వేసి బలంగా దూసుకొని రావడం చేస్తుంటారు. ఈ రెండింటినీ చేసింది ఢిల్లీకి చెందిన బయాలజీ టీచర్ సాస్వతీసింగ్**



సాస్వతీ సింగ్ ఢిల్లీలో ఓ బయాలజీ టీచర్. కానీ దానికి రాజీనామా చేసి ఓ పాఠశాలను పెట్టాల్సి వచ్చింది. పాఠశాల అంటే కార్పొరేట్ కాదు. ఇది ఒక నాన్‌ప్రాఫిట్ ఆర్గనైజేషన్. 'నవ్ ప్రేరణ' ఫౌండేషన్‌తో స్ఫూర్తిదాయక పాఠశాల ఇది. 1995లో ముగ్గురి విద్యార్థులతో ప్రారంభమైన ఈ పాఠశాల 2010లో గవర్నమెంట్ నుంచి అధికారిక గుర్తింపు పొందింది. పరిపక్వతా రుగ్మతలు, అభివృద్ధి లోపాలను ఎదుర్కొనే పిల్లలను చేరదీసి వారిని తీర్చిదిద్దడం ఈ పాఠశాల ఉద్దేశం. దీన్ని ఏర్పాటు చేయడం వెనుక సాస్వతీ ప్రత్యేక ఇబ్బందులను ఎదుర్కొన్నది. చిన్నతనంలోనే డెవలప్‌మెంట్ డిజార్డర్లను ఎదుర్కొన్న తన ఎనిమిదేండ్ల కుమారున్ని ఢిల్లీలోని 42 పాఠశాలలు తిరస్కరించాయి. దీంతో వెంటనే ఇలాంటి వారిని చేరదీయడానికి ఆమె ముందడుగు వేసింది. ఢిల్లీలోని అన్ని పాఠశాలలనూ సందర్శించి మానసిక, శారీరక, అభివృద్ధి లోపాల కారణంగా తిరస్కరణకు గురైన పిల్లల వివరాలను సేకరించింది. వీరిని చేరదీసి విద్యాబుద్ధులు నేర్పించాలనుకుంది. నవ్ ప్రేరణ స్థాపించి, ముగ్గురు విద్యార్థులతో తన ప్రయత్నం మొదలు పెట్టింది. తర్వాత విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఒక హాల్ కోసం ప్రభుత్వానికి విన్నవించింది. స్పందించిన గవర్నమెంట్, శిశు సంకేమ శాఖ సాస్వతికి అండగా నిలిచింది. తన ప్రయత్నానికి సపోర్ట్‌గా ఇతర దేశాల్లో ఇలాంటి కార్యక్రమాలపై అధ్యయనానికి పంపింది ప్రభుత్వం. చివరికి 2010లో డెహ్రాడూన్‌లో పూర్తి స్థాయి పాఠశాల స్థాపించింది. 2వేల మందికి పైగా పిల్లల అభివృద్ధికి ఏటా కృషి చేస్తున్నది.


## అందమైన కురులకు ఇలా..!



**నేటి తరం యువతులు ఒత్తైన, అందమైన కేశాల మీద మమకారం పెంచుకుంటున్నారు. చిన్న జాగ్రత్తలు తీసుకుంటే చాలు పట్టు కుచ్చు లాంటి కురులు మీ సొంతమవుతాయి.**

- తలస్నానం పూర్తయ్యాక ఒక మగ్గు నీటిలో ఒక కప్పు వెనిగర్ కలిపి పోసుకుంటే నిర్జీవంగా ఉండే జుట్టు ఆరోగ్యంగా మెరుస్తుంది.
- కొబ్బరినూనెలో మందార పూలు వేసి కాచి వడపోయాలి. ఈ నూనెను రోజూ తలకు పెట్టుకుంటే జుట్టు రాలడం తగ్గుతుంది, జుట్టు ఒత్తుగా మారుతుంది.
- వెచ్చటి కొబ్బరినూనెతో తలకు మర్దన చేసిన తర్వాత తలకు వేడి నీటిలో ముంచిన టవల్ చుట్టి గంటసేపు ఉంచి తర్వాత తలస్నానం చేస్తే జుట్టు మెత్తగా పట్టుకుచ్చులా మారుతుంది.
- తలకు శనగపిండి పట్టించి అన్నం వార్చిన గంజితో తల రుద్దాలి. ఇది కేశాలకు సహజసిద్ధమైన కండీషనర్.
- వారానికొకసారి టీ డికాషన్‌తో తలస్నానం చేస్తే జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. కుంకుడుకాయ, శీకాయ పొడులతో తలస్నానం చేసే వాళ్లు ఆ పొడిలో టీ డికాషన్ కలుపుకోవచ్చు లేదా షాంపూతో రుద్దుకున్న తర్వాత టీ డికాషన్‌తో రుద్దుకోవాలి.
- శీకాయ పొడిలో ఎండిన ఉసిరిక పొడి, నిమ్మతొక్కల పొడి కలుపుకుని వాడితే జుట్టు రాలడం తగ్గి నల్లబడుతుంది.
- జుట్టు ఆరోగ్యంగా పెరగాలంటే వారానికొకసారి ఆముదంతో తలకు మర్దన చేయాలి.

## ఆస్తమా అటాక్‌తో ముప్పేంటి?




**మా పాప వయస్సు 7 సంవత్సరాలు. తరచూ అనారోగ్యానికి గురవుతుంటే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాం. ఆస్తమా ఉన్నట్లు డాక్టర్ చెప్పారు. మందులు కూడా వాడుతున్నాం. ఆస్తమా అటాక్ వచ్చినప్పుడు ఆలస్యం చేయకుండా డాక్టర్‌కు చూపించాలి.. జాగ్రత్తగా ఉండాలి అని చెప్పారు. ఆల్రెడీ ఆస్తమా ఉందని నిర్ధారించారు కదా? మళ్లీ ఈ ఆస్తమా అటాక్ ఏంటి? దీనికి ఎలాంటి చికిత్స చేస్తారు?**

**- సత్య దాసరి, గోదావరిఖని**

ఆస్తమా లక్షణాలు ఒక్కసారిగా పెరిగిపోయి పరిస్థితి తీవ్రంగా మారడాన్ని ఆస్తమా అటాక్ అంటారు. దీనిని ఆస్తమా ఎపిసోడ్ అని కూడా అంటారు. ఈ పరిస్థితి హఠాత్తుగా ఏర్పడవచ్చు. కొన్నిసార్లు ఇది విషమిస్తుంది. అలాంటి సందర్భాల్లో దీనికి తక్షణ వైద్యసాయం కావాలి. అటాక్ వచ్చిన వెంటనే హాస్పిటల్‌కు తీసుకెళ్లినప్పుడు డాక్టర్ మీకు సూచించింది అందుకోసమే. ఆస్తమా అటాక్ వచ్చినప్పుడు శ్వాస వ్యవస్థలో వేగంగా కొన్ని మార్పులు జరుగుతాయి. వాయునాళాల చుట్టూ కండరాలు బిగుసుకొని గాలి ప్రయాణించే మార్గం కుంచించుకుపోతుంది. శ్వాసకోశాలకు చేరే గాలి పరిమాణం బాగా తగ్గిపోతుంది. వాయునాళాలలో వాపు వచ్చి అవి మూసుకుపోవచ్చు. ఇలాంటి మార్పులతో సాధారణ స్థాయి నుంచి ప్రమాదకర స్థాయి వరకూ ఆస్తమా అటాక్ జరుగుతుంది. దీని ప్రారంభంలో ఉపిరితిత్తులకు కొంచెం తక్కువగానైనా ఆక్సిజన్ అందుతుంది. కానీ శ్వాసకోశాల నుంచి కార్బన్ డై ఆక్సైడ్ బయటకు రావటం కష్టం. ఇది మరికొంత సమయం కొనసాగితే శ్వాసకోశాలలో కార్బన్ డై ఆక్సైడ్ నిలిచిపోయి శరీరంలో ఆక్సిజన్ కొరత ఏర్పడుతుంది. క్రమంగా ఉపిరితిత్తులకు అందే ఆక్సిజన్ పరిమాణం చాలా తక్కువ స్థాయికి పడిపోయి శరీరంలోని వివిధ భాగాలకు రక్తం ద్వారా అందే అక్సిజన్ తగ్గుతుంది. కాబట్టి చికిత్సను నిర్లక్ష్యం చేయొద్దు. డాక్టర్ దగ్గరకు వెళ్తే కృత్రిమంగా శ్వాస అందిస్తూ వాయునాళాలు తెరచుకునేట్లు చేస్తారు. ఆస్తమా విషమించటానికి కారణాన్ని గుర్తించి మరోసారి ఆస్తమా అటాక్‌కు గురికాకుండా మందులు సూచిస్తారు.



**డాక్టర్ జీ హరికిషన్**
సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్

## ఒడుదొడుకుల జీవితం.. ఆత్మవిశ్వాసమే బలం!

**జీవితం అనే ప్రయాణంలో స్పీడ్ బ్రేకర్లు వేగాన్ని తగ్గించుకోవడానికే కానీ ప్రయాణాన్ని రద్దు చేసుకోవడానికి కాదు. ఇలాంటి పరిస్థితుల నుంచే వచ్చి తన జీవిత ప్రయాణాన్ని చక్కదిద్దుకున్న మహిళ సుమిజా ఇప్పుడు డ్రైవర్‌గా పని చేస్తూ ఎందరికో స్ఫూర్తినిస్తున్నది.**



సుమిజాది చెన్నయ్. ఇంటర్ తర్వాత కుటుంబంతో కోయంబత్తూర్ వచ్చింది. ఆర్థిక కారణాలతో చదువు కొనసాగించలేకపోయింది. తర్వాత ఓ గార్మెంట్ ఫ్యాక్టరీలో పని కోసం చేరింది. అక్కడ చేస్తూనే కంప్యూటర్ విద్య నేర్చుకుంది. ఆ అనుభవంతో ఓ డ్రైవింగ్ స్కూల్లో క్లర్క్‌గా చేరింది. అక్కడ పనిచేస్తుండగానే డ్రైవింగ్ స్కూల్లో ఫీమేల్ శిక్షకుల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. దాంతో సుమిజా దరఖాస్తు చేసుకొని, శిక్షణ తీసుకుంది.అందులో పనిచేస్తుండగానే పెండ్లయింది. తర్వాత ప్రసూతి సమయంలో జాబ్ మానేయాల్సి వచ్చింది. ఆ తర్వాత సుమిజా తన స్నేహితులు చేసినట్లు ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫీస్‌లో పేరును రిజిస్టర్ చేసుకుంది. కానీ స్పందన రాలేదు. సరిగ్గా రెండున్నరేండ్ల తర్వాత తిరుప్పూర్ కలెక్టరేట్‌లో డ్రైవర్ ఉద్యోగం కోసం ఇంటర్వ్యూ లెటర్ వచ్చింది. కానీ, తనకు ఆ ఉద్యోగం రాలేదు. 2011లో మరో కాల్ వచ్చింది. సుల్తాన్‌పేట బ్లాక్ పంచాయతీలో ఉద్యోగం. అక్కడ ఆమె మహీంద్రా బొలేరోను నడిపింది. పెద్ద బండి కావడంతో మొదట్లో సుమిజాకు ఆ పని చాలా కష్టమనిపించింది. ఆమె ఎంచుకున్న వృత్తి సరైంది కాదని కుటుంబసభ్యులు అనేవారు. కానీ సుమిజాకు అత్త మద్దతుగా నిలిచారు. మూడేండ్ల తర్వాత సుమిజా మదుక్కరై బ్లాక్ పంచాయతీకి బదిలీ అయ్యారు. అక్కడ కొన్నాళ్లు పని చేసిన తర్వాత పదినెలల క్రితం కోయంబత్తూరు కలెక్టరేట్‌లో చేరారు. ఇప్పుడామె జిల్లా కలెక్టరేట్‌లో ఉన్న ఏకైక మహిళా డ్రైవర్. రోజులో సుమారు 80 కిలోమీటర్లు డ్రైవింగ్ చేస్తున్నది. మీటింగ్‌లు, తనిఖీలు ఉన్నప్పుడు సుదూర ప్రాంతాలకూ వెళ్లాల్సి వస్తుంది.

నమస్తే తెలంగాణ
# నిపుణ
కరీంనగర్
సోమవారం 15 జూలై 2019

## పరిశో'ధన'లకు ఇన్‌స్పైర్

**చాలామంది విద్యార్థులకు సైన్స్ అంటే మక్కువ ఎక్కువ. చిన్నప్పటి నుంచే రకరకాల ప్రయోగాలు చేస్తూ భవిష్యత్తులో పెద్ద శాస్త్రవేత్తలు కావాలనుకుంటారు. కానీ చాలామందికి ఆసక్తి ఉన్నా ప్రోత్సాహం కరువై పరిశోధనలవైపు పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. సరిగ్గా ఈ సమస్యకు పరిష్కారం కోసం భారత ప్రభుత్వం పిల్లల్లో శాస్త్ర సాంకేతిక పరిశోధన ఆసక్తిని పెంచి, వారిని ఆ రంగంలో నిపుణులుగా తయారుచేసేందుకు ఇచ్చే పురస్కారాలకు సంబంధించిన 'ఇన్‌స్పైర్' సంక్షిప్తంగా...**

- న్యూఢిల్లీలోని భారత ప్రభుత్వ విజ్ఞాన సాంకేతిక విభాగం ప్రతి ఏటా అందించే ఇన్‌స్పైర్ పురస్కారాలకు నోటిఫికేషన్ విడుదలైంది.
- **అర్హతలు:** 10 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి 6 నుంచి 10వ తరగతి చదువుతున్న ప్రభుత్వ/ఎయిడెడ్ ప్రైవేట్ రికగ్నైజ్డ్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు.

### ఏం చేయాలి?

- విద్యార్థులు తాము నిత్యజీవితంలో ఎదుర్కొనే సమస్యలను అధిగమించడానికి లేదా సమాజానికి ఉపయోగపడే ఒక నూతన పరికరాన్ని రూపొందించడానికి తమ ఆలోచనలను ప్రాజెక్టు ప్రపోజల్ రూపంలో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.
- **స్టయిఫండ్:** ఎంపికైన ప్రతిపాదనలకు ఒక్కొక్కరికీ రూ.10 వేల ఆర్థిక సహాయం ప్రాజెక్టు రూపకల్పన కోసం అందిస్తారు. దీనికి సంబంధించిన అదనపు సమాచారం అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోనూ, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాల్లో లభిస్తుంది.
- **చివరితేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.inspireawards-dst.gov.in



**సైన్స్.. సైన్స్..సైన్స్ మానవుడి ప్రతి అడుగులో ఉన్నది సైన్సే. ఆటవిక యుగం నుంచి ఆధునిక. అత్యాధునిక యుగం వైపు పయనిస్తున్న నేటి తరంలో సైన్స్ ప్రాధ్యానం చెప్పనలవి కాదు. అయితే మన దేశంలో శాస్త్ర సాంకేతికత విషయంలో అనుకున్నంత పురోగతి లేదు. దీనికి ప్రధాన కారణం పరిశోధనలవైపు విద్యార్థులు ఆసక్తి కనపర్చకపోవడం. ఈ సమస్యను తీర్చడానికి డీఎస్‌టీ రకరకాల పథకాలను, స్కాలర్‌షిప్స్‌ను అందిస్తూ సైన్స్‌పట్ల విద్యార్థులను ఆకర్షితులను చేయడానికి కృషి చేస్తుంది. పరిశోధనలవైపు ప్రోత్సహించడానికి డీఎస్‌టీ ఏటా నిర్వహించే కేవీపీవై స్కాలర్‌షిప్ నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో సంక్షిప్తంగా ఆ వివరాలు...**




# కేవీపీవై-2019

- కేవీపీవై: కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన (కేవీపీవై)ని కేంద్ర ప్రభుత్వం 1999లో ఏర్పాటు చేసింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ) ఈ స్కాలర్‌షిప్స్ ద్వారా విద్యార్థులను సైన్స్ రంగం వైపు ప్రోత్సహించడానికి ఏర్పాటు చేసింది. కేవీపీవై ద్వారా బేసిక్ సైన్సెస్‌లో ప్రతిభను కనబరిచిన అభ్యర్థులకు డిగ్రీ నుంచి పీహెచ్‌డీ వరకు ఉపకారవేతనాలను అందిస్తుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఈ నిధులను సమకూరుస్తుంది.

### ఎవరు అర్హులు?

- సైన్స్ సబ్జెక్టుల్లో ఇంటర్, డిగ్రీ ప్రథమ సంవత్సరం కోర్సులు చదువుతున్న వారు అర్హులు. దీనిలో ఎస్‌ఏ, ఎస్‌ఎక్స్, ఎస్‌బీ అని మూడు స్ట్రీమ్‌లు ఉన్నాయి.

### స్ట్రీముల వివరాలు

#### ఎస్‌ఏ

- ప్రస్తుత విద్యా సంవత్సరం (2019-20)లో సైన్స్ సబ్జెక్టుల్లో (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయాలజీ) జూనియర్ ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఈ విభాగం కిందకి వస్తారు. పదో తరగతిలో మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో కనీసం 75 శాతం మార్కులు సాధించినవారు కేవీపీవై రాతపరీక్షకు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులైతే 65 శాతం మార్కులు పొందాలి. వీరు ఇంటర్లో కనీసం 60 శాతం (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు 50 శాతం) మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. దీంతోపాటు 2021-22 విద్యా సంవత్సరంలో బేసిక్ సైన్సెస్ (బీఎస్సీ, బీఎస్, బీస్టాట్, బీమ్యాథ్స్, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్) కోర్సుల్లో చేరితేనే ఈ స్కాలర్‌షిప్ వర్తిస్తుంది. వీళ్లు సీనియర్ ఇంటర్‌లో ఉన్న సమయాన్ని ఇంటెరిమ్ పీరియడ్‌గా పరిగణిస్తారు. ఈ వ్యవధిలో ప్రాంతీయ, జాతీయస్థాయి సైన్స్ క్యాంపులకు ఆహ్వానిస్తారు. ప్రయాణ ఖర్చులు భరించి, ఉచిత వసతి కల్పిస్తారు.

#### ఎస్‌ఎక్స్

- 2019-20లో సైన్స్ సబ్జెక్టుల్లో (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయాలజీ) సీనియర్ ఇంటర్ చదువుతున్నవారు ఈ స్ట్రీమ్ పరిధిలోకి వస్తారు. వీరంతా పదో తరగతిలో మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో కనీసం 75 శాతం (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులైతే 65 శాతం) మార్కులు పొంది ఉండాలి. అలాగే సైన్స్ సబ్జెక్టుల్లో కనీసం 60 శాతం (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులైతే 50 శాతం) మార్కులతో ఇంటర్ పూర్తిచేయాలి. దీంతోపాటు 2020-21 విద్యా సంవత్సరంలో బీఎస్సీ, బీఎస్, బీస్టాట్, బీమ్యాథ్స్, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్ కోర్సుల్లో చేరితేనే స్కాలర్‌షిప్ వర్తిస్తుంది.

#### ఎస్‌బీ

- 2019-20లో ప్రథమ సంవత్సరం బీఎస్సీ/బీఎస్ లేదా ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ/ఎంఎస్ కోర్సులు లేదా బీస్టాట్/బీమ్యాథ్స్ చదువుతున్నవారు స్కాలర్‌షిప్ కోసం నిర్వహించే రాతపరీక్షకు అర్హులు. వీళ్లు సైన్స్ సబ్జెక్టుల్లో కనీసం 60 శాతం (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులైతే 50 శాతం) మార్కులతో ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించాలి. ఇంటర్ తర్వాత విరామం ఉండకూడదు. వీరు డిగ్రీ/ ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 60 శాతం (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులైతే 50 శాతం) మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తేనే స్కాలర్‌షిప్‌కి ఎంపికవుతారు.

### ఎంపిక విధానం

- జాతీయస్థాయిలో జరిగే ఆన్‌లైన్ ఆప్టిట్యూడ్ పరీక్షలో మెరిట్ ఆధారంగా ఇంటర్వ్యూలకు ఆహ్వానిస్తారు.
- ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ప్రశ్నలు ఇంగ్లిష్/హిందీ మాధ్యమంలో ఇస్తారు. మూడు స్ట్రీమ్‌లకు సిలబస్‌లో బేధాలు ఉన్నాయి. వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు. ఈ పరీక్షను 2019, నవంబర్ 3 (ఆదివారం)న దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. ఈ పరీక్షకు సంబంధించిన అడ్మిట్‌కార్డులను అక్టోబర్ రెండోవారం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- **ఇంటర్వ్యూ:** ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో చూపించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తారు.
- **తుది ఎంపిక:** పరీక్ష, ఇంటర్వ్యూలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక నిర్వహిస్తారు. ఆప్టిట్యూడ్ పరీక్షలో పొందిన మార్కుల్లో 75 శాతం + ఇంటర్వ్యూ మార్కుల్లో 25 శాతం కలిపి మెరిట్ లిస్ట్ తయారు చేస్తారు.

### పరీక్షలో ఏం ఉంటుంది?

- రాతపరీక్ష కోసం ప్రత్యేకమైన సిలబస్ ఏమీ నిర్దేశించలేదు. విద్యార్థికి సైన్స్ సబ్జెక్టుల్లో ఉన్న అవగాహన, అర్థం చేసుకునే తీరు, విశ్లేషణను పరిశీలిస్తారు. సాధారణంగా వాళ్లు రాసే స్ట్రీమ్‌ను బట్టి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ / ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రథమ సంవత్సరంలోని సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టుల స్థాయిలో ప్రశ్నలుంటాయి. ఆన్‌లైన్ మాక్ టెస్టును కేవీపీవై వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- ఎస్‌ఏ స్ట్రీమ్ వారికి సైన్స్, మ్యాథ్స్ అంశాల్లో ప్రశ్నలు వస్తాయి. ఎస్‌బీ, ఎస్‌ఎక్స్ స్ట్రీమ్‌లలో రెండు భాగాలు ఉంటాయి. మొదటి భాగంలో నాలుగు సెక్షన్లు.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయాలజీ. రెండో భాగంలోనూ ఈ సబ్జెక్టులతోనే నాలుగు సెక్షన్లు ఉంటాయి. అయితే అభ్యర్థులు మొదటి భాగంలో కనీసం మూడు సబ్జెక్టులు, రెండో భాగంలో కనీసం రెండు సబ్జెక్టుల ప్రశ్నలకు సమాధానాలు గుర్తిస్తే సరిపోతుంది. పరీక్ష వ్యవధి మూడుగంటలు.

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 20 (సాయంత్రం 5 వరకు)
- **దరఖాస్తు ఫీజు :** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ. 1000/-
- ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.500.
- **పరీక్షతేదీ:** నవంబరు 3
- **పరీక్ష కేంద్రాలు:** రాష్ట్రంలో హైదరాబాద్.
- **వెబ్‌సైట్:** http://kvpy.iisc.ernet.in

### స్కాలర్‌షిప్ వివరాలు

- ఎంపికైనవారికి డిగ్రీలో ఉన్నప్పుడు మూడేళ్లపాటు ప్రతినెలా రూ.5000 ఉపకారవేతనంగా చెల్లిస్తారు. అలాగే పీజీలో రూ.7000 చొప్పున అందిస్తారు. వీటితోపాటు ఏటా కంటింజెన్సీ గ్రాంటు కింద డిగ్రీస్థాయి వారికి రూ. 20 వేలు, పీజీ స్థాయి వారికి రూ. 28 వేలు ఇస్తారు. ప్రసిద్ధ సంస్థల్లో వేసవి క్యాంపులూ ఉంటాయి.
- **సమ్మర్ ప్రోగ్రామ్:** ప్రతి ఏడాది వేసవిలో జాతీయ, అంతర్జాతీయస్థాయి విద్యాసంస్థల్లో పరిశోధనలకు అవకాశం కల్పిస్తారు.
- **ఇతర ఉపయోగాలు:** కేవీపీవై ఫెలోలకు ఐడెంటీకార్డు ఇస్తారు. దీనివల్ల జాతీయ పరిశోధన సంస్థలు/యూనివర్సిటీల్లో ల్యాబొరేటరీ, లైబ్రరీలను ఉపయోగించుకునే అవకాశం కల్పిస్తారు.

... కేశవపంతుల వేంకటేశ్వరశర్మ

# రిజర్వేషన్లు- విస్తరణ

## జనరల్ ఎస్సే

**భారతీయ సమాజంలోని ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన వెనుకబాటుతనాన్నిరూపుమాపడానికి, బలహీన వర్గాలకు విద్య, ఉద్యోగ రంగాల్లో చేయూతనివ్వడానికి రాజ్యాంగ నిర్మాతలు కల్పించిన ప్రత్యేక సదుపాయం రిజర్వేషన్లు.**

- రాజ్యాంగంలోని నాలుగో భాగంలో పొందుపర్చిన ఆదేశిక సూత్రాల్లోని 46వ ప్రకరణ రిజర్వేషన్ల గురించి పేర్కొంటుంది. ప్రాథమిక హక్కుల్లో రిజర్వేషన్లకు రక్షణ కల్పించే అంశాలున్నాయి. ఈ అధికరణలు సకారాత్మక భావనని కలిగి ఉంటాయి. అంటే ప్రభుత్వం చేయాల్సిన పనులని సూచిస్తాయి. రాజ్యాంగ ప్రాథమిక భావనలైన సామాజిక న్యాయం, సమానత్వం సాధించటానికి రిజర్వేషన్లు సాధనాలుగా ఉపకరిస్తాయన్నది రాజ్యాంగ నిర్మాతల అభిమతం. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తొలినాళ్లలో దళిత, గిరిజన వర్గాలకు మాత్రమే పరిమితమైన రిజర్వేషన్లు కాలక్రమంలో ఇతర వెనుకబడిన తరగతులకు కూడా విస్తరించాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో అగ్రవర్ణాల్లోని ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు కూడా 103వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ప్రత్యేక కోటా కల్పించారు. అంటే రిజర్వేషన్ విధానం రోజురోజుకీ విస్తరిస్తోంది. తాజాగా మహారాష్ట్రలోని మరాఠాలకు ప్రత్యేక కోటా కల్పించడం, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ఓబీసీ కులాలని ఎస్సీ జాబితాలో చేర్చడం, కశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దు ప్రాంత నివాసులకు కూడా రిజర్వేషన్ ఫలితాలని విస్తరించడంతో రిజర్వేషన్ విధానం మరోసారి చర్చలోకి వచ్చింది.



### మరాఠా రిజర్వేషన్లు

- ముందుగా మరాఠా రిజర్వేషన్ల అంశాన్ని పరిశీలిస్తే.. మహారాష్ట్ర ప్రభుత్వం మరాఠాలను సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులుగా గుర్తించి విద్య, ఉద్యోగ రంగాల్లో 16 శాతం రిజర్వేషన్లు కల్పించింది. అయితే బాంబే హైకోర్టు ఈ రిజర్వేషన్ల విధానాన్ని సమర్థిస్తూనే రాష్ట్ర ప్రభుత్వం నియమించిన గైక్వాడ్ కమిషన్ సూచించినట్లుగా 12-13 శాతానికి పరిమితం చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

### గైక్వాడ్ కమిషన్-నివేదిక

- గతంలో వెనుకబడిన తరగతులను నిర్ధారించడానికి మండల్ కమిషన్ 11 సూచికల ఆధారంగా చేసుకుంది. గైక్వాడ కమిషన్ వాటితోపాటు మరిన్ని సూచికలని పరిగణలోనికి తీసుకున్నారు. ఉదాహారణకు మొత్తం రైతు ఆత్మహత్యల్లో మరాఠాల సంఖ్య, ముంబైలో పనిచేస్తున్న డబ్బావాలాల్లో మరాఠాల శాతం వంటివి కూడా రిజర్వేషన్లు కల్పించడానికి ఆధారంగా తీసుకున్నారు. అయితే ఇలాంటి సూచికలన్నీ అసంబద్ధమైనవన్నది నిపుణుల వాదన.
- దీంతోపాటు అసాధారణ అంశం ఏమిటంటే, మరాఠాలను వెనుకబడిన వర్గాలుగా గుర్తించాలంటే ఓబీసీల జాబితాలో చేర్చి రిజర్వేషన్ల పరిమితిని విస్తరించవచ్చు. కానీ మరాఠా వర్గాన్నే ప్రత్యేక తరగతి (SEBC)గా పరిగణించి రిజర్వేషన్ కల్పించారు. దీన్నే రాజ్యాంగ పరిభాషలో వర్గ చట్టం
- (class legislation) అంటారు. రాజ్యాంగంలోని అధికరణ 14 వర్గ చట్టాన్ని నిషేధిస్తుంది. గత అనుభవాలను పరిశీలిస్తే మరాఠా రిజర్వేషన్ల విధానంలోనే రూపొందించిన గుజ్జర్ల రిజర్వేషన్లను గుర్విందర్ సింగ్ కేసులో సుప్రీం కోర్టు కొట్టేసింది. రామ్‌సింగ్ కేసులో జాట్ రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం అని తేల్చింది.
- మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే గతేడాది జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్‌కు రాజ్యాంగ బద్ధత కల్పించారు. ఆర్టికల్ 342 (బి) ప్రకారం వెనుకబడిన తరగతులను గుర్తించే అధికారం ఈ కమిషన్‌కు ఉంటుంది. మరాఠాల రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్‌తో సంప్రదింపులు జరపలేదు. కాగా బాంబే హైకోర్టు ఈ విషయాన్ని అంత తీవ్రంగా పరిగణించలేదు.

### నేపథ్యం

- మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ ఈ నాటిది కాదు. చాలా కాలంగా ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే రెండో జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ (మండల్ కమిషన్) మరాఠాలని అగ్రవర్ణాలుగా గుర్తిస్తూ వారిని ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) జాబితాలో చేర్చడానికి నిరాకరించింది. దీంతోపాటు మహారాష్ట్ర ప్రభుత్వం నియమించిన వెనుకబడిన తరగతుల కమిషన్లు ఖత్రి కమిషన్ 1995, బాపత్ కమిషన్ 2008 కూడా మరాఠాలని ఓబీసీల్లో చేర్చకూడదని స్పష్టం చేశాయి. అయితే మరాఠాల రిజర్వేషన్ల పోరాటం మాత్రం ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. దీంతో 2015లో రాష్ట్ర ప్రభుత్వం నారాయణ్ రాణే కమిషన్‌ని నియమించింది.
- ఈ కమిషన్ మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలని సూచించడంతో ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించింది. అయితే బాంబే హైకోర్టు ఈ అంశాన్ని పరిశీలిస్తూ రాణే కమిషన్ చట్టబద్ధతని ప్రశ్నించింది. అట్లాగే మరాఠాల సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనాన్ని నిర్ధారించేందుకు చట్టబద్ధమైన కమిషన్‌ని ఏర్పాటు చేయాలని, ఆ కమిషన్ సిఫారసుల మేరకు మాత్రమే రిజర్వేషన్లని విస్తరించాలని సూచించింది. అలా ఏర్పాటు చేసిందే గైక్వాడ్ కమిషన్.

### ఉత్తర్ ప్రదేశ్ - ఎస్సీ జాబితాలో మార్పులు

- బీసీ జాబితాలోని 17 కులాలని ఎస్సీలుగా పరిగణిస్తూ వారికి కులధృవీకరణ పత్రాలు జారీచేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులిచ్చింది. గతంలో వీరిని ఎస్సీలుగా పరిగణించాలని సూచించిన యూపీ సర్కార్ ప్రస్తుతం కులధృవీకరణ పత్రాలు కూడా జారీచేయాలని అధికారులని ఆదేశించింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వులు అలహాబాద్ హైకోర్టు విచారణలో ఉండగానే తాజాగా ఇచ్చిన ఉత్తర్వులు వివాదాస్పదం అయ్యాయి. రాజ్యాంగంలోని 341(2) అధికరణ ప్రకారం ఏదైనా కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలన్నా, తొలగించాలన్నా రాజ్యాంగపరమైన ప్రక్రియ ఉంది. ముందుగా సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని జాతీయ ఎస్సీ కమిషన్‌కు నివేదిస్తుంది. ఈ కమిషన్ విచారణ జరిపి పార్లమెంట్ నివేదిస్తుంది. పార్లమెంట్ బిల్లు రూపంలో దాన్ని ఆమోదించిన తర్వాత రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా ఆ కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చుతారు. ప్రస్తుతం యూపీ రాష్ట్ర ప్రభుత్వం చట్టపరమైన ప్రక్రియని అనుసరించలేదన్నది నిపుణుల వాదన.
- మరో ముఖ్య విషయం ఏమిటంటే ఎస్సీ కులంగా పరిగణించబడాలంటే ఆర్థిక, సామాజిక వెనుకబాటుతోపాటు సంబంధిత కులం చారిత్రకంగా అణచివేత, సామాజిక వెలి, అంటరానితనం వంటి అమానవీయమైన చర్యలని అనుభవించినదై ఉండాలి. కాని యూపీ ప్రభుత్వం ఇప్పటివరకూ ఓబీసీలుగా గుర్తించబడినవారిని ఎస్సీలుగా పరిగణించడంతో వివాదం రాజుకుంది.

### జమ్ము కశ్మీర్- రిజర్వేషన్ల విస్తరణ

- ఇది నేరుగా రిజర్వేషన్ల విస్తరణకు సంబంధించిన అంశం కానప్పటికి జమ్ము కశ్మీర్ రాష్ట్ర రిజర్వేషన్ల చట్టాన్ని పార్లమెంట్ సవరించడం చర్చకు కారణమైంది. జమ్ము కశ్మీర్ రిజర్వేషన్ల చట్టం ( సవరణ) 2019 ప్రకారం ఇప్పటి వరకూ వాస్తవాధీనరేఖ (చైనాతో సరిహద్దు), అధీన రేఖ (పాక్‌తో సరిహద్దు) వెంబడి నివసించే కశ్మీరీలకు వర్తించే 3 శాతం రిజర్వేషన్లని ఇప్పుడు అంతర్జాతీయ సరిహద్దు వెంబడి నివసించే వారికి కూడా వర్తింపజేశారు. దీంతోపాటు 103 వ రాజ్యాంగ సవరణ ద్వారా అమల్లోకి వచ్చిన 10 శాతం ఈడబ్ల్యూ ఎస్ కోటాని, ప్రమోషన్లలో ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్లని కూడా జమ్మూ కశ్మీర్ కు విస్తరింపజేశారు.
- అయితే భారత రాజ్యాంగంలోని అధికరణ 370 ప్రకారం జమ్మూ కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి, ప్రత్యేక రాజ్యాంగం ఉన్నాయి. అట్లాగే భారత పార్లమెంట్ చేసే ఏ చట్టాలైనా నేరుగా జమ్మూ కశ్మీర్‌కు వర్తించవు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తప్పనిసరి. 1972లో సుప్రీం ఇచ్చిన తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అనగా కేంద్రం నియమించిన గవర్నర్‌తోపాటు, రాష్ట్ర మంత్రి మండలి. కానీ గత ఏడాది కాలంగా అక్కడ ప్రజాప్రభుత్వం లేదు. ఫలితంగా ఈ చట్టానికి కావాల్సిన రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం లభించలేదు. అయితే జమ్ము కశ్మీర్ కోసం ఉద్దేశించిన రాష్ట్రపతి ఉత్తర్వులు 1954ని సవరించడం ద్వారా కేంద్రం ఈ రిజర్వేషన్లని వర్తింపజేసింది. ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వం ఉనికిలో లేనప్పుడు ఇలాంటి చర్యలు తీసుకోవడంతో నిపుణులు విభేదిస్తున్నారు.

### ముగింపు

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి చంద్రచూడ్ మాటల్లో రిజర్వేషన్లు అనేవి సమానత్వానికి విఘాతం కాదు. అవి సమానత్వ సాధనకు ఉద్దేశించిన అస్త్రాలు. వాటిని వీలైనంత హేతుబద్ధంగా అమలు చేయడం, విస్తరించడం ప్రభుత్వాల చేతుల్లో ఉంది.



మల్లవరపు బాలలత
సీఏఎస్‌బీ సివిల్స్ అకాడమీ,
హైదరాబాద్

## సుడోకు

**డైలీ సుడోకు 91 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | 8 | 5 | 2 | 3 | 4 | 9 | 6 | 1 |
| 4 | 3 | 6 | 8 | 9 | 1 | 2 | 7 | 5 |
| 2 | 1 | 9 | 5 | 7 | 6 | 4 | 8 | 3 |
| 3 | 2 | 4 | 6 | 5 | 7 | 1 | 9 | 8 |
| 6 | 9 | 1 | 3 | 2 | 8 | 5 | 4 | 7 |
| 8 | 5 | 7 | 1 | 4 | 9 | 6 | 3 | 2 |
| 1 | 4 | 3 | 9 | 8 | 5 | 7 | 2 | 6 |
| 5 | 7 | 2 | 4 | 6 | 3 | 8 | 1 | 9 |
| 9 | 6 | 8 | 7 | 1 | 2 | 3 | 5 | 4 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

**డైలీ సుడోకు -92**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | 9 | | | 8 | | 4 |
| 4 | | 9 | | 8 | | | 1 | |
| | | | | | 7 | | | 2 |
| | 6 | | 5 | | | 1 | | |
| | 5 | | | | | | 7 | |
| | | 1 | | | 3 | | 9 | |
| 1 | | | 8 | | | | | |
| | 4 | | | 7 | | 2 | | 1 |
| 6 | | 7 | | | 5 | | | |



# డిప్లొమా న్యాయాధికారి

**ప్రతి సమాజంలో న్యాయం అనేది అత్యంత ముఖ్యపాత్ర పోషిస్తుంది. పూర్వం నైతికత మీద ఎక్కువ ఆధారపడిన న్యాయశాస్త్రం క్రమంగా అనేక శాఖలుగా విస్తరించింది. ప్రస్తుత టెక్నాలజీ యుగంలో న్యాయశాస్త్ర పండితుల అవసరం లేని రంగం లేదంటే అతిశయోక్తి కాదు. దాంతో న్యాయ నిపుణులకు కూడా విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. అందువల్ల న్యాయశాస్త్రంలోని వివిధ శాఖలకు సంబంధించిన డిప్లొమాలు అందుబాటులోకి వచ్చాయి. అందులో కొన్నింటి వివరాలు నిపుణ పాఠకుల కోసం..**


## పేటెంట్ లా/ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్

- తయారీ రంగంలో చైనా అగ్రస్థానంలో కొనసాగుతున్నది, భారతదేశంలో ఇంజినీర్లు అధికంగా ఉన్నారు, ఆఫ్రికాలో అత్యధిక సహజ సంపద ఉన్నది, రష్యాలో సహజవాయువు, చమురు నిక్షేపాలు ఎక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ అత్యంత శక్తిమంతమైన దేశంగా అమెరికా ఉన్నది. ఇది ప్రపంచంపై ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నది. దీనికి కారణం అన్ని దేశాల్లో కంటే అధిక మేధో సంపత్తి అక్కడ ఉండటమే. భారత ఆర్థికవ్యవస్థ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ.. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మానవ వనరుల కొరత ఇప్పటికీ ఉన్నది. దీంతో భారత్‌తోపాటు ప్రపంచ దేశాలు మేధో సంపత్తిని పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి.
- కొత్త ఆలోచనలు, సరికొత్త ఆవిష్కరణలు మానవ అభివృద్ధిలో భాగంగా కొనసాగుతూనే ఉంటాయి. వాటిని రక్షించడానికి, వాటిపై పేటెంట్లు కల్పించడానికి పేటెంట్ లాయర్ల అవసరం ఉన్నది. ఏదైనా ఒక వస్తువును రూపొందించినవారు వాటిపై పేటెంట్ హక్కులు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలి. వీరికి నిపుణులైన న్యాయవాదుల సహకారం అవసరమవుతుంది. దీనికి సంబంధించిన సమాచారాన్ని అదించడానికి చట్టాలకు సంబంధించిన ప్రాథమిక సూత్రాలు తెలిసి ఉండాలి. అందువల్ల విధాన రూపకర్తలు, పరిశోధకులు, సాంకేతిక, న్యాయ నిపుణులు ఈ కోర్సు చేయవచ్చు.
- పేటెంట్ చట్టానికి సంబంధించిన ప్రాథమిక అంశాలు, పేటెంట్ పొందడానికి కావాల్సిన విధానాలు, పేటెంట్ ముసాయిదా సమస్యలు, వ్యాజ్యం నమోదులో చట్టపరంగా ఎదురయ్యే సమస్యలు, పేటెంట్‌కు సంబంధించి అంతర్జాతీయ కొలమానాలు, మేధోపరంగా డబ్బు సంపాదించడంలో ఎదురయ్యే సమస్యలకు సంబంధించిన విషయాలను కోర్సులో నేర్పిస్తారు.

### కాలేజీలు

- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లా, గవర్నమెంట్ లా కాలేజ్ (ముంబై), మహాత్మా జ్యోతిరావుపూలే యూనివర్సిటీ (జైపూర్), తమిళనాడు ఓపెన్ యూనివర్సిటీ (చెన్నై), బెనారస్ హిందూ యూనిర్సిటీ (వారణాసి), బసవశ్రీ కాలేజ్ ఆఫ్ లా (కోలార్), గుజరాత్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ, ఇగ్నో ఈ కోర్సును అందిస్తున్నాయి.
- డిగ్రీ ఉత్తీర్ణులైనవారు, ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీలో మూడేండ్లు పూర్తిచేసినవారు పేటెంట్ లా చేయవచ్చు.

- ఓయూ లా విభాగం సైబర్ లా, ట్యాక్సేషన్ అండ్ ఇన్సూరెన్స్ లా, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్‌లో డిప్లొమా కోర్సులను అందిస్తున్నది.




### అవకాశాలు

- ఐపీ లాయర్లకు ఫ్యాషన్, స్పోర్ట్స్, ఫార్మా కంపెనీలు, రిసెర్చ్ సంస్థల నుంచి ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. మీడియా, ఎంటర్‌టెయిన్‌మెంట్, టెక్నాలజీ, బయోటెక్నాలజీ పరిశ్రమలు ముఖ్యంగా ఐపీ లాయర్లపై ఆధారపడి ఉంటాయి.

## డిప్లొమా ఇన్ మీడియా లా

- సమాజాన్ని ప్రభావితం చేస్తున్నవాటిలో ముఖ్యమైనది 'మీడియా'. దీన్ని ఫోర్త్ ఎస్టేట్ అని పిలుస్తున్నారు. ఇందులో న్యూస్‌పేపర్లు, మ్యాగజైన్లు, రేడియో, టీవీ, ఇంటర్నెట్ వంటివి ఉంటాయి. ప్రజా సమస్యలను ప్రభుత్వానికి తెలియజేస్తూ, ప్రభుత్వాల విధానాలు ఎలా అమలవుతున్నాయనే విషయాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తాయి.
- మీడియా అనేది ప్రస్తుతం సామాజిక, రాజకీయ అంశాలతోపాటు విద్య, వినోదం, వ్యాపారం, క్రీడలకు సంబంధించిన వార్తలను అందిస్తూ సంక్లిష్టమైన వాహకంగా తయారైంది. ప్రసార మాధ్యమాలైన రేడియో, టీవీ, వార్తాపత్రికలకు ఇంటర్నెట్ తోడవడంతో ఈ రంగం మరింత విస్తృతమైంది. అందువల్ల మీడియాలో పనిచేసేవారు, లాయర్లు, విద్యావేత్తలు మాస్ కమ్యూనికేషన్‌కు సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉన్నది. మీడియాకు సంబంధించిన చట్టపరమైన అంశాలను గురించి తెలుసుకోవడానికి ఈ కోర్సు సహాయకారిగా ఉంటుంది.
- ఎడిటోరియల్, అడ్వర్‌టైజింగ్ రంగంలో పనిచేసే మీడియా ప్రొఫెషనల్స్‌కు, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లకు, విధాన రూపకర్తలు, న్యాయవాదులు ఈ కోర్సు చేయవచ్చు.
- కోర్సులో మీడియా, ఎథిక్స్ అండ్ కాన్‌స్టిట్యూషన్, మీడియా అండ్ లా, అడ్వర్‌టైజ్‌మెంట్ అండ్ లా, ఎలక్ట్రానిక్ మీడియా అండ్ రెగ్యులేటరీ లా వంటి అంశాలు తెలుసుకోవచ్చు.

### కాలేజీలు

- సర్దార్ పటేల్ సుభార్తి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లా (ఉత్తరప్రదేశ్), న్యూ లా కాలేజ్, బీవీపీ యూనివర్సిటీ (పుణె).

### ఉద్యోగాలు

- సెలబ్రిటీల ఎండార్స్‌మెంటులు, షూటింగ్‌లు-సెట్లకు సంబంధించిన అనుమతులు, మ్యూజిక్ లైసెన్సులు, పుస్తక ముద్రణ, పైరసీ నిరోధించడానికి సంబంధించిన అంశాలను పరిష్కరించడానికి పనిచేయాల్సి ఉంటుంది.
- యష్‌రాజ్ ఫిలిమ్స్, బాలాజీ టెలిఫిలిమ్స్, సారెగామ, ఎరోస్, రిలయన్స్ వంటి మీడియా ఎంటర్‌టెయిన్‌మెంట్ కంపెనీలు, జే సాగర్ అసోసియేట్స్, నిషిత్ దేశాయ్ అసోసియేట్స్, డీఎస్‌కే లీగల్ వంటి లా సంస్థల్లో వీరికి ఉద్యోగ అవకాశాలు ఉంటాయి.

## ఇంటర్నేషనల్ హ్యూమానిటేరియన్ లా

- ఇటీవల కాలంలో మధ్యప్రాచ్య దేశాల్లో అంతర్గత పోరు, ప్రభుత్వాలపై ప్రజల తిరుగుబాట్లను మనం తరుచూ చూస్తూనే ఉన్నాం. ఇలా అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో సాయుధ పోరాటాలు, హింసలు విస్తరిస్తుండటంతో అంతర్జాతీయ మానవతా చట్టాలు ప్రాముఖ్యం సంతరించుకున్నాయి. ఇలాంటి యుద్ధాలు, ప్రభుత్వ వ్యతిరేక పోరాటల నుంచి ప్రజలకు మానవహక్కుల చట్టాలు రక్షణ కల్పిస్తాయి.
- మానవతా చట్టాలను ఉల్లంఘించేవారిని, యుద్ధ నేరస్తులను విచారించడానికి అంతర్జాతీయ నేరస్తుల కోర్టులను ఏర్పాటు చేయడానికి ఇవి అవకాశం కల్పిస్తాయి.
- మానవ హక్కులు, యుద్ధ నేరాలకు సంబంధించిన అంశాలపై అవగాహన కలిగిన, పోరాటాలు చేసేవారికి ఈ కోర్సు మంచి మాధ్యమంగా ఉపయోగపడుతుంది.
- ఏడాది కాలవ్యవధి గల ఈ కోర్సులో ఇంట్రడక్షన్ టు ఇంటర్నేషనల్ హ్యూమానిటేరియన్ లా, ప్రొటెక్షన్ ఆఫ్ విక్టిమ్స్ ఆఫ్ వార్ అండ్ ఆర్మ్‌డ్ కాన్‌ఫ్లిక్ట్స్, లిమిటేషన్స్ ఆన్ మీన్స్ అండ్ మెథడ్స్ ఆఫ్ వార్‌ఫేర్, ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ హ్యూమానిటేరియన్ లా వంటి అంశాలు తెలుసుకోవచ్చు.

### కాలేజీలు

- నల్సార్, ఇగ్నో ఈ కోర్సును అందిస్తున్నాయి.

## ఆల్టర్నేట్ డిస్ప్యూట్ రిసొల్యూషన్

- వివాదాలు అనేవి మనిషి జీవితంలో భాగంగా ఉంటాయి. నిర్దిష్టమైన చట్టం ప్రకారం ఒక వ్యక్తి దావా వేస్తాడు. దాన్ని మరో వ్యక్తి ఖండించినప్పుడు అది వివాదం అవుతుంది. ఇలాంటి కేసులు చాలా ఏండ్లుగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉంటున్నాయి. వీటిని త్వరగా పరిష్కరించడానికి వీలుగా ప్రత్యామ్నాయ వివాద పరిష్కార పద్ధతి ద్వారా ఇరువురి మధ్య రాజీ కుదిర్చి ఆయా కేసులను విరమించుకునేలా చేస్తున్నారు. ఇది తక్కువ ఖర్చుతో అందుతుండటంతో పాటు తక్కువ సమయంలో న్యాయం పూర్తవుతుండటంతో ప్రభుత్వాలు, న్యాయస్థానాలు ఈ పద్ధతిని ప్రోత్సహిస్తున్నాయి.
- ఏడాది కాలవ్యవధి కలిగిన ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిసొల్యూషన్ (ఏడీఆర్) కోర్సు ద్వారా మధ్యవర్తిత్వ ప్రక్రియలో నైపుణ్యం సాధించడంతోపాటు, వివాదాల నుంచి ఉపశమనం కల్పించవచ్చు. దీంతోపాటు వివిధ ఏడీఆర్ పద్ధతుల గురించి తెలుసుకోవచ్చు.
- ఇలాంటి మధ్యవర్తుల సేవలను కోర్టులు కూడా ఉపయోగించుకుంటాయి.
- కోర్సులో భాగంగా ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిసొల్యూషన్ సిస్టమ్స్, లా ఆఫ్ కాంట్రాక్ట్స్, లా ఆఫ్ ఆర్బిట్రేషన్ అండ్ కన్సిలియేషన్ ఇన్ ఇండియా, ఇంటర్నేషనల్ కమర్షియల్ ఆర్బిట్రేషన్ వంటి అంశాలు తెలుసుకోవచ్చు.

### కాలేజీలు

- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఏడీఆర్ (బెంగళూరు), ఎల్‌ఏ షా లా కాలేజ్ (గుజరాత్), భారతి విద్యాపీఠ్ (పుణె)

### ఉద్యోగాలు

- చైల్డ్ ప్రొటెక్షన్, హ్యూమన్ రైట్స్, IPRs, సైబర్ లా సంబంధిత కంపెనీలకు కన్సల్టెంట్‌గా పనిచేయవచ్చు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో న్యాయాధికారిగా, జ్యుడీషియల్ ఆఫీసర్‌గా ఉద్యోగం పొందవచ్చు. సొంతంగా ప్రాక్టీస్ చేసుకోవచ్చు.

## సైబర్ లా

- వృత్తిపరమైన, వ్యాపార సంబంధ పరిశ్రమల్లో పనిచేయడానికి సమాచార సాంకేతిక పరిజ్ఞానం ప్రస్తుతం తప్పనిసరిగా మారింది. టెక్నాలజీని ఉపయోగించి తక్కువ సమయంలో ఎక్కువ ఫలితాలను పొందే అవకాశం ఏర్పడింది. అయితే దీన్ని ఆసరాగా చేసుకుని మోసాలు కూడా జరుగుతున్నాయి. వ్యక్తులు, సంస్థలకు సంబంధించిన రహస్య సమాచారాన్ని సేకరించి కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. దీన్ని అరికట్టడానికి ప్రభుత్వాలు సైబర్ చట్టాలను రూపొందిస్తున్నాయి. వీటికి సంబంధించిన కోర్సులను వివిధ విద్యాసంస్థలు అందిస్తున్నాయి.
- సైబర్ లా డిప్లొమా కోర్సు ద్వారా ఇంటర్నెట్ వాడకం, దానివల్ల వచ్చే న్యాయపరమైన సమస్యల గురించి తెలుసుకోవచ్చు. దీంతోపాటు ఎలక్ట్రానిక్ గవర్నెన్స్, సెక్యూరిటీ ఆఫ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ, టెలికమ్యూనికేషన్స్, డాటా ప్రొటెక్షన్, ప్రైవసీ వంటి అంశాల గురించి నేర్చుకోవచ్చు.


- నల్సార్‌లో డిప్లొమా ఇన్ ఫ్యామిలీ రిసొల్యూషన్, పేటెంట్ లా, సైబర్ లా, మీడియా లా, ఇంటర్నేషనల్ హ్యూమానిటేరియన్ లా, ఏవియేషన్ లా, జీఐఎస్ అండ్ రిమోట్ సెన్సింగ్ లా (పీజీడీజీఆర్ఎల్) కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

### అవకాశాలు

- ఇంటర్నెట్, ఇన్ఫర్మేన్ టెక్నాలజీ ఆధారిత సమస్యలు, నేరాలు రోజురోజుకు అధికమవుతున్నాయి. దీంతో ఈ కోర్సు చేసిన వారికి డిమాండ్ అధికంగా ఉంటుంది. వీరు పోలీసు శాఖలో, కార్పొరేట్ సంస్థలు, ఐటీ కంపెనీల్లో సైబర్ కన్సల్టెంట్లుగా, రిసెర్చ్ అనలిస్టులు, సెక్యూరిటీ ఆడిటర్లు, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్లు, సైబర్ లాయర్లుగా, సైబర్ లేదా ఐటీ ఆధారిత ఆర్బిట్రేషన్ స్పెషలిస్టుగా, కంప్యూటర్ సెక్యూరిటీలో టెక్నో-లీగల్ ప్రొఫెషనల్‌గా ఉద్యోగాలు పొందవచ్చు.

### కాలేజీలు

- నల్సార్, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఐఐఎం), ఏషియన్ స్కూల్ ఆఫ్ సైబర్ లా (పుణె, గోవా, మహారాష్ట్ర, తమిళనాడు), భారతి విద్యాపీఠ్ (పుణె), సెంట్రల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (జబల్‌పూర్), గవర్నమెంట్ లా కాలేజ్ (ముంబై), డీవై పాటిల్ లా కాలేజ్ (పుణె) ఈ కోర్సును అందిస్తున్నాయి.




## డిప్లొమా ఇన్ ఫ్యామిలీ రిసొల్యూషన్

- ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, శక్తికి మించిన శ్రమ మానవ జీవితాలను ఎన్నో రకాలుగా ప్రభావితం చేస్తున్నాయి. విచ్ఛిన్నమైన ఉమ్మడి కుటుంబవ్యవస్థ, పతనమవుతున్న మానవీయ విలువలు ఒకే కుటుంబంలోని వ్యక్తుల మధ్య సంబంధాలను దెబ్బతీస్తున్నాయి. ఫలితంగా వివాహ సంబంధ గొడవలు, విడాకుల కేసులు, ఉమ్మడి కుటుంబాలకు సంబంధించిన ఆస్తుల పంపకం గొడవలు పెరిగిపోతున్నాయి. ఇలాంటి కేసులు పరిష్కారం కావడానికి చాలా సమయం పడుతుంది. ఈలోగా ఫిర్యాదుదారులు భావోద్వేగాలపరంగా, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుంది. అందుకే ఇలాంటి కేసులు సత్వరమే పరిష్కారం కావాలంటే మ్యారేజ్ & ఫ్యామిలీ కౌన్సెలర్ల అవసరం చాలా ఉంది. పాశ్చాత్య దేశాల్లో ఇలాంటి కుటుంబ గొడవలను పరిష్కరించడంలో వందల మంది ఫ్యామిలీ కౌన్సెలర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం మన దేశంలో కూడా శిక్షణపొందిన ఫ్యామిలీ కౌన్సెలర్లకు ఫుల్ డిమాండ్ ఉంది.
- ఈ కోర్సు చేసినవారు చట్టంలోని ప్రాథమిక అంశాలపై అవగాహన కలిగి ఉండి తమ క్లయింట్లకు సరైన సూచనలు, సలహాలు ఇవ్వగలుగుతారు. ఒక కేసులో ప్రవేశం ఉన్న రెండు పార్టీలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపగల నేర్పు వీరు కలిగి ఉంటారు.

## డిప్లొమా ఇన్ అడ్వాన్స్‌డ్ మారిటైమ్ లాస్

- దేశానికి ఇతర దేశాలకు మధ్య 90 శాతానిపైగా వాణిజ్యం సముద్ర మార్గాల ద్వారానే జరుగుతున్నది. అందుకే దేశంలో సముద్ర న్యాయ చట్టాలపై నైపుణ్యం కలిగిన నిపుణుల అవసరం ఉన్నది. దీంతో దేశంలో సముద్ర న్యాయ విద్యను బలోపేతం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కార్పొరేట్ షిప్పింగ్, ఇన్సూరెన్స్ అండ్ పోర్ట్ మేనేజ్‌మెంట్ వంటి వ్యవహారాలు చక్కబెట్టే చట్టబద్ధమైన షిప్పింగ్ సంస్థలు.. జాతీయ, అంతర్జాతీయ మారిటైమ్ సెక్టార్లో నైపుణ్యం కలిగినవారి కోసం వెతుకుతున్నాయి.
- ఈ కోర్సు పూర్తిచేసిన వారు సముద్ర వాణిజ్య రంగంలో వివిధ హోదాల్లో పనిచేయవచ్చు.

## డిప్లొమా ఇన్ ఫైనాన్షియల్ సర్వీస్ అండ్ లెజిస్లేషన్స్

- ఒక దేశంలో ఆర్థిక సేవల రంగం ప్రధానమైనది. బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు, స్టాక్ బ్రోకరేజీలు, అనుబంధ సేవల వంటి విస్తృత వ్యాపారాలతో ఆదాయాల పరంగా ఇది ప్రపంచంలోనే అతిపెద్ద రంగం. ఒక దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఇది తప్పనిసరి. నూతన ఆర్థిక వ్యవస్థలు అభివృద్ధి చెందడానికి, పెట్టుబడులు, ఆవిష్కరణలకు, మార్కెట్లు బలపడటానికి సమర్థమైన లేదా బలమైన చట్టాలు అవసరం. సరైన చట్టాలు లేనప్పుడు వ్యాపారాలపై తగిన నియంత్రణ కొరవడటంతోపాటు ప్రభుత్వాలపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతుంది. అందువల్ల పెట్టుబడిదారులు, ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మార్కెట్లు, వ్యవస్థలను ఆధునీకరించడానికి, నియంత్రించడానికి ప్రభుత్వాలు చట్టాలను రూపొందిస్తాయి.
- ఫైనాన్షియల్ సర్వీస్ సెక్టార్‌లోని నిపుణులు చట్టాలను రూపొందించడం ద్వారా దేశ స్థూల ఆర్థిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇలాంటివారికి ఆర్థిక సేవల పరిధిపై అవగాహన కల్పించడానికి, వాటిని నియంత్రించే చట్టాలను తయారు చేయడానికి అనుగుణంగా ఈ కోర్సును రూపొందించారు. ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్, సర్వీసుల్లో రాణించాలనుకునేవారికి ఈ కోర్సు ఉపయుక్తంగా ఉంటుంది. వీరితోపాటు లీగల్, కౌంటింగ్, మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, ఎకనామిక్స్, లెండింగ్ అండ్ బారోయింగ్, సేల్స్, మార్కెటింగ్, బ్యాంకింగ్ వంటి రంగాల్లో ఉండేవారు చార్టర్డ్ అకౌంటెంట్లు, కాస్ట్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీలు, విధాన రూపకర్తలు, టెక్నికల్ అండ్ లీగల్ ప్రొఫెషనల్స్, లా విద్యార్థులు ఈ కోర్సు చేయవచ్చు.
- డిగ్రీ పూర్తిచేసినవారు, ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీ కోర్సులో మూడేండ్లు పూర్తి చేసినవారు, ఐసీఎస్ఐ/ఐసీఏఐ లేదా ఐసీఎంఏఐ, ఐపీసీసీలో సభ్యత్వం కలిగినవారు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యాక్చువరీస్ ఆఫ్ ఇండియా (ఐఏఐ)లో సభ్యత్వం ఉన్నవారు ఈ కోర్సు చేయవచ్చు.

... గణేష్ సుంకరి

---

# మౌఖికంలో భిన్నత్వం

## గ్రూప్-2 ఇంటర్వ్యూ గైడెన్స్

**గ్రూప్-2 ఉద్యోగాల ఎంపికకు సంబంధించి జరుగుతున్న ఇంటర్వ్యూల్లో అభ్యర్థి వ్యక్తిగత వివరాలను, సామాజిక నేపథ్యాన్ని, ప్రాంత వివరాలను అడగకుండా.. తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి (కోడింగ్, డికోడింగ్ విధానం) అభ్యర్థి వ్యక్తిగత వివరాలతో సంబంధం లేకుండా సామార్థ్యాన్ని అంచనా వేయడం జరుగుతున్నది. కాబట్టి ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు కింది అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రిపేర్ కావాలి.**

**ఇప్పటివరకు చేస్తున్న ఉద్యోగాలపై సంపూర్ణ అవగాహన/స్పష్టత ఉన్నదా? లేదా?**

- సాధారణంగా ఇప్పటివరకు ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థుల్లో ఎక్కువమంది జూనియర్ పంచాయతీ కార్యదర్శి, ప్రభుత్వ టీచర్లు, ఇతర ప్రభుత్వ విభాగాల్లో జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, కానిస్టేబుల్, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నవారు ఉన్నారు. ఇకముందు హాజరయ్యే వారిలో కూడా వీరి సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. కాబట్టి అభ్యర్థులను ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాల విధులు, బాధ్యతలు, సమస్యలు వాటికి పరిష్కారాలు, భవిష్యత్ కార్యాచరణ, గ్రూప్-2 ఉద్యోగం పొందితే గత అనుభవం ఏ మేరకు ఉపయోగపడుతుందన్న కోణంలో ఎక్కువగా ప్రశ్నలు అడగటం జరుగుతున్నది.

**జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న అభ్యర్థులను ఎక్కువగా అడుగుతున్న ప్రశ్నలు**

- పంచాయతీ కార్యదర్శి విధులు, బాధ్యతలు
- తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం ప్రాముఖ్యత
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం-1994, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018ల మధ్య ప్రధాన తేడాలు.
- గ్రామంలోని ప్రధాన సమస్యలు
- గ్రామీణాభివృద్ధి వ్యూహాలు
- ఆదర్శ గ్రామపంచాయతీ అంటే?
- గ్రామస్థాయి పరిపాలన
- ప్రజాప్రతినిధులకు, పంచాయతీ కార్యదర్శికి సంబంధాలు
- గ్రామసభ పాత్ర
- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తీరుతెన్నులు
- గ్రామపంచాయతీకి ఆదాయ వనరులు
- ఇంటి పన్ను వసూళ్లలో సవాళ్లు
- గ్రామాల సమగ్ర అభివృద్ధికి సలహాలు, సూచనలు
- జిల్లాలు, మండలాల వికేంద్రీకరణ, కొత్తగ్రామ పంచాయతీల ఏర్పాటు, ప్రభావం
- గ్రామస్థాయిలో విద్య, ఆరోగ్యం, స్థితిగతులు
- పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన అనుభవం, భవిష్యత్‌లో గ్రూప్-2 ఉద్యోగంలో ఎలా ఉపయోగపడుతుంది.
- గ్రామస్థాయిలో అవినీతి ఏయే రూపంలో ఉన్నది
- మరుగుదొడ్ల నిర్మాణం వందశాతం సాధించలేకపోవడానికి కారణాలు
- పంచాయతీరాజ్ చట్టంలో ప్రజల బాధ్యత గురించి పేర్కొన్న అంశాలు
- గ్రామస్థాయిలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి పాత్ర
- సర్పంచ్, ఉపసర్పంచ్‌కు చెక్‌పవర్ అంశం
- గ్రామపంచాయతీ అకౌంట్, ఆడిట్‌లో పంచాయతీ కార్యదర్శి పాత్ర
- టాం, టాం వేయించడంవలన కలిగే ప్రయోజనాలు
- గ్రామస్థాయిలో మూఢనమ్మకాలవల్ల కలిగే నష్టం, ప్రజల్లో ఎలా చైతన్యం కలిగిస్తారు
- గ్రామస్థాయిలో కులాల ఆధిపత్యం, రాజకీయ జోక్యాన్ని ఎలా అధిగమించారు
- గ్రామస్థాయి పరిపాలనలో ప్రజాప్రతినిధులు, గ్రామసభ అవసరం, పాత్ర
- గ్రామంలోని షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులు, మహిళలు, వికలాంగులు తదితర బలహీన వర్గాలకు ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ, సదుపాయాలు, వాటి ప్రభావం
- ఉత్తమ పంచాయతీ కార్యదర్శి అంటే ఎవరు?
- పంచాయతీ ఎన్నికల ప్రత్యేకత
- గ్రామీణ సమాజంలో విధులు నిర్వహించే ప్రభుత్వ అధికారికి ఉండాల్సిన లక్షణాలు

**ప్రభుత్వ టీచర్లకు సంబంధించి ఇంటర్వ్యూలో అడగటానికి అవకాశమున్న ప్రశ్నలు**

- టీచర్ ఉద్యోగాన్ని వదిలి గ్రూప్-2 ఉద్యోగాలకు ఎందుకు వస్తున్నారు?
- టీచర్ ఉద్యోగంలో సంతోషంగా ఉన్నారా
- ఉత్తమ ఉపాధ్యాయులు అంటే ఎవరు
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎందుకు తక్కువగా ఉన్నది
- ప్రభుత్వ టీచర్లలో క్రమశిక్షణ ఏ మేరకు ఉన్నది
- ప్రభుత్వ టీచర్ల సమస్యలు
- గురుకుల విద్యావిధానం అవసరం గురించి
- ఆంగ్ల మాధ్యమంలో బోధన అవసరం
- విద్యలో నైతిక విలువల అవసరం
- ఉపాధ్యాయ అనుభవం ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలలో ఎలా ఉపయోగపడుతుంది
- ఉత్తమ బోధన విధానం
- విద్యాహక్కు చట్టం-2009 ప్రభావం
- నూతన విద్యావిధానం
- మానవాభివృద్ధికి విద్య అవసరం?
- వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో విద్య పాత్ర

**పంచాయతీ కార్యదర్శి విధులు, బాధ్యతలు**

- తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 43లో పంచాయతీ కార్యదర్శి విధులు, బాధ్యతలను పేర్కొన్నారు.
- సెక్షన్ 6(8) ప్రకారం గ్రామపంచాయతీ అభివృద్ధికి అవసరమైన ఎజెండాను తయారుచేసి గ్రామపంచాయతీతో ఆమోదింపచేసుకోవాలి.
- గ్రామపంచాయతీకి విధేయంగా ఉంటూ పరిపాలన పరంగా సర్పంచ్ ఆధీనంలో పనిచేయడం.
- గ్రామపంచాయతీ పరిధిలోని షెడ్యూల్డ్ కులాలు, తెగలు ఇతర వెనుకబడిన తరగతుల నివాసాలను సందర్శించి వారికి ప్రభుత్వం కల్పించిన సదుపాయాలు చేరుతున్నాయో లేదో పరిశీలించడం. ముఖ్యంగా అంటరానితనం నిర్మూలనకు కృషి చేయడం
- వార్షిక పరిపాలన నివేదికను రూపొందించి గ్రామపంచాయతీకి సమర్పించడం, గ్రామపంచాయతీ ఆస్తులను కాపాడటం
- ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అధికారులకు సహకరించడం
- వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవడం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన సంక్షేమ పథకాల విషయంలో లబ్ధిదారుల ఎంపిక, ఆ పథకాల అమలులో పాల్గొనడం
- పింఛన్ల పంపిణీ
- గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించడం
- మొక్కలను నాటించడం వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవడం
- మండల స్థాయిలోని మండల అభివృద్ధి అధికారి, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ అప్పజెప్పిన పనులను నిర్వహించడం వంటివి పంచాయతీ కార్యదర్శి విధుల్లో భాగంగా ఉంటాయి.

**నూతన విద్యా విధానం-2019 ముసాయిదా**

- దేశ భవిష్యత్ తరగతి గదులల్లో రూపుదిద్దుకుంటుంది. కాబట్టి విద్యకు ప్రపంచ దేశాలన్నింటిలో మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారు. వేగంగా మారుతున్న విద్యా అవసరాలకు అనుగుణంగా విజ్ఞాన ఆధారిత సమాజాల నిర్మాణానికి విద్యాసంస్కరణలు అనివార్యం.ఇందులో భాగంగానే భారతదేశంలో నూతన విద్యా విధానాన్ని రూపొందించారు.

**కస్తూరి రంగన్ కమిటీ (నూతన విద్యావిధానం) సిఫార్సులు**

- మానవ వనరుల మంత్రిత్వశాఖ పేరును విద్యామంత్రిత్వశాఖగా మార్చడం
- జాతీయ స్థాయిలో విద్యాప్రగతిని పర్యవేక్షించడానికి గాను ప్రధానమంత్రి అధ్యక్షతన జాతీయ విద్యాకమిషన్ ఏర్పాటు
- శిశు విద్య (3 ఏండ్లు) నుంచి ఇంటర్ వరకు పాఠశాల విద్యగా పరిగణించడం
- 5వ తరగతి వరకు మాతృభాషలో విద్యాబోధన తప్పనిసరి.
- 9 నుంచి 12వ తరగతి పాఠ్యప్రణాళికలో కరెంట్ అఫైర్స్‌ను చేర్చడం, డిజిటల్ విద్యను ప్రోత్సహించడం
- త్రిభాషా సూత్రాన్ని కొనసాగిస్తూనే విదేశీ భాషలకు కూడా ప్రాధాన్యం పెంచడం
- సెమిస్టర్ల విధానాన్ని ఇప్పుడున్న 1 నుంచి 8 తరగతులు, 10 నుంచి 12వ తరగతులకు విస్తరించడం
- రాబోయే 5 ఏండ్లలో ఉన్నత విద్యారంగంలో ప్రవేశాలను రెట్టింపు చేయాలి
- ప్రపంచంలోని మొదటి వెయ్యి విశ్వవిద్యాలయాల జాబితాలో కనీసం 50 భారతీయ విశ్వవిద్యాలయాలు ఉండేటట్లు కృషిచేయడం
- విద్యలో నాణ్యతకు భరోసా ఇచ్చే విధంగా అన్ని విద్యాసంస్థలకు అక్రిడేషన్ (గుర్తింపు) ఇవ్వడం
- ఉన్నత విద్యారంగంలో పెట్టుబడులను రెట్టింపుచేయడం
- విద్యారంగంలో భారత్‌ను ప్రపంచ గమ్యస్థానంగా మార్చడం



నూతనకంటి వెంకట్
జాయింట్ సెక్రటరీ
గ్రూప్-1 అధికారుల సంఘం
9849186827

IV.
నమస్తే తెలంగాణ
చిత్రం
కరీంనగర్
సోమవారం 15 జూలై 2019



అన్యాసింగ్

**"'నిను వీడని నీడను నేనే'లో సహజమైన నటనను కనబరిచానని ప్రశంసిస్తున్నారు. భావోద్వేగ ప్రధానంగా సాగే నా పాత్రతో ప్రేక్షకులు కనెక్ట్ అవుతున్నారు' అని చెప్పింది అన్యాసింగ్. ఆమె కథానాయికగా నటించిన చిత్రం 'నిను వీడని నీడను నేనే'. సందీప్‌కిషన్ హీరోగా నటించిన ఈ చిత్రానికి కార్తిక్‌రాజు దర్శకత్వం వహించారు. ఇటీవలే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆదివారం హైదరాబాద్‌లో అన్యాసింగ్ పాత్రికేయులతో ముచ్చటించింది.**

# హారర్ సినిమాలంటే భయం!

ఢిల్లీ నా స్వస్థలం. బీఏ రాజనీతిశాస్త్రం చదివాను. 'నిను వీడని నీడను నేనే' సినిమాతో పాటు నా పాత్రకు మంచి స్పందన లభిస్తున్నది. ప్రథమార్థంలో వినోదం, ద్వితీయార్థంలోని ఎమోషన్స్ ఆకట్టుకుంటున్నాయని చెబుతున్నారు. విడుదల రోజు ఉదయం సినిమాపై నెగెటివ్ కామెంట్స్ రావడంతో నిరాశపడ్డాను. కానీ విమర్శకులతో పాటు సోషల్‌మీడియాలో చాలా మంది సినిమా బాగుందని రాసిన వార్తలు చూసి ఆ టెన్షన్ మొత్తం పోయింది. బాలీవుడ్ చిత్రం 'ఖైదీ బాండ్'లో నా నటన చూసి సందీప్‌కిషన్ ఈ సినిమాలో అవకాశమిచ్చారు. భావోద్వేగాలతో ముడిపడిన పాత్ర కావడంతో 20 రోజుల పాటు పాత్ర కోసం ముందుగానే సన్నద్ధమయ్యాను. హారర్ సన్నివేశాల్లో ఈజీగానే నటించినా ఎమోషన్స్ పండించడం కోసం కష్టపడాల్సివచ్చింది.

**యశ్‌రాజ్ సంస్థలో మూడు సినిమాలు..**

హారర్ సినిమాలంటే భయం. ఆ సినిమాల్ని చూడను. వాటిలో నటించడం కూడా ఇష్టం ఉండదు. కుటుంబ విలువలతో ముడిపడిన మంచి కథ కావడంతో ఈ సినిమాను అంగీకరించాను. థ్రిల్లర్ నా ఫేవరేట్ జోనర్. తెలుగు భాషపై అవగాహన లేకపోవడంతో చిత్రీకరణలో సందీప్‌కిషన్ చక్కటి సహకారం అందించారు. సినిమా పట్ల తనకున్న అంకితభావం నన్ను ఆకట్టుకున్నది. సినిమాపై పాజిటివ్ టాక్‌తో పాటు కొన్ని విమర్శలు వచ్చాయి. వాటిని నేను స్వీకరిస్తున్నాను. తెలుగులో అవకాశాలు వస్తున్నాయి. బాలీవుడ్‌లో యశ్‌రాజ్ సంస్థలోమూడు సినిమాలకు అగ్రిమెంట్ చేశాను. భాషభేదాలతో సంబంధం లేకుండా కథ, పాత్రలు నచ్చితే ఎక్కడైనా సినిమా చేస్తాను

# సీతగా నయనతార?



నయనతార

'శ్రీరామరాజ్యం' సినిమాలో సీత పాత్రలో చక్కటి అభినయాన్ని ప్రదర్శించింది నయనతార. తాజాగా ఆమె మరోసారి ఈ ఇతిహాస పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. రామాయణం ఆధారంగా త్రీడీ హంగులతో నిర్మాతలు అల్లు అరవింద్, నమిత్ మల్హోత్ర, మధు మంతెన 'రామాయణ్' సినిమాను తెరకెక్కించనున్నారు. తెలుగు, హిందీ భాషల్లో మూడు భాగాలుగా రూపొందనున్న ఈ చిత్రానికి నితీష్ తివారి, రవి ఉద్యావార్ దర్శకత్వం వహించబోతున్నారు. ఈ సినిమాలో సీత పాత్ర కోసం నయనతారను తీసుకోవాలని చిత్రబృందం నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఆమెతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. డిసెంబర్‌లో ఈ సినిమా సెట్స్ పైకి రానుంది. 2021లో తొలిభాగాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# రవితేజకు జోడీగా..



అదితీరావు

ఇంద్రగంటి మోహనకృష్ణ రూపొందించిన 'సమ్మోహనం'తో తెలుగులో తొలి విజయాన్ని సొంతం చేసుకుంది బాలీవుడ్ సోయగం అదితీరావు హైదరి. ప్రస్తుతం నాని, సుధీర్‌బాబు కలిసి నటిస్తున్న 'వి' చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ దశలో వుండగానే అదితిరావు హైదరి తెలుగులో మరో చిత్రాన్ని అంగీకరించినట్లు తెలిసింది. 'ఆర్‌ఎక్స్ 100'తో సంచలన విజయాన్ని సొంతం చేసుకున్నారు దర్శకుడు అజయ్ భూపతి. ఈ సినిమా తరువాత ఆయన మరో చిత్రాన్ని తెరకెక్కించడానికి సిద్ధమవుతున్నారు. రవితేజ కథానాయకుడిగా నటించనున్నారు. క్రైమ్ థ్రిల్లర్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న చిత్రానికి 'మహా సముద్రం' అనే టైటిల్‌ని చిత్ర బృందం ఇప్పటికే ఖరారు చేసినట్లు తెలిసింది. త్వరలో సెట్స్‌పైకి రాబోతున్న ఈ చిత్రంలో రవితేజకు జోడీగా దర్శకుడు అదితీరావు హైదరీని ఖరారు చేయాలనే ఆలోచనలో వున్నట్లు తెలిసింది. త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారట. ఈ చిత్రాన్ని ఓ దశలో నాగచైతన్య, ఆ తరువాత నితిన్ చేయబోతున్నారని ప్రచారం జరిగింది. అయితే తాజాగా రవితేజని దర్శకుడు ఫైనల్ చేసుకున్నారు. 'డిస్కోరాజా' పూర్తి కాగానే రవితేజ ఈ సినిమా చిత్రీకరణలో పాల్గొననున్నారని తెలిసింది.

# పహిల్వాన్ పోరాటం



సుదీప్

సుదీప్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా కన్నడ చిత్రం 'పహిల్వాన్' అదే పేరుతో తెలుగులో అనువాదమవుతున్నది. ఎస్.కృష్ణ దర్శకత్వం వహించారు. వారాహి చలన చిత్రం సంస్థ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నది. ఆగస్ట్ 29న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఈ చిత్రంలో సుదీప్ రెజ్లర్ పాత్రలో కనిపిస్తారు. ఆయన పాత్ర చిత్రణ శక్తివంతంగా సాగుతుంది. లక్ష్యసాధన కోసం పహిల్వాన్ పోరాటమేమిటన్నది స్ఫూర్తివంతంగా ఉంటుంది. బాలీవుడ్ నటుడు సునీల్‌శెట్టి, ఆకాంక్షసింగ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇటీవలే చిరంజీవి విడుదల చేసిన ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన లభిస్తున్నది' అన్నారు. తెలుగులో ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: కరుణాకర్, స్క్రీన్‌ప్లే: కృష్ణ, మధు, కన్నన్, సంభాషణలు: హనుమాన్‌చౌదరి, రచన–దర్శకత్వం: ఎస్.కృష్ణ.

# 'వనవాసం' గీతాలు



శ్రావ్య, నవీన్‌రాజ్

నవీన్‌రాజ్, శశికాంత్, శ్రావ్య, శృతి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'వనవాసం'. భరత్, నరేంద్ర దర్శకులు. సంజయ్‌కుమార్ నిర్మాత. ఈ చిత్ర ఆడియో ఆవిష్కరణ శనివారం జరిగింది. దర్శకుడు మాట్లాడుతూ 'వినూత్నమైన కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ప్రతి సన్నివేశం ఆసక్తికరంగా సాగుతుంది' అన్నారు. 'ట్రైలర్ అందరిని ఆకట్టుకుంటున్నది. వైవిధ్యమైన కథ, కథనాలతో సాగే చిత్రమిది. అల్లరి నరేష్ ఈ సినిమాను ప్రోత్సహించడం ఆనందంగా ఉంది. సంగీత దర్శకుడు మోహన్ చక్కటి బాణీలందించారు' అని నిర్మాత తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లరి నరేష్, రాజ్ కందుకూరి తదితరులు పాల్గొన్నారు.

# 'భీష్మ'లో హెబ్బాపటేల్!



హెబ్బా పటేల్

'కుమారి 21ఎఫ్' చిత్రంతో యువతరంలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది గుజరాతీ సోయగం హెబ్బా పటేల్. ఆ తర్వాత 'ఎక్కడికి పోతావు చిన్నవాడా' '24 కిస్సెస్' చిత్రాల్లో కనిపించింది. గత ఏడాదికాలంగా ఈ అమ్మడు తెలుగు సినిమాలకు దూరంగా ఉంటున్నది. తాజాగా ఈ సొగసరి నితిన్‌కు జోడీగా నటించబోతున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే..ప్రస్తుతం నితిన్ 'భీష్మ' చిత్రంలో నటిస్తున్నారు. వెంకీ కుడుముల దర్శకుడు. రష్మిక కథానాయికగా నటిస్తున్నది. ఈ చిత్రంలో హెబ్బాపటేల్ కీలక పాత్రలో నటించబోతున్నట్లు తెలిసింది. పాత్ర నిడివి తక్కువే అయినప్పటికీ అభినయానికి ఆస్కారం ఉండటంతో ఈ సినిమాలో నటించేందుకు హెబ్బా పటేల్ అంగీకరించిదని చెబుతున్నారు. ఈ చిత్రం కోసం హెబ్బాపటేల్ బరువు తగ్గి స్లిమ్‌గా తయారైందట. ప్రస్తుతం ఆమె షూటింగ్‌లో పాల్గొంటున్నట్లు తెలిసింది. డిసెంబర్‌లో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు.

# బైలంపూడి యుద్ధం



తనిష్క్, హరీశ్

బ్రహ్మానందరెడ్డి నటిస్తూ నిర్మించిన చిత్రం 'బైలంపూడి'. అనిల్.పి.రాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. హరీష్ వినయ్, తనిష్క్ తివారి నాయకానాయికలుగా నటించారు. ఈ నెల 27న ఈ చిత్రం విడుదలకానుంది. శనివారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక జరిగింది. నిర్మాత మాట్లాడుతూ 'బైలంపూడి అనే ఊరిలో జరిగే కథ ఇది. బతకడానికి ఓ యువకుడు సాగించిన సమరమే ఈ చిత్ర ఇతివృత్తం. గ్రామీణ జీవనాన్ని వాస్తవికతకు దగ్గరగా ఈ సినిమాలో ఆవిష్కరించాం' అని తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ 'యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను రూపొందించాం. చోడవరం ప్రాంతంలో చిత్రీకరణ జరిపాం' అని చెప్పారు. కొత్తవాళ్లు చాలా మంది సినీ పరిశ్రమలో అడుగుపెట్టి తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారని, ఈ సినిమా విజయవంతమై అందరికి మంచి పేరుతెచ్చిపెట్టాలని హాస్యనటుడు అలీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాగర్, బెనర్జీ, డైమండ్ రత్నబాబు, శివనిర్వాణ తదితరులు పాల్గొన్నారు.

